# అమెరికామెడీ

\- వంగూరి చిట్టెన్ రాజు




శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 6

# విషయ సూచిక


| కామెడీ | పేజీ |
|---|---|
| దేశం పురోగమించింది | 3 |
| సాహితీ సదస్సులూ - రికార్డింగ్ డాన్సులూ | 6 |
| తెకోరాడీ తె.సా. సదస్సు | 9 |
| నాటకాలూ-నానా అవస్థలూ | 13 |
| ముఖ్యమంత్రులూ - ముసిరే దోమలూ | 16 |
| క్లింటన్ దాదా - జిందాబాద్ | 19 |
| ఆంధ్రా విలేఖరులూ - అమెరికా ఎన్నారైలూ | 22 |
| అమెరికా పనివాళ్ళు - పోలీసులూ | 26 |
| మటన్ స్రామాట్ కథ | 28 |
| అమెరికా పలకరింపులు | 30 |
| తెలుగింగ్లీషు సంఘాలు ఆఫ్ అమెరికా | 31 |
| సన్మానాలు - గిన్మానాలు | 34 |
| బచ్చన్ గారి బచ్చలి తైలం | 38 |
| బాబోయ్ అంకుల్ శ్యాం | 40 |
| ఓ నా మంచి దేముడా! మళ్ళీ మరొక సాహితీ సదస్సా? | 42 |
| గిన్నెస్ బుక్కూ - నాకొచ్చిన చిక్కూ | 44 |
| బేనర్ పవర్ | 47 |
| మంచైతే మైకులో చెప్పు - చెడైతే చెవిలో చెప్పు | 49 |
| అమెరికాలో అంధకారం | 51 |
| జట్కాలో తంటాలు - తంటాలో మంటలు | 53 |
| నా బుల్లి తెరంగేట్రం | 58 |






# దేశం పురోగమించింది

**అసలు ఏమయిందంటే,** కొన్ని నెలల క్రితం ఒకానొకరోజు తెల్లవారుఝామున నాకు ఓ కల వచ్చింది. ఆ టైములో వచ్చిన కలలు నిజమవుతాయి అని కదా అమాయకులందరి నమ్మకమూనూ. కనీసం ఈ సారి అయినా మా టెక్సస్ లాటరీలో కనీసం నాలుగువేల మూడువందల డాలర్ల నలభైమూడు సెంట్లు వచ్చినట్లు ఒకానొక 'ఆవు అమ్మాయి'.....అనగా మా టెక్సస్ 'కౌ గర్ల్' కబురు మోసుకొచ్చిందేమో అని అని ఠకీ మని లేచి కూచుని "థేంక్యూ, యూ రియల్లీ సేవ్డ్ మై లైఫ్ ఫర్ వన్ వీక్" అని ఆ ఆడకూతురితో ఇంకా ఏదో అనబోయాను ఆనందం పట్ట లేక. ఎందుకంటే అంతకు ఐదు గంటల ముందే, యధాప్రకారం వచ్చే నెల ఇంటి మార్ట్‌గేజ్ పేమెంటూ, మా అబ్బాయికి చ్యూయింగ్ గమ్మూ, అమ్మాయి కారు మరియు కాలేజీ ఫీజు మొదలైన వాటికి కావలసిన "రొఖ్ఖం"....అంటే డబ్బు ఎక్కడ వెతుక్కోవాలా అని ఆలోచిస్తూ పడుకున్నాను. పైకి చెప్పరు కానీ రాబోయే వారం ఇంటి ఖర్చులు ఎలాగ రా బాబోయ్ అని రోజూ రాత్రి పడుకునే ముందో, పెళ్ళాం చేత ప్రైవేటు చెప్పించుకునేటప్పుడో అలాటి ఆలోచనలు రావడం అమెరికాలో అందరికీ అలవాటే.

"నాతో ఏమిటా వెధవ అంగ్రేజీ వాగుడు? తల్లితో మాట్లాడే పద్ధతేనా అది? " అంది మా బెడ్ రూంలో ఒక మూల నుంచి ఒక ఆడ గొంతు. ఈ సారి కూడా లాటరీ తగల్లేదని నిరాశగా ఉన్నా, మా అమ్మ కలలోకి వచ్చిందేమో అనుకుని "నువ్వా అమ్మా, ఎలా ఉన్నావు? స్వర్గంలో అందరూ, ముఖ్యంగా, ఎన్టీఆరూ, సావిత్రీ అంతా బావున్నారా?" అని కుశలం అడిగాను.

"నీ మొహం, నేనెవరో తెలుసా? నన్ను తెలుగు తల్లి అంటారు, ఋజువు కావాలంటే హైదరాబాదులో నా విగ్రహం కూడా ఉంది. అవునులే ఎక్కడో అమెరికాలో ఉన్నావు కదా. ఈ మధ్య నన్ను చూసి ఉండవు, అఫ్ కోర్స్, హోల్ మొత్తం ఆంధ్రప్రదేష్‌లో కూడా నన్ను ఇంగ్లీషులో పొగిడి అవతల పారేసే వారు చాలా మందే ఉన్నారు. బట్ ఐ హేవ్ ఏ ప్రోబ్లెం" అంది మన తెలుగు తల్లి. అప్పుడు చూశాను ప్రౌఢ వయస్సులో ఉన్న ఆవిడ వర్ఛస్సు, మెడలో దండ ఎట్సెటరా.

"అమ్మా. నువ్వా, ముందు ఏదో లాటరీ అమ్మాయి అనుకున్నాను, తరవాత మా అసలు, సిసలు మా అమ్మ అనుకున్నాను. ప్రపంచంలో పది కోట్లమంది టెలుగూస్ ఉండగా, నా ప్రయివేటు కలలోకి ఏల వచ్చితివి?" అని అడిగాను, ఎందుకైనా మంచిది అని నాకు తెలిసిన అతి కొంచెం గ్రాంధికంగా కూడా కలిపి.

"పెద్ద సీను లేదులే, ఒక సారి వీలుంటే హైదరాబాదు వెళ్ళి నా సంగతి కనుక్కో. ఐ యాం వర్రీడ్ అండ్ కన్‌ఫ్యూస్డ్... "అంది తెలుగు తల్లి.

"ఇప్పుడు నీకు వచ్చిన కష్టం ఏమిటి తల్లీ, ఇందాకానే అన్నావుగా, అందరూ నీ గురించి పొగుడుతున్నారనీ" అన్నాను.

"అవుననుకో, కానీ నాకు హైదరాబాదులో ఒక పెద్ద విగ్రహం పెట్టారు కదా. అందుకూ" అంది తెలుగు తల్లి.

"మంచిదే కదా" అన్నాను నాకు విషయం అర్థం అవక.

"అదేనోయ్ దద్దమ్మా, విగ్రహాలు బతికున్న వాళ్ళకి కట్టరు, పెట్టరు. కావాలంటే టేంక్‌బండ్ మీద చూడు. అందరూ మేఘాలలోకి వెళ్ళిపోయిన వాళ్ళే. అలాటిది, నాకు ఒక మాంఛి జంక్షన్‌లో విగ్రహం పెట్టారూ అంటే అర్థం ఏమిటా అని ఆలోచిస్తున్నాను. అందుకే ఐ అయాం టోటల్లీ కన్‌ఫ్యూస్డూ... ఆంధ్రాలో నేను ఎంత వరకూ బతికి ఉన్నానూ అని" అని తన గోడు విన్నవించుకుంది తెలుగు తల్లి. "పైగా, ఎక్కడా భారతమాత విగ్రహం లేదు కదా...." కొసరు వడ్డించింది.

"పైగా అసలు తెలుగు అన్ని చోట్లా వాడొచ్చా, వాడ కూడదా, వాడినచో మనకు, ముఖ్యంగా నాకు వచ్చు కష్టములేమి, ఉపయోగములేమి, అవన్నియూ కూడా కనుక్కొని నాకు విశదీకరించుము" అంటూ సదరు తెలుగు తల్లి గ్రాంధికంలో కూడా నన్ను ఆదేశించి, నాకు అర్థం అయేలా ఇంగ్లీషులో కూడా చెప్పి తన లోకానికి తను నిష్క్రమించింది.

ఇలాటి కల వచ్చిందేమిటా అని నేను అనుకుంటూ మళ్ళీ కునుకు తియ్యబోతుంటే 'అన్నట్టు, అసలు విషయం చెప్పడం మర్చిపోయాను. మొన్న కరీంనగర్ లో టీ.ఆర్.యెస్ పార్టీ వాళ్ళు భారీగా నెగ్గడంతో తెలంగాణా తల్లి బొమ్మలు కూడా తయారవుతున్నాయి. అఫ్‌కోర్స్, ఆవిడ నాకంటే పెద్దావిడనుకో. కానీ నన్ను పడగొట్టేసి ఆవిడ విగ్రహం పెడతారేమో కనుక్కో" అని మళ్ళీ అర్జంటుగా చిన్న కలలా వచ్చి నిష్క్రమించింది తెలుగు తల్లి.

ఇక తప్పదు కదా, "అమ్మగారి ఆజ్ఞ, నా తక్షణ కర్తవ్యం" అనుకుని వెంఠనే హైదరాబాదు ప్రయాణం కట్టాను. హైదరాబాదు విమానాశ్రయంలో నేను ఎన్టీఆర్ టెర్మినల్, లేదా రాజీవ్ గాంధీ విమానాశ్రయం, లేదా నాకు బొత్తిగా తెలియని శంషాబాదో, నిరాశాబాదో లాటి గుర్తుపట్టలేని చోట దిగాను. తెలుగు నేల మీద అడుగుపెట్టగానే నా అలవాటు ప్రకారం ఆ నేలకి.....అనగా సిమెంట్ రన్‌వే మీద సాష్టాంగ దండ ప్రణామాలు చేశాను. అది చూసి నన్ను వెర్రి వెధవగా చూసిన వారితో కలసి బస్సులో ప్రయాణం చేసి టెర్మినల్‌లో అడుగుపెట్టాను. విశేషమేమిటంటే, ఎటు వెళ్ళాలో చూపించే బాణం మార్కులు చూపిస్తున్న వాళ్ళు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలూ, పక్కనే సోనియా గారు. బుర్ర ఎటు తిప్పినా, ఎక్కడ చూసినా గాంధీ భజనే. నాకు ఈ మధ్యనే తెలిసిన వార్త నిజమే అయితే, నెల్లూరులో ఒకానొక రాజకీయ వేత్త, తెలుగు సాహిత్య చరిత్రలో సాటిలేని పండితులు పుట్టపర్తి నారాయణాచార్యుల వారి విగ్రహాన్ని పడగొట్టి, ఇందిరా గాంధి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని విన్నాను. కారణమేమనగా, ఇందిర గారి ఇటాలియన్ కోడలు ఇరవై నిముషాలు నెల్లూరు విచ్చేస్తున్నారు కాబట్టి, ఆచారిని పడగొట్టి అనాచార్యుల ఓట్లు కొనుక్కుందామనే కదా ఈ తతంగం అంతానూ...

ఈ సోదంతా ఎందుకు కానీ, టెర్మినల్ బిల్డింగ్‌లో అడుగుపెట్టగానే ఎదురుగుండా పెద్ద బాణం మార్కులతో ఒక వేపు "కాలి నడక వంతెన" మరొక వేపు "వాయు వంతెన" అనే బోర్డులు కనపడ్డాయి.

కాలి నడక వంతెన అంటే మనం నడిచి వెళ్ళాల్సిన మామూలు బ్రిడ్జి అని అర్థమయింది కానీ, ఈ వాయు వంతెన ఏమిటో తెలియ లేదు. బహుశా మనం నడిచి కష్ట పడకుండా అలా, అలా గాలిలోనే మనల్ని తేల్చి తీసుకెళ్తారేమోనని ఆశపడి, చూద్దును కదా అందరూ కాలి నడక వంతెన వేపే వెళ్తున్నారు. అందుచేత వాయు వంతెన కార్యక్రమం వాయిదా వేసి నడిచే కొంత దూరం వెళ్ళగానే, మళ్ళీ ఎదురుగుండా బాణం మార్కులతో "మామూలు మెట్లు" అనీ, "నడిచే మెట్లు" అనీ గుర్తులు కనపడ్డాయి. ఈ సారి జనం ఎటువెడుతున్నారో పట్టించుకోకుండా, ఎదురుగుండా కనపడుతున్న మామూలు మెట్లు దాటి హాయిగా ఈ నడిచే మెట్లు ఎలా ఉంటాయో చూద్దామని అని అటు వేపు వెళ్ళాను. అరగంట నడిచాక  నడిచే  మెట్లు కనపడ్డాయి...అంటే ఎస్కలేటర్ అన్నమాట... కానీ, అవి కరెంటు పోయి, నడక మానేసి, మామూలు మెట్లలా గానే ఉన్నాయి. తిట్టుకుంటూ, ఆయాసపడిపోతూ నడవని నడిచే మెట్లమీద నడిచాను.

మధ్యలో ఒక చోట "కార్యము ప్రగతిలో ఉన్నది. జాగ్రత్త" అనే బోర్డు చూసి దాని అర్థం ఏమిటై ఉంటుందా అని తీవ్రంగా - ఆలోచించాను. మా చిన్నప్పుడు ఎవరిదైనా పెళ్ళయ్యాక జరిపే శోభన కార్యక్రమాన్ని టూకీగా "కార్యం" అనే వారు. అందుచేత అలాటి కార్యానికీ, ఇక్కడ ఎయిర్‌పోర్ట్‌లో ఎందుకు బోర్డుపెట్టారా అని ఆలోచిస్తూ ఉండగా "మీ తల మీద ఏవైనా వస్తువులు పడిన యడల వెంఠనే తీసి పక్కన పెట్టి వెళ్ళండి" అని మరొక బోర్డు కనపడింది. దాని కిందనే "వర్క్ ఇన్ ప్రోగ్రెస్" అని అంగ్రేజీలో చిన్న అక్షరాలతో మరొక పెద్ద బోర్డూ కనపడ్డాయి. మొదటి బోర్డులో కార్యము అనగా "వర్క్" అనియూ, ఆ బోర్డు, ఈ ఇంగ్లీష్ మాటలకి తెలుగు తర్జుమా అనీ, ఎవరి శోభన కార్యక్రమానికీ ఇవి ఎడ్వర్టయిజుమెంట్లు కాదని తెలిసిపోయింది. పైగా, వడ్రంగులూ, తాపీ వారూ అక్కడ పని చేస్తున్నారు కాబట్టి, పొరపాటున ఇటికలో, సుత్తీ లేదా స్క్రూ డ్రయివరు లాటి వస్తువులు  నెత్తి మీద పడితే అవి కారీఆన్ లగేజీలో....అంటే మీ చేతి సంచీలో  వేసుకుని పట్టుకుని పోకుండా, అక్కడే వదిలెయ్యండి తరవాత మేమే వచ్చి అవి తీసుకుంటాం అని కూడా ఎయిర్ పోర్ట్ వారు నన్ను అర్థించినట్టు అర్థం అయింది. మొత్తానికి నాకు ఏ డేమేజీ జరగకుండా అర మైలు నడిచి "భద్రతా శోధన మరియు నిర్ధారణ" అనే ప్రదేశం చేరుకున్నాను.

అప్పటికే నా తోటి ప్రయాణీకులు అక్కడికి వచ్చేశారు కాబట్టి, నేను లైనులో చివర్న నిలబడాల్సి వచ్చింది. నేను అమెరికన్ సిటిజెన్ కాబట్టి నాకు ఇచ్చిన కష్టమ్సు ఫారమ్సులో నా దగ్గర ఉన్న డాలర్ల వివరాలు, అవి కాసే చెట్టు ఏ ప్రాంతాలలో ఉన్నదీ మాత్రమే అడిగారు. అవి పూర్తి చేస్తూ ఉండగా రెస్ట్ రూంకి వెడదామనిపించింది. దూరంగా ఒక మూల "ఇన్‌ఫర్మేసన్" అని హిందీలోనూ "విచారించే చోటు" అని తెలుగులోనూ ఒక బోర్డు కనపడితే అక్కడికి వెళ్ళి, ఎందుకైనా మంచిదని చాలా విచారంగా మొహం పెట్టి వెనకాల ఉన్న కుర్చీలో కూచోకుండా చిన్న బల్ల మీద హాయిగా కాళ్ళు ఆడిస్తూ ఆనందిస్తున్న ఖాకీ బట్టల మనిషిని "ఇక్కడ రెస్ట్ రూములు ఎక్కడ ఉన్నాయి" అని అడిగాను. నా మొహం చూసి వాడు ముందు నవ్వి, పక్కనే కిచ కిచలాడుతున్న ఆడ పోలీసుతో సరసాలాడుతూనే, "ఉధర్ హై, దేఖ్‌తా నై" అని కసురుకుంటూ పైకి గాలిలోకి చూపించాడు. రెస్ట్ రూములు గాలిలో కట్టారేమో అని ఆ టెక్నాలజీకీ అబ్బురపడుతూ పైకి చూస్తే ఆయన చూపించింది గాలిలో వేళ్ళాడుతున్న "ప్రజల మరుగుదొడ్లు" అనే పసుపు రంగు బోర్డు. జంతువులకి కూడా మరొక చోట రెస్ట్ రూములు కట్టే ఉంటారులే, ప్రజలంటే మనమే కదా అని తీరా అక్కడికి వెళ్ళగానే "పురుషులు తాగు నీరు, తాగు నీరు, స్త్రీలు" అనే బోర్డు కనపడింది. ఆఖరికి తాగే మంచి నీళ్ళు కూడా మగ వాళ్ళకి, ఆడవాళ్ళకి వేరే ఏర్పాటు చేశారు. దేశం పురోగమించింది అనుకుని, కొంత కర్పూరం ఉండల వాసన వేస్తున్నా అసలు సిసలు రెస్ట్‌రూం కనపడక మరొక జవాన్ గారిని అడిగాను. అప్పుడు తెలిసింది, అక్కడ రాసిన పురుషులూ, స్త్రీల వెనకాలే  రెస్ట్ రూములనియూ, రెండింటికీ మధ్యలో, ఎక్కడా కొంచెం గేప్ కూడా లేకుండా "త్రాగే నీరు" అని వ్రాయబట్టి నేను దేశం పురోగమించిందని భావించాననీ తెలుసుకున్నాను.

మొత్తానికి నేను ఎయిర్ పోర్ట్‌లో అన్ని కాగితాలూ "కార్యాలూ" పూర్తిచేసి, "సామాను వెతుకు స్థలము", "బయటకు పరిగెట్టు ద్వారము", "ప్రవేశ ద్వారము", ప్రవేశ టిక్కెట్టు", స్వదేశీ ఆగమనలు", విదేశీ విరమణలు", "సూచిత సమయములు", "సంచిత ఖర్మలు", "నో బెగ్గర్స్" మొదలైన వన్నీ గమనించి విమానం దిగి తెలుగు తల్లికి సాష్టాంగ ప్రమాణం చేసిన తరవాత కేవలం మూడు గంటలలో "సందర్శన స్థలి" కి వచ్చేశాను...అనగా విజిటర్స్ లాంజ్ అనబడే  విశాలమైన రోడ్డు.

నన్ను చూడగానే, ఆప్యాయంగా పలకరించి మా అన్నగారి అబ్బాయి "ఇదిగో బాబయ్యా, నువ్వు ఇండియాలో వాడుకోడానికి సెల్ ఫోన్" అని ఒక సెల్ ఫోన్ చేతిలో పెట్టాడు. ఇంతలోకే  ఫోన్ రకరకాల ధ్వనులు చేయడం మొదలెట్టింది. "ఇదేమిట్రా" అన్నాను కంగారు పడుతూ.

"అదా, నీకు ఒక ఎసెమెస్ మెసేజ్ వచ్చిందిలే, కావాలంటే ఇదిగో చూడు" అంటూ నేను ఇండియాలో అడుగుపెట్టగానే నాకు వచ్చిన మొట్ట మొదటి టెలిఫోన్ ఎసెమెస్ మెసేజ్ చూపించాడు మా అన్నయ్య కుమారుడు. ఆ మెసేజ్ సారాంశం "మీ ఇంట్లో చచ్చిపోయిన వాళ్ళకి ఇష్టమైన పాటలు వినడానికి ఇక్కడ నొక్కండి". దేశం పురోగమించింది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి ?
వెంటనే తల్లిని తలుచుకుని, "అమ్మా, ప్రస్తుతానికి మన ఎయిర్ పోర్ట్‌లో తెలుగు గమనించాను. ఇంగ్లీషు బోర్డులు నాకు చదవడం రాకపోతే ఇంకా ఎయిర్ పోర్ట్‌లోనే ఉండిపోయేవాడిని. కాబట్టి ప్రస్తుత కాలమాన పరిస్థితులని బట్టి కొన్ని చోట్ల తెలుగు బదులు ఇంగ్లీషే బెటరేమో. నీ విగ్రహాల గురించి మరొక సారి అమెరికామెడీ కబురు చేస్తాను." అని తెలుగు తల్లికి నా మొదటి రిపోర్ట్...సారీ..మొదటి నివేదిక సమర్పించుకున్నాను మనసులోనే. ***

# సాహితీ సదస్సులూ రికార్డింగ్ డాన్సులూ

**అయ్యా, అమ్మా, అదండీ విషయం.** గత సంవత్సరం జనవరిలో మొదలుపెట్టి, మొన్నటి జనవరి దాకా అష్టవంకరలూ తిరుగుతూ నేను చేసిన కూచిపూడి, భరత నాట్యం వగైరా డాన్సులతో నా ఒళ్ళు హూనం అయిపోయింది. "పోవోయ్, వెధవ బడాయీ నువ్వూనూ, నువ్వు డాన్సు చేస్తే చూసే చవటలు ఎవరూ ఉండరు" అంటారేమో. అది కరెక్టే, ఎందుకంటే ఈ డాన్సులన్నీ నేను ఎవరూ ప్రయివేటుగా, ఎవరికీ చెప్పకుండా, తెలియకుండా చేసినవే. వీటన్నిటికీ కలిపి మెలిపి నేను పెట్టుకున్న పేరు "సాహిత్యం డాన్సు". తెలుగు సాహిత్యాన్ని పోషించడానికి నా బోటిగాళ్ళూ పడే తిప్పలన్న మాట.

అసలు విషయం ఏమిటంటే గత సంవత్సరం నేను రెండు సాహిత్య మార్జాలాలకి గంటకట్టాల్సి వచ్చింది. అందులో మొదటి గంట అక్టోబర్ లో హ్యూస్టన్ లో అఖండ అఖిల అమెరికాఖండ తెకోకారా డీలక్స్ సాహితీ సదస్సు. ఇన్ని విశేషణాలు పెట్టకుండా సింపుల్ గా తెలుగు సాహితీ సదస్సు అని పేరు పెడితే నాకు తెలుగు బొత్తిగా రాదని అమెరికాలో అందరూ జాలిపడతారు కదా, అందుకని ఇలాటి పేరు పెట్టాను.

ఈ సదస్సు తాలూకు నా ఈమైల్ ప్రకటన అందగానే ఒకాయన అర్జంటుగా పిలిచి, ఈ తెకోకారా, ఏమిటన్నా? నాకేం సమజౌతలే" అని ఫోన్‌లో ఆశ్చర్యపోయాడు. అంటే హాహా కారాలు చేశాడు రెండు, మూడు ఇండియా భాషలలోనూ, తన న్యూయార్క్ భాషలోనూ. మాది టెక్సస్ కదా, మా ఇంగ్లీషు వేరు. "అదే సార్, తెలంగాణా, కోస్తా మరియు రాయల సీమ అందరికీ కలిపి అని అర్థం అని వివరించాను. "మగర్ మధ్యలో దీర్ఘం కా అనే అక్షరం క్యుం?" అడిగాడు నా బ్రిలియన్సీకి ఇంకా ఆశ్చర్యపోతూ ఆ మిత్రుడు. "అదా, మాది కాకినాడ కదా, అందుకూ". అన్నాను. "అన్న పాగల్ హోగయా" అని గొణుక్కుంటూ ఫోన్ పెట్టేశాడు ఆ కరీంనగర్ ఆసామీ.

మామూలుగా ఎవరూ పాటించని హిందూ ధర్మానికి నాలుగు పాదాలయితే, సాహిత్య ధర్మానికి నాలుగు సమస్యలు. ఈ తె.సా. సదస్సుల సమస్యలు అన్నీ స్వయంకృతాపరాధాలే. ....అనగా స్వయంగా తెచ్చిపెట్టుకున్న "సరదా దురద"లు. ఎంత గోకినా పోవు.

ఉదాహరణకి అమెరికా సంగతే తీసుకుందాం. సాహిత్య సభ ఏ ఊళ్ళో జరిగినా క్వాంటిటీ అనగా ఎంతమంది వస్తారూ, క్వాలిటీ

అంటే ఎంతిస్తారూ అనే విషయం అంతా వారు సాహిత్యం డిపార్ట్‌మెంట్లో ఉన్న నాలుగు కులాలలో ఏ అమెరికాకులమో దాన్ని బట్టి ఉంటుంది.

ఇందులో మొదటి కులం పేరు ''చందాకులం''. ఇండియాలో కులాల్లాగే ఇందులో కూడా శాఖాభేదం ఉంది. ఉదాహరణకి ''కాఫీచందా'' శాఖ వారు....అంటే  అంటే హిందీలో ''కాఫీ'' అనే మాటకి వచ్చే తెలుగు అర్థంలో కాఫీ తాగడానికి సరిపడా ఇచ్చి, వాళ్ళ పేరు డొనేషన్ ఇచ్చిన వాళ్ళ లిస్ట్‌లో వాళ్ళకి నచ్చిన చోట, భారీగా పెద్ద అక్షరాలతో పడిందా లేదా, ఆర్గనైజరుగాడు స్టేజి మీద తమ సంపూర్ణ నామధేయమూ, గోత్రమూ, పుట్టిన ఊరూ, జాతకమూ అన్నీ సరిగ్గా చెప్పాడా లేదా అని వెయ్యి కళ్ళతోటీ, చెవుల తోటీ కనిపెట్టే శాఖ. పొరపాటున మర్చిపోయారో, ఇక ఆర్గనైజరు పని గోవిందా, గోవింద. ఈ డిపార్ట్‌మెంట్ లో భవదీయుడి గూబ అనేక సార్లు వాచెను. ఇకముందు కూడా వాచును.  ''కాఫీచందా'' వారి లెవెలు పాతిక డాలర్లు దాటదు గాక దాటదు.

ఇక రెండో శాఖ వారు ''ఫొటోచందా'' వారు. వీరు రెండు కప్పుల కాఫీ మరియు పకోడీలకి కూడా సరిపడా ఇచ్చి, బంధు మిత్ర సపరివారంగానూ, పక్కింటి కుక్క పిల్ల, ఎదురింటి పిల్లి పిల్లలతో సహా టిఫినూ, భోజనమూ టైముకు వచ్చి, గ్లామరు ఉన్న ముఖ్య అతిధులతో అరడజను ఫొటోలు, అరగంట వీడియో తీసుకునే వాళ్ళు. పండితులతో ఫొటోలకి పాతిక, మామూలు సినిమా వాళ్ళతో యాభై డాలర్ల దాకా వెళ్ళగలరు. చిరంజీవి అయితే ఏకంగా వంద డాలర్లు కూడా ఇస్తారు. ఆ మాట కొస్తే వంద డాలర్లు డొనేషన్ ఇవ్వలేని పవిత్ర భారతీయులు, అందునా అమెరికా తెలుగు వారిలో ఎవ్వరూ ఉండరు. (డబ్బు) ఉన్నా ఇవ్వరంతే. ఈ శాఖ వారికి సాహిత్య సభ అయినా, శ్మశాన సభ అయినా ఒకటే. ఫోటోలు ముఖ్యం.

మూడో శాఖ వారు ''పేకాటచందా'' వారు. ''ఈ యూస్‌లెస్ టెలుగూ అర్థం అవక, ఆ గోల భరించలేక అందరూ వదిలేసినా, పాపం ఈ పిచ్చి బేమ్మడు మటుకు పెళ్ళాం పిల్లల్ని కూడా వదిలేసి ఇలా సాహిత్యం రోడ్డు మీద పడతాడు, పాపం'' అని కాస్త పుణ్యమైనా వస్తుందేమోనని జాలి పడి వంద డాలర్లు డొనేషన్ మాత్రం పంపించి, సభల చుట్టుపక్కలకి రాకుండా హాయిగా ఆల్కొంట్‌కి ఐదు వందల డాలర్లు పేకాట ఆడుకునే వారు. ఈ శాఖ వారు ఒక ఫుల్ కౌంట్ మనకి కూడా ఈజీగా ఇవ్వ గలరు. కానీ ఇవ్వరు. సాహిత్యానికి గ్లేమరు లేదు కదా.

నాలుగో శాఖ వారు ''పడగెత్తినచందా'' వారు. అంటే కోట్లకి పడగెత్తి, చచ్చేంత డబ్బు ఉన్న వాళ్ళు, అరక్షణం టైము లేని వాళ్ళు. ఇందులో సాహిత్యానికి ఇచ్చే వాళ్ళు తక్కువే అయినా, అప్పుడప్పుడు జాక్ పాట్ కొట్టవచ్చు. ఆర్గనైజర్లకి బాగా కిడుతుంది. ఎందుకంటే వీళ్ళు ఇవ్వదల్చుకుంటే వెయ్యి డాలర్లు ఇస్తారు. పైగా సాధారణంగా, ఇలాటి సాధారణ సభలకి వచ్చి మనల్ని చావగొట్టరు.

పైన చెప్పిన విధంగా అందరినీ అడుక్కుని సాహిత్య సేవ చేద్దామనుకుంటే, ఈ తె.సా. సదస్సు లో కావలిసిన రెండో కులం ''రచయితాకులం'' వారు లేనిదే ఇంకేమీ లేదు. అయితే వీళ్ళని రప్పించడం కూడా వారి, వారి శాఖలని బట్టి ఉంటుంది.

అందులో మొదటిది ''వస్తే ఏమిస్తావ్?'' అనే శాఖ. సదస్సు ప్రకటన చూడగానే ఒక నవలా, రెండు వ్యాసాలూ, మూడు కథలూ, నాలుగు కవితలూ అర్జంటుగా పంపించేసి, రోజూ ఈ-మెయిల్ లేదా ఫోన్ చేసి ''అవన్నీ చదవచ్చా, మొత్తం మూడు గంటలు చాలు సుమా, ఇంతకీ రెండు రచనలు మొదటి రోజు, మిగిలినవి రెండో రోజు చదివితే అందరికీ బాగా నచ్చుతుంది కదా, ఏమంటావ్?, అన్నట్టు మొత్తం అంతా వీడియో తీసే ఏర్పాట్లు చేశావా?, అయ్ వాంట్ ఓన్లీ ప్రొఫెషనల్స్, నాట్ ఆర్డినరీ పీపుల్'' అంటూ నా చేత అన్ని వరాలూ పుచ్చుకుని మరీ ఈ ''వస్తే ఏమిస్తావ్'' వారు సభలకి వచ్చి నిండుతనాన్ని ఇస్తారు. డబ్బు మటుకు ఆట్టే ఇవ్వరు. అయినా పరవాలేదు.

రెండో రకం ''అబ్బే, ఎందుకు లెండి'' బాపతు. పాపం వీరికి ఎంతో ఉత్సాహమూ, మంచి టేలంటూ, మాట్లాడే పటిమా అన్నీ పుష్టిగా ఉండి, మొహమాటం మటుకు అంత కన్నా పెద్ద లెవెల్లో ఉంటుంది. మరొక రకం ''మాకూ గెంతాలని ఉంది'' తాలూకు. అంటే రచయితలుగా చలామణీ అవుదామనుకునే ఔత్సాహికులన్న మాట. సరిగ్గా గెంతే అవకాశం వస్తే వీళ్ళు చిరంజీవి కంటే బాగా గెంత గలరు.

కృష్ణశాస్త్రిలా రాయగలరు.

ఉన్న మాట చెప్పొద్దూ, ఎంతో కష్టపడి పైన చెప్పిన రకరకాల రచయితలని పోగేసి తె.సా. సదస్సు పెట్టవచ్చు కానీ, వీళ్ళందరితో ఒకటే సమస్య. ఇందులో చాలా మంది, కేవలం వాళ్ళు, మాట్లాడే టైముకి మాత్రం వచ్చి, కాసేపు కూచుని, వాళ్ళ వాగుడు...సారీ ప్రసంగం అవగానే హాలులోంచి బయటకి పారిపోతారు. ఎందుకంటే అందరి దగ్గరా షేక్ హేండ్స్ పుచ్చుకోవాలి కదా. పైగా "నా తరవాత మాట్లాడే వక్తకేం వచ్చు, నా మొహం", "వెంఠనే ఇంటికి వెళ్ళకపోతే వంగ మొక్కలకి నీళ్ళు ఎవరు పెడతారు, లేదా టామీకి మంగళస్నానాలు ఎవరు చేయిస్తారూ?" వగైరా కారణాలకి.

తెలుగు వారి ఆనవాయితీ ప్రకారం డొనేషన్ ఇచ్చిన ఆసామీ తన పతకం అందుకోగానే సాహిత్యానికి దూరంగా పారిపోవడమూ, రచయితలకి తాము చదవడమే కానీ ఇతరులవి వినడం వాళ్ళ గోత్రంలోనే లేదు కాబట్టీ ఏ రకమైన తె.సా.సదస్సుకైనా మూడో అమెరికాకులం వారు దేవుడిచ్చిన వరం. ఈ మూడో కులాన్ని "పాఠకులం" లేదా "ప్రేక్షకులం" అంటారు. వీళ్ళని మనం "తోలుకు" రావక్కర లేదు.. పాపం వాళ్ళే అన్ని పనులూ మానుకుని ఇటువంటి సభలకి వచ్చి, ఆనందించి, అందరినీ సంతోషపెడతారు.

ఇక నాలుగో అమెరికాకులం వారిని "సేవకులం" అంటారు. తెర ముందు నా బోటి అల్పుడు తైతెక్కలాడుతూ తప్పట్లుకొట్టించుకుంటూ ఉంటే ఈ "సేవకులం" వారు మటుకు తెర వెనకనే ఉండి, రిజిస్ట్రేషన్ లాటి జరగ వలసిన మర్యాదలూ, భోజనాల ఏర్పాట్లు, మైకులూ మొదలైనవి సరిగ్గా చూసే స్వచ్ఛంద సేవకులన మాట.

అదండీ సంగతి, ఇలాగ నాలుగు అమెరికాకులం వారందరూ తలో చెయ్యీ వేస్తేనే కానీ సాహిత్యం కాళ్ళకిందకి దిగజారిపోతుంది.

అన్నట్టు బహుశా అప్రస్తుతమే కానీ, ఐదో కులం వారి గురించి చెప్పడం మర్చేపోయాను. దాని పేరు "పంచమ కులం". ఇందులో రచయితలైన వారు సాధారణంగా పై అంతస్థులో ఉండి, ఇలాటి సాధారణ తె.సా. సదస్సులకి విచ్చేయరు. మరి కొంత మంది ఆర్గనైజరు గాడి (అనగా కొన్ని కేసుల్లో నాది అనమాట)... మూతి వంకర అనో, "రెండేళ్ళ కితం తెలిసి ఉంటే తప్పకుండా వచ్చేవాళ్ళమే, మా ఫ్రెండ్ పటేల్ ఇంట్లో సత్సంగ్‌కి కమిట్ అయిపోయాం" అనో వంక పెట్టి మానేసే వాళ్ళే. అసలు జోకు ఏమిటంటే ఈ సోకాల్డ్ సత్సంగులూ, గిత్సంగులూ అన్నీ గుజరాతీ, హిందీ లేదా వారు మాట్లాడే అదో రకం అంగ్రేజీలో ఉంటాయి. మీరు ఎన్ని చెప్పండి, ఏ పురాణమైనా, ఇతిహాసమైనా నాకు మటుకు శుద్ధ......అనగా తెకోకారా తెలుగులో వింటేనే కానీ అర్ధం అవదు సరి కదా, చాలా అపార్ధం అవుతుంది. ఉదాహరణకి "దెన్ ఎలిఫెంట్ గాడ్ కేం అండ్ ఆక్యుపైడ్ హిజ్ సీట్" ఇంగ్లీషులో తెలుగువాడికి పురాణం చెప్తే ఒళ్ళు మండదూ. ఈ పంచమ అమెరికాకులం వారు ఈ సభలకి రాకపోవడానికి సభల నిర్వాహకుడి పెర్సనాలిటీయే అసలు కారణం. అదే మరొకరు నిర్వాహకులైతే పటేల్ గాడికి డుమ్మా కొట్టి ఒంటి మీద సెంటూ, మెడలో కంఠ లంగోటీ కట్టుకుని, వంద డాలర్లు ముడుపు చెల్లించుకుని తమ భయమూ, భక్తీ చూపించుకునే వారే. మనం ఎంతబతిమాలినా ఎలాగా వీళ్ళు రారు కాబట్టి  వీళ్ళతో ఏవిధమైన ఇబ్బందీ లేదు మనకి.

"మళ్ళీ ఏమిటి బరుకుతున్నావ్, పనీ పాటూ లేదా ?" హఠాత్తుగా వెనకనుంచి మా రంభ గొంతుకు వినగానే గతుక్కుమన్నాను .

"ఏం లేదులే, సాహితీ సదస్సుకి డబ్బులు సంపాదించడం, జనాల్ని పోగెయ్యడం లో నేను కిందటేడు చేసిన డాన్సుల గురించి రాస్తున్నాను" అన్నాను.

"సరేలే అదేమన్నా పెద్ద ప్రోబ్లెమా ఏమిటి, యు షుడ్ హేవ్ ఆస్క్‌డ్ మి ఎట్ దట్ టైం. చాలా సింపుల్," అంది మా అర్ధాంగి.

"సింపులా?" ఆశ్చర్యపోయాను కరీంనగర్ స్నేహితుడి టైపులో.

"అవును మాజీ మన్మధా, నీ బోటి వృద్ధాప్యంగాళ్ళకి జ్యోతి లక్ష్మి, విజయ శాంతీ, హలం, వీలుంటే హెలెన్, మధ్యాహ్యం..అంటే నలభైలోపు గాళ్ళకి జయ మాలిని, డిస్కో శాంతి, సుభాషిణి లేదా అనూరాధ, హెచ్ వన్ గాళ్ళకి అల్ఫోన్సా, రాఖీ సావంత్ ని పిలిపించు. అఫ్ కోర్స్ ముమైత్ ఖాన్ బెస్ట్ అనుకో, అప్పుడు పెద్ద హాలు కూడా సరిపోదు నీ సాహితీ సభలకి."

"అంటే" అన్నాను ఆ పేర్లలో కొన్ని తెలుసు కాబట్టి...

"అవునోయ్, ఓపెనింగ్ సెరిమోనీలోనూ, ఆఖర్నా, అప్పుడప్పుడు మధ్యలోనూ రికార్డింగ్ డాన్సులు పెట్టావనుకో, నువ్వూ, నీ బోటి రచయితలూ చేసే కూచిపూడీ, భరత నాట్యం భరించడానికి అందరూ వస్తారు. ఐ గేరంటీ ఇట్. సాహితీ సదస్సులూ-రికార్డింగ్ డాన్సులూ...యు కెనాట్ బీట్ దట్ "

మా ఆవిడ మేధాశక్తికి, అంతకంటే ముఖ్యంగా మా రంభకి ఈ పేర్లన్నీ ఎలా తెలుసునో తెలియక మళ్ళీ కరీంనగర్ అయిపోయాను..

రెండో పెద్ద గంట ఇండియాలో "అఖిలాండకోటి బ్రహ్మాండ ప్రపంచ ఖండ ఖండముల తెకోరా.డీ.తె.సా. సదస్సు కూడా నిర్వహించబడింది. మీరు గమనించారో లేదు, చాలా తెలివైన వాణ్ణి కాబట్టి, ఇండియా సదస్సు పేరులో ఎందుకైనా మంచిదని మా కాకినాడ పేరు తీసేశాను. లేకపోతే కరీంనగర్ వాళ్ళు, కడప వారూ పెర్సనల్‌గా వచ్చి చావగొట్టే అవకాశం ఉంది కదా. ఆ పెద్ద గంట అమెరికామెడీ కబుర్లు మరొకసారి చెప్తాను. *********

## అఖిలాండకోటి బ్రహ్మాండ ప్రపంచ ఖండ ఖండముల తెకోరా.డీ.తె.సా. సదస్సు

**ఈ అమెరికామెడీ కబురు టైటిల్ చూసి** వీడికి.....అనగా నాకు ఖచ్చితంగా మతిభ్రమించినదియూ, వెంఠనే హ్యూస్టన్‌లో ఉన్న మెంటల్ - ఆసుపత్రికి తక్షణ, అత్యవసర ఎమర్జన్సీ వైద్యానికీ, తదుపరి విశాఖపట్నంలో, మా అత్తవారింటికి అందుబాటులో ఉన్న పిచ్చాసుపత్రికి పెర్మనెంటు వైద్యానికీ తరలించాలి అని మీరు ప్రతిపాదిస్తే మా అత్తారి వేపు అందరూ అఖండంగా ఆనందిస్తారు. ఎందుకంటే ఇలాటిది ఊహించే మా అత్తారి ఆస్థాన డ్రయివరూ, ఇంటి కాపలా వాడూ, అతన్ని కాపలాకాసే అతని మూడో పెళ్ళామూ, ..ఒకరేమిటీ మా అత్తారి తాలూకు బంధు మిత్ర సేవక పరివార బృందం వారందరూ నన్ను సకల లాంఛనాలతోటీ పిచ్చాసుపత్రికి సాగనంపడానికి నా పెళ్ళి అయిన మర్నాడే వాల్తేరు అప్ లాండ్స్‌లో ఆసుపత్రిలో ఎడ్వాన్సు బుకింగ్ చేశారని నాకు తెలుసు.

ఇదే ఐదారు నెలల క్రితం అయితే మీ ప్రతిపాదనకి నేను కూడా రపీమని ఒప్పేసుకుని, మామూలు లుంగీ, బనీనూ, ఆఖరికి చెడ్డీ కూడా తీసి పారేసి అటువంటి ఆసుపత్రులలో డాక్టర్లు, నర్సులు, రోగులు వేసుకునే లాంటి నీలం రంగు గౌను వేసేసుకుని ఏంబ్యులెన్సులో కూచునే వాణ్ణి, రంగేసిన నా జుత్తు పీక్కుంటూ. మెంటల్ వారందరూ అలా జుత్తు పీక్కుంటారని చాలా తెలుగు సినిమాలలో చూశాను లెండి. అఫ్ కోర్స్, ఈ రోజుల్లో అయితే హీరో, హీరోయిన్లూ ఆస్ట్రేలియాలోనో, అలాస్కాలోనో పాటలు పాడుకుంటూ ఎవరి జుత్తు వారే పీక్కుంటూ, వెరైటీ కోసం హీరో జుత్తు హీరోయిన్ కానీ పీక్కుంటూ ఉంటే, విలన్లందరూ "ధరఖర్వాటులే"..అనగా గుండుగాళ్ళే. జుత్తు పీక్కునే అవకాశం బొత్తిగా లేని వాళ్ళే.

ఇంతకీ అసలు సంగతేమిటంటే, ఆంధ్రప్రదేశ్ లో ఈ మధ్య ఎక్కడా సాహితీ సదస్సు అనే మాట వినపడడం లేదు. ఆఖరికి ఉగాది కవి సమ్మేళనమూ మరియు పండితులకిచ్చే పురస్కారాలు కూడా సినిమా వాళ్ళకే ఇచ్చి "దేశముదురు" గా ఉంది. అన్నట్టు ఈ సినిమా టైటిల్ నాకు ఎన్ని నిఘంటువులు చూసినా అర్థం అవలేదు. ఆ సినిమా చూడడానికి భయం వేసింది.

ఉదాహరణకి మొన్ననే ఒక టీవీ ఛానెల్ లో సినిమా వారికిచ్చిన ఇరవై రెండు ఉగాది పురస్కారాలలో కనీసం ఒక రచయితైనా ..అంటే కథ, గేయ, మాటల రచయితైనా ఉంటారేమో అని చూశాను. పైగా ఐదు రోజులలో ఆరు ఆటలు ఆడి ఘన విజయం సాధించిన రసవత్తర సన్నివేశాలతో, కితకితలాడించే హాస్యపు జల్లులతో, వర్షపు జల్లులలో నోరూరించే శృంగార సన్నివేశాలతో..అంటే రేప్స్ అనమాట, ఫేమిలీ టైపు చిత్రంలో మూడో హాస్యగాడికి సపోర్టింగు పాత్రలో నటించిన "హాస్యబెమ్మ" బిరుదాంకితుడైన వెకిలేశ్వర్ కి ఉగాది పురస్కారం ఇవ్వడం నేను స్వయంగా వీక్షించి శోకించాను. సదరు వెకిలేశ్వర్ గాడికీ, ఉగాదికీ ఉన్న సంబంధం కానీ, ఫేమిలీ టైపుకీ ముగ్గురు వీరులు కలిసి చేసే రేపుల మీద రేపులకీ ఉన్న సంబంధం కానీ నాకు తెలియ లేదు. అంత కంటే ముఖ్యంగా ఏవో చాక్లెట్లో, బిళ్ళలలో అయితే తెలుసును కానీ "నోరూరించే శృంగారం" అంటే ఏమిటో నాకు బొత్తిగా తెలియ లేదు. ఆ డిపార్ట్‌మెంట్లో కొత్త టెక్నాలజీ ఏమన్నా వచ్చిందేమో గూగుల్ లో చూడాలి.

నా రిసెర్చ్ ప్రకారం తెకోరాంధ్రా అంతటా కూడా ఎక్కడ చూసినా సాహిత్యం పేరిట భజన సమావేశాలే, పూల దండలూ, పుస్తకావిష్కరణలే.. సొంత డబ్బా, పర డబ్బా, పరస్పర సాహిత్య డబ్బా, కొండొకచో కేవలం తిట్టుకోవడానికి స్పెషల్ మీటింగులూ, జరుగుతున్నాయని చాలా మంది చెప్పడం విన్నాను. అలాటి డబ్బా బాపతు మీటింగులలో నేను కూడా పాల్గొని డబ్బా వాయించాను, వాయించుకున్నాను. అటువంటి ఒకనొక డబ్బా ముహూర్తాన, బహుశా టెంపరరీగా మతి భ్రమించిన కారణాన నాకు తెలిసిన తరహాలో ఇండియాలో సాహితీ సదస్సు పెడితే ఎలా ఉంటుందీ అని ఆలోచన వచ్చింది. అంటే "ఐదారు నెలల క్రితం అయితే..." అని ముందు పేరాలో నేను సూచించిన కాలం అప్పుడన్న మాట. ఇప్పుడు మెంటల్ తగ్గినందు వలన "శపీ" అంటూ కానీ, అనకుండా కానీ పిచ్చాసుపత్రిలో ఎడ్మిషన్‌కి ఒప్పుకోను. సాహిత్యం మాట వచ్చినప్పుడల్లా "మతి లేకపోతే సరి" అని మా క్వీన్ విక్టోరియా ప్రవచిస్తూ ఉంటుంది.

నా సాహితీ సదస్సు ఐడియా విని "నీ మొహంలా ఉంటుంది" అన్నాడు నా కుడి భుజం లాంటి ఒకాయన. "నా మొహంలా ఉంటుంది" అని విన్నవించుకుంది నా ఎడం భుజంలాంటి ఒకావిడ. ఆవిడ మొహం మరీ ఐశ్వర్యా రాయ్, జినేయిలా ... స్పెల్లింగు తప్పేమో లెండి... ఎవరైతేనేం, అలాంటి టైపులో కాకపోయినా చక్కగా, అందంగానే ఉంటుంది కాబట్టి "ఆవిడ మొహం" సలహాయే పాటించదల్చుకుని "అయితే సదస్సుకి ఏం పేరు పెడదాం అనగానే ఆవిడ "నా మొహం కాదు, నీ మొహం" అని తన అభిప్రాయం మార్చుకున్నప్పటికీ నేను ఎప్పుడూ ఇచ్చిన మాటమీద నిలబడతాను కాబట్టి, సదస్సు నిర్వహణ నిర్ణయం అయిపోయింది.

మొదటి మీటింగులో మొదటి ఎజండా ఐటెము సదస్సు టైటిల్ గురించి వాదోపవాదాలు, అనగా క్షురకర్మ వాదులూ, చెప్పుల తయారీ వాదులూ, మంత్రోచ్ఛారణ వాదులూ, ఆర్టీసీ బస్సు లో ముందు సీట్ల కోసం కవిత్వాలు వ్రాస్తున్న ఆడ ప్రయాణీకుల వాదులూ....ఒకటేమిటి కొన్ని వందల రకాల వాదులతో వెల్లి విరుస్తున్న తెలుగు సాహిత్యవాదులెవరూ వెలివేయకుండా నెహ్రూగారి "పంచశీల సూత్రం", "పంచ వర్ష ప్రణాళి'లు" టైపులో పంచెలు, పేంటులు, పట్టు చీరలు, పంజాబీ డ్రెస్సులూ, పాశ్చాత్య ప్రకోపాలూ ఉన్న అందరినీ ఒక చోటకి రప్పించడానికి "అఖిలాండ కోటి బ్రహ్మాండ ప్రపంచ ఖండ ఖండముల తె, కో, రా , డీలక్సు తెలుగు సాహితీ సదస్సు" అని నామకరణం చేశాం. ఇందులో తెకోరా అంటే తెలంగాణా, కోస్తా, రాజశేఖర సీమ అని గమనించగలరు. ఆంధ్రా అనే మాట పలకడానికి అమెరికాలో కూడా అందరూ హడిలిపోతున్నారు కాబట్టి ఆ మాట మా నిఘంటువులోంచి తీసిపారేశాం. దీని తాత్పర్యం ఏమిటంటే, హోలు మొత్తం ప్రపంచంలో అందరి తెలుగువాళ్ళనీ పిలిస్తే...అంటే సుమారు పదికోట్ల మందిని పిలిస్తే సాహిత్యం

అంటే భయపడకుండా 0.000001 శాతం, అంటే పది మంది గేరంటీగా వస్తారు కదా అని నా బ్రిలియంట్ ఐడియా. ఎందుకైనా మంచిదని కాఫీ, పలహారమూ, విందు భోజనమూ మేమే అందిస్తాం అని ప్రకటించగానే, "మరి మందు కూడా ఇచ్చెదరా, ఇచ్చినచో ఎన్ని పెగ్గులిచ్చెదరు? కావాలంటే మా గళాసులు, చికెన్ టిక్కా, వేయించిన జీడి పప్పూ మొదలైనవి మేమే తెచ్చుకుని మీకు ఖర్చు తగ్గిస్తాం" అని ఒక మందు బుద్ధి గల మంద బుద్ధి అయిన ఉద్దండ పండితుడొకాయన ప్రపోజు పెట్టాడు. "ఎవరైనా ఇస్తే ఆత్రంగా అందుకుని - ఆస్వాదించడమే కానీ మందూ, గిందూ కొనడం, ఇవ్వడం, మా గోత్రంలోనే లేదు." "అని నేను నొక్కి వక్కాణించగానే "ఈ చిట్టి పొట్టి ఎన్నారై గాడు నన్నే బోల్తా కొట్టించాడే" అని కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు ఆ మానవుడు వెనక్కి, మందుకీ.... సారీ ముందుకీ.

ఎజండాలో రెండో ఐటెము.....అంటే ధన (హోలు రెంటు), ధాన్య (పొద్దున్న ఇడ్లీ సాంబారూ, మధ్యాహ్నం భోజనమూ, టిఫినూ), వస్తు (ట్రోఫీలు, పతకాలు, దండలు) వాహనాలు (రైలు ఖర్చులు, టాక్సీలు) ఎలా అరేంజ్ చెయ్యాలి "అనే అంశం.

"తమరి అనౌన్స్‌మెంట్స్ అన్నీ బానే ఉన్నాయి కానీ, వీటన్నిటికీ ఐదారు లక్షలవుతుంది. ఎవడిస్తాడు ఈ డబ్బంతా, మీ అబ్బ సొమ్మేమన్నా ఉందా, లేక వరల్డ్ బేంక్‌ని అడుక్కోవాలా ?' అన్నాడు నా కుడి భుజం, అరగని చెప్పులు అర్జంటుగా వేసుకుంటూ.

"అడుక్కునే ఐడియా నా మొహం.....సారీ మీ మొహంలా ఉంది" అంది నా ఎడం భుజం, అర్జంటుగా పౌడరు తన మొహానికి అద్దుకుంటూ. అదే ఆడవాళ్ళకీ, మగవాళ్ళకీ ఉన్న తేడా. మగవాడు, మహా అయితే ఒక దువ్వెన్న, చెమటలు తుడుచుకోడానికి ఒక రుమాలు జేబులో దాచుకుంటాడు. అదే ఆడంగులైతే చిన్న హేండ్ బేగ్ లో కూడా సూపర్ మార్కెట్ దాచుకుంటారు.

"అడుక్కోవడం ఎందుకూ, సదస్సుకి వచ్చేవాళ్ళనే ఖర్చుల కోసం డొనేషన్ అడుగుదాం" అన్నాను మా అమెరికా అలవాటు ప్రకారం. అందర్నీ అన్నీ అడుక్కోడం ఇండో అమెరికన్ల ప్రాధమిక హక్కు. అది నేను చిరకాలంగా ప్రాక్టీసు చేస్తూనే ఉన్నాను.

"ప్రతినిధుల దగ్గరనుంచి డొనేషనా, హోలు మొత్తం ఆంధ్రాలో సాహిత్యానికి ఎవడూ ఇప్పటి దాకా చందాలు అడగలేదు. మనం అడిగితే చెప్పుతో కొట్టినా కొడతారు, మీకు తెలియదు ఇక్కడి సంగతి" వికట్టాట్టహాసం చేశాడు రావణాసురుడి టైపులో నా కుడి భుజం.

తన, లేదా నా మొహం మీద తన అభిప్రాయం చెప్పదల్చుకుని మళ్ళీ హేండ్ బేగ్ లోంచి పౌడరూ, ఎందుకైనా మంచిదని లిప్ స్టిక్కూ తీసింది నా ఎడం భుజం.

మొత్తానికి నానా తర్జన భజనల తరవాత మాయా బజార్ సినిమాలో లంబూ-జంబూ టైపులో "పరవేశ దవారం"లో ప్రవేశించడానికి "రుసుము"...అనగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి అనే నిబంధన పెట్టాం. ఏ సాహిత్య సమావేశానికైనా జనాల్ని పోగెయ్య లేక రోడ్డు మీద పోతున్న వాళ్ళకి బిళ్ళలూ, చాక్లెట్లూ ఇచ్చి ప్రోత్సహించవలసిన స్థితికి దిగజారిన తెలుగు సాహిత్య సమాజానికి నిజానికి ఇది కొత్తది కాదు. అయినా నా బోటి "డాలర్లు ఏం చేసుకోవాలో తెలియని అమెరికా వెధవ" కూడా ఇలాంటి నిబంధన పెట్టగానే, "దాం దుంప తెగ, సాహిత్యానికి విలువ ఉందనమాట" అని చాలా మందికి తెలిసొస్తుంది ఈ దెబ్బతో అని నా ఊహ. అసలు సీక్రెట్ ఏమిటంటే, తెలుగు వాళ్ళు డబ్బున్న వాళ్ళకే డబ్బిస్తారు. ఆట్టే లేని వాళ్ళ డబ్బా సుబ్బరంగా ఊడ్చేస్తారు. నేనేదో అమెరికాలో ధనవంతుణ్ణి అనే పుకారు ఇండియాలో ఎలాగా ఉంది కదా. కాబట్టి ఎంట్రీ ఫీజు కడతారులే అని నా ధీమా. లక్కీగా మా క్వీన్ విక్టోరియాకి ఇలాటి పుకార్లు వినపడవు, కనపడవు. లేక పోతే ఈ పాటికి కొంప మునిగి పోవును.... ఎందుకనగా "ఆ డబ్బంతా ఎక్కడ దాచావు, కింగూ?" అని మా క్వీను నన్ను చంపి చచ్చును.

ఇక సదస్సు జరిగే రెండు రోజులలోనూ టైము గడవడానికి, సాహిత్యం గురించి మాట్లాడడానికి ఎవరిని పిలవాలి? అనేది అజండాలో ముచ్చటగా మూడవ ఐటెం.

"కనీసం యాభై మందైనా కావాలేమో, ఈజ్ ఇట్ ఏ ప్రోబ్లెం?`"అడిగాను యాధాలాపంగా.

"అదేం ప్రోబ్లెం కాదు. రెండు రోజులకీ నలుగురు స్పీకర్లు, సినిమా గ్లేమర్ ఉన్న ఒకరో, ఇద్దరో పెద్ద మనుషులూ చాలు. ఆంధ్రాలో మైకు దగ్గరకి తీసుకెళ్ళడం ఈజీయే కానీ దింపడం మన తరం కాదు, అంచేత " అన్నాడు నా మూడో కుడి కాలు. ఇలాటి సదస్సుల విషయాలలో మనకి రెండు భుజాలతో పని అవదు. రెండు కాళ్ళు కూడా కావాలి అని నా అనుభవం...

"అంటే గాడిదని నీళ్ళ దగ్గరకి తీసుకెళ్ళగలం కానీ దాని చేత తాగించలేం" అలాటిదన్న మాట అన్నాను అనాలోచితంగా.

"తమరి సామెత తమరి మరియు తమరి తాతముత్తాతల మొహం వలె ఉన్నది. ఎంత అమెరికా వాళ్ళయితే మాత్రం రచయితలనీ, వక్తలనీ గార్ధభములతో పోల్చుట భావ్యము కాదు" అని కోప్పడింది రెండో భుజం బేగ్ లోంచి గోళ్ళ కత్తెర, ఇతర ఆయుధాలూ తీస్తూ,

"అయాం సారీ, దట్ ఈజ్ నాట్ వాట్ ఐ మెంట్" అని క్షమాపణలు చెప్పుకున్నాను ఆవిడకి, ఆవిడ సుప్రసిద్ధమైన సాహిత్య వేత్తయే కాక పేరున్న వక్త అని సడెన్‌గా జ్ఞాపకం వచ్చి.

అప్పటి దాకా నోట్సు రాసుకుంటున్న రెండో కాలు గారు, జేబులోంచి మూడు పేజీల లిస్టు తీశారు. అవన్నీ బాగా మాట్లాడే రచయితలు, వక్తలు, అన్నింటికీ తప్పట్లు కొట్టి ఆనందించే అమాయకులూ, పత్రికల వాళ్ళూ, ఫోటోల వాళ్ళూ అలాటి వాళ్ళ లిస్టు.

"కావాలంటే వక్తలని మీ ఇష్టం వచ్చిన వాళ్ళని సెలెక్ట్ చేసుకోండి, ఐ డోన్ట్ కేర్. కానీ ఈ తప్పట్ల వాళ్ళందరూ రాకపోతే, ఇక మీ పని ఉట్టిదే. ఈళ్ళెంత మంది వచ్చినా పత్రికల వాళ్ళు, టీవీ వాళ్ళూ రాకపోతే ఇదంతా వేస్టే. మీ పేరు, ఫొటో ఎక్కడా పడదు." ఆవేశపడ్డాడు రెండో కాలు.

"నాకు తెలియక అడుగుతానూ, మన పేరు, ఫోటో పేపర్లలో ఎందుకుపడాలీ, నలుగురూ కూర్చుని కాస్సేపు హాయిగా సాహిత్యం మాట్లాడుకుంటే చాలదా?" అని అడిగాను, తెలిసినా కూడా....

వెంఠనే నా రెండు భుజాలూ, రెండు కాళ్ళూ, వాళ్ళ వేళ్ళూ, గోళ్ళూ, అంటే అనుయాయులనమాట, అందరూ ఠపీమని లేచినుంచున్నారు "ఏమిటీ, పబ్లిసిటీ ఎందుకా? పత్రికల వారు ఎందుకా? టీవీ వాళ్ళు అక్కర లేదా" ఇక ఈ మీటింగెందుకూ, అవన్నీ లేకుండా సాహిత్య సేవ ఎలా చేద్దామనుకున్నారు, అసలెందుకు చేద్దామనుకున్నారూ? ఈ వెట్టి చాకిరీ చెయ్యడానికి మాకు ఇంక పనేమీ లేదా?. ప్రశ్నల వర్షం కురిసింది మీటింగు హాలంతా.

ఈ విషయంలో వాళ్ళెవరూ రాజీ పడరనీ, పైగా ఘెరావో, బంద్, అరగంటపైగా ఆమరణ నిరాహార దీక్ష.. ... ఇంకా కొత్తగా వచ్చిన రంగు రంగుల కండువాలు తలకు చుట్టుకుని నిరసన తెలిపే పద్ధతులలోనూ జనాల్ని రెచ్చగొట్టి ఈ అఖండ బ్రహ్మాండ కోటి సాహితీ సదస్సుని గీహితీ సదస్సుగా చేసెయ్యగలరని తెలిసి, కొన్ని కండిషన్లకి అన్‌కండిషనల్‌గా ఒప్పేసుకున్నాను కాబట్టి నా భుజాలూ, చేతులూ, కాళ్ళూ అధ్భుతమైన టీం వర్క్ చేసి ఈ మొట్టమొదటి ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుని దిగ్విజయంగా జరిపించారు.

"అది సరే, ఇండియాలో ఏదో పొడిచేసినట్టు పోజు కొడుతున్నావు కానీ, ఈ సమ్మర్ లో పెసర వడియాలు ఎలాపెట్టమంటావ్?" నిలదీసింది మా క్వీన్ విక్టోరియా హ్యూస్టన్ లో అడుగుపెట్టగానే.

"దానికేముందీ, మామూలుగా పెసరపిండి నానబోసి, ఎర్ర మిరపకాయలు దట్టించి, ఉప్పు.." అంటూండగా,

"అది కాదోయ్ వెర్రి మొహమా, మాలతీ చందూర్ అదంతా ఎప్పుడో రాసింది. ఆ తరవాత ఏం చెయ్యాలీ అనీ నా ప్రశ్న?"....నా పెట్టెలు అన్నీ మళ్ళీ కెలుకుతూ.

"అందరూ నా మొహం మీద కామెంట్ చెయ్యడం నాకు బొత్తిగా నచ్చదు హనీ" అందామనుకుని, హనీ మొహం చూసి, ఆ కార్యక్రమం వాయిదా వేసి,

"ఏం, చిన్న, చిన్న ఉండలు చేసి ఎండలో ఆరబెట్టడమే" అన్నాను ..ఎందుకో తెలియదు కానీ ఈ టాపిక్కి వెనకాల ఏదో ఉందని నా అంతరాత్మ ఘోషిస్తోంది.

"నీ సోకాల్డ్ తెకోరాంధ్రా మొత్తం మీద నీ మొహానికి ఎవరూ ఖద్దరు శాలువా కూడా ఇచ్చినట్టు లేదే. నో పెసర ఆర్ మినప వడియాలూ దిస్ సమ్మర్. శాలువా లేకుండా వడియాలు ఎలా ఆరబెడతారోయ్ అర్భకం మొగుడూ..., అంత డబ్బు తగలేసి, అంత మందిని పోగేసి, అందరికీ పట్టు శాలువాలు కప్పావు, మతి లేకపోతే సరి". వైజాగ్ లో పుట్టింటి వారింటి దగ్గర అందుబాటులో ఉన్న ఆసుపత్రి ఆవిడకి మళ్ళీ జ్ఞాపకం వచ్చిందని నాకు అనుమానం వచ్చింది ఈ డైలాగుతో.

ఇందులో రాజుగారి మీద రాణీ గారికి ఏదో ఒకానొక కంప్లెయింట్ ఉన్నదనీ, అది వడియాలు పెట్టుటపై కాదనీ నాకు అనుమానం వచ్చేసింది. కంప్లెయింటు వినపడుచున్నది కానీ స్పష్టముగా తెలియుట లేదు. "అడగండి చెప్తాను" అని మాలతీ చందూర్ అన్నింటికీ ఆన్సర్లు చెప్తారుగా, ఆవిణ్ణే అడుగుదాం అని ఫోన్ తీశాను.

*****

# నాటకాలూ – నానా అవస్థలూ

**నా చిన్నప్పుడు, అంటే కాకినాడలో ఇంజనీరింగు పూర్తి చేసి** బొంబాయి ఐ.ఐ.టిలో చేరిన నాలుగైదు వారాలలో ఈ రోగం నాకు అంటుకుంది. అప్పటినుంచీ, ఇప్పటి వరకూ....అంటే బాల్చీ తన్నేసే వయసు వచ్చినా కూడా ఈ జాడ్యం వదలటం లేదు. ఇది వరలో నేను చాలా సార్లు ప్రవచించినట్టు తెలుగు నాటకం రాయడం, వేషాలు వెయ్యడం, మొదలైనవన్నీ సాహిత్యం లాగానే మామూలు దురదలు కావు... సరదా దురదలు....ఎంత గోకినా పోవు.

బొంబాయిలో నాకు పరిచయం అయిన మొదటి మిత్రులలో టీపీ కిషోర్ ఒకడు. నన్ను చూడగానే "నీ మొహం చూస్తే దొంగ వెధవలా ఉన్నావు.....ఏమన్నా డ్రామాలో వేషం వేస్తావా?" అని అడిగాడు.

చెప్పొద్దూ, నాకు ఒళ్ళు మండింది.... "వాట్ డు యు మీన్" అని తెలుగులో అడిగాను.

"ఏమీ లేదు, గురూ, అంత ఆవేశపడకు, ఏదో సరదాగా తెలుగు నాటకం వేద్దాం ఏమంటావ్" అన్నాడు. "అదా సంగతీ, నా మొహం దొంగ మొహం అని కనిపెట్టావుగా, నాకు ఎప్పటినుంచో ఒక కోరిక ఉంది....కాకినాడలో ఆ టాపిక్ మాట్లాడితే, నా కాళ్ళూ, వేళ్ళూ విరుగును.... కానీ ఈ బొంబాయిలో అలాటి ప్రోబ్లెం లేదు...మనందరం ఇల్లూ, అమ్మా, నాన్నలనించి పారిపోయివచ్చిన వాళ్ళమే కదా...ఇక్కడ ఎలాంటి పిచ్చి వేషాలు వేసినా పరవాలేదు" అన్నాను.

"గుడ్, అయితే, ఎలాటి పిచ్చి వేషం వేస్తావూ?" అన్నాడు కిషోర్.

"అదేలే, ఎందుకో తెలియదుకానీ, వికట్టాట్టహాసం చేస్తూ పాతాళభైరవి లో రంగారావు, మరొక సినిమాలో రాజనాల, మరింకో సినిమాలో ఆర్నాగేస్స్రరావు, లేదా ముక్కామల మొదలైన విలన్ పాత్రలో హారోయిన్ ని దూరం నుంచి ప్రేమించడం, మరీ ఎడ్వాన్సుడు నాటకం అయితే కాస్త అంటీ ముట్టనట్టుగా కావలించుకోవడం, ఇంకా హాలివుడ్ టైపు అయితే గాఢంగా కావలించుకొనుటయే కాక, చిన్న సైజు ముద్దు కూడా... అఫ్ కోర్స్, ఆ డిపార్ట్‌మెంట్స్‌లో నాకు పెద్ద నాలెడ్జ్ లేదనుకో అంచేత కాస్త ఎక్కువ రిహార్సల్స్ కావాలేమో... అది కూడా రెండు, మూడు వికట్టాట్టహాసాల తరవాతే సుమా... " అంటూండగా

"ఆగాగు, అక్కడితో ఆగు"...అర్జంటుగా నా వాగ్ధాటిని ఆపేశాడు కిషోర్. "నేను డ్రామా రాస్తాను కానీ, నీ పాత్ర కేవలం వికటాట్టహాసం మటుకే ఉంటుంది. కావలింతలూ, తరవాతి సీనులూ బొత్తిగా ఉండవు.....ఎందుకనగా, మన కేంపస్ మొత్తం మీద

వయసులో ఉన్న ఆడ పిల్లలు లేరు...మొత్తం బొంబాయి అంతా వెతికినా కనపడరు. మన నాటకంలో వేసే అందగత్తెలు అసలు కనపడరు.... ఒక వేళ కనపడినా, వాళ్ళు ఈ నాటకంలో అటువంటి పాత్ర వెయ్యడానికి ఇష్టపడినా, అలా కావలింతలూ, ముద్దులూ ఉన్న సదరు పాత్ర నేనే వేస్తాను కానీ నీ లాంటి దొంగ మొహం వాడికి ఎందుకిస్తానూ?" అని స్వర్గీయ కిషోర్ ఒక డ్రామా రాశాడు.

నా జన్మలో మొట్టమొదటి సారిగా స్టేజి ఎక్కి నాటకంలో వేషం వేసినది కిషోర్ రాసిన "వికటాట్టహాసం చేసే విలన్ పాత్రలోనే. ఆ రోజుల సినిమాలలో ప్రగాఢమైన రేప్ సీనులు, బెడ్ రూం లో మొదలు పెట్టి, అటు స్విట్జర్లాండ్ మీదుగా నయాగరా ఫాల్స్ దాకా సాగే మానభంగాల సీనులూ ఉండేవి కావు. మహా అయితే పూర్తిగా బట్టలు వేసుకున్న కావలింతల సీన్లూ, రెండు పక్షులు లేదా తుమ్మెద మరియు గులాబీ పుష్పమూ కిచకిచలాడుతుండే దృశ్యాలే ఉండేవి. వాటికే కొంతమంది వయసు మళ్ళిన "మోరల్ మెజారిటీ" బాపతు పెద్దలు గిజగిజలాడిపోయే వారు. .....బహుశా వాళ్ళకి ఆ ఛాన్సు లేదే అని కాబోలు.

అసలంటూ ఎక్కడో అక్కడ ఉంటే, గింటే, దేవుడు చేసిన మహా అన్యాయాలలో కిషోర్‌ని ఆ చిన్న వయసులోనే తగని వ్యసనాలని అంటగట్టి తనలో కలిపేసుకోడం. నేనింకా బతికి ఉండడం నాకు ఆశ్చర్యంగానూ, నాకున్న "గాఢ మిత్రులూ-గూఢ శత్రువులు" మొదలైనవారికి నిరాశగానూ ఉంది. కానీ పాపీ చిరాయువు అంటారు కదా పెద్దలు...బహుశా ఆ కేటగిరీలోకి వస్తానేమో. ఏమైతేనేం, ఏ ముహూర్తాన బొంబాయిలో స్టేజి ఎక్కానో, ఇప్పటిదాకా ఇంకా ఆ స్టేజి దిగలేదు. పైగా, నేను అక్కినేని నాగేస్వరావులా ఎంత బిగుసుకు పోయి నటించినా, ఆడియన్సుకి మటుకు అల్లు రామలింగయ్యలా లూజు, లూజుగానే కనపడి నవ్వుకుంటారు...

ఇన్నేళ్ళగా నేను గమనించినది ఏమిటంటే, నాటకాలు వేసేవాళ్ళంటే అమెరికాలోనూ, ఆంధ్రాలోనూ అందరికీ లోకువే. ఎందుకూ పనికిరాని వాళ్ళు మాత్రమే నాటకాలాడతారని జనం అనుకుంటారు. కానీ, ఎప్పుడైతే ఈ నటులు సినిమాలలోకి వెళ్ళి, ఒకటో, రెండో సినిమాలలో ఆ రోజులలో నకులుడు, సహదేవుడి పాత్రలు, ఈ రోజులలో హీరో వెనక అరమైలు దూరంలో నుంచున్నా, కిళ్ళీకొట్టు దగ్గర బీడీ తాగుతున్న సీనులో అరక్షణం సినిమాలో కనిపించగానే, సంఘ గౌరవం అఖండంగా పెరిగిపోతుంది. తానా వారు, ఆటా వారు వాళ్ళని ప్రత్యేకంగా ఆహ్వానించి డబ్బిచ్చి ఫొటోలు తీయించుకుంటారు.

అమెరికాలో నాటకాల వాళ్ళ విషయం ఏ ఊళ్ళో లో అయినా అంతంత మాత్రమే. ఉదాహరణకి మా ఊరే తీసుకోండి. ఎప్పుడైనా నాకో మరొకరికో తెలుగు నాటకం వేద్దామని సరదా దురద పుట్టిందనుకోండి. వెంఠనే నేను ఆంజనేయుడికి అంజనం వేసి అందులో మా ఊళ్ళో నటీ నటులు ఎవరున్నారా అని ఒక  దుర్భిణీలో చూస్తాను. వీలైతే అందరికీ ఈ మైల్ పంపించి "నాటకంలో వేషం వేస్తారా" అని అడుగుతాను. అఫ్ కోర్స్, నా ఈ మెయిల్స్ చాలా మంది చూడకుండానే ఠకీమని జంక్ బాక్స్‌లోకి తోసేస్తారనుకోండి. అది వేరే విషయం. అప్పుడప్పుడు కొంతమంది చాలా ఇంట్రస్టుతో సమాధానం పంపిస్తారు. ఒకసారి ఒకావిడ "మా - ఆయన్ని పబ్లిగ్గా స్టేజి మీద అడ్డమైన తిట్లూ తిట్టే రోల్, లేదా కొంచెం లెవెల్ పెంచి చెయ్యి కూడా చేసుకునే పాత్ర కానీ ఏమైనా ఉందా మీ నాటకంలో?" అని అడిగింది. ఎలాగో అలాగ నలుగురో, ఐదుగురో నటీ నటులని పోగేసిన తరవాత, "ఏం నాటకం వేద్దాం?" అన్న సమస్య వస్తుంది.

ఇదొక నిజమైన సమస్యే. ఎందుకంటే ఎప్పుడైనా ఇండియా వెళ్ళినప్పుడు ఏ బుక్ షాపులోకి అయినా వెళ్ళి "ఏమండీ, ఏమన్నా మంచి నాటకాల పుస్తకాలు ఉన్నాయా?" అని అడిగారనుకోండి. సాధారణంగా ఆ ప్రశ్న ఆ షాపు వాడికి అర్థం అవదు. ఒక సారి "నాటకాల పుస్తకమా, ఏమిటి సార్, జోకులేస్తున్నారా? మీరు గ్యారంటీగా ఎన్నారై అయి ఉంటారు. లేకపోతే ఈ రోజుల్లో తెలుగులో నాటకాలూ, నవలలూ ఎవరు రాస్తున్నారు సార్" అంటూ ఒక ముసలి షాపు ఓనరు లోపలికి వెళ్ళి దుమ్మూ, ధూళీతో ఘుమ ఘుమ లాడుతున్న ఒక పాతిక పుస్తకాలు పట్టుకొచ్చి ఇవి తీసుకోండి, డబ్బక్కర లేదు లెండి, పాపం, ఆ రచయితల ఆత్మ శాంతిస్తుంది ఇప్పటికైనా" అన్నాడు. అందులో ఒక పుస్తకం స్వయానా మా తాత గారు..అంటే మా మాతామహులు సుమారు 1910 లో రాసిన

"విమలా ప్రభాకరము" అనే షేక్స్‌పియర్ నాటకానికి తెలుగు అనువాదం. నాకు తెలిసీ మా తాత గారే షేక్స్‌పియర్ నాటకాలలో కొన్నింటిని తెలుగులోకి అనువాదం చేసిన మొదటి రచయిత ..ట. ఆయన 1912లో పోయారు. అప్పటికి ఇంకా నేను పుట్టలేదని మీరు గ్రహించే ఉంటారు. మా అమ్మకే అప్పుడు నాలుగేళ్ళే కదా....

ఒక వేళ కొన్ని నాటకాల పుస్తకాలు దొరికినా, ఆ సబ్జెక్టు ఏమీ అమెరికాలో వేసేవి కావు. ఆ మాటకొస్తే, ఇండియాలో కూడా వెయ్యరు ఆ నాటకాల్ని. అందుకే, నటీ, నటులు దొరికాక, ఒడ్డూ, పొడుగూ, యాసా, నవ్వూ, ఏడుపూ మొదలైన పెర్సనాలిటీలని బట్టి, మా నాటకం మేమే రాసుకోవడం అలవాటయిపోయింది. ఒకసారి ఒక సుప్రసిద్ధ రచయిత, నటుడు...తనికెళ్ళ భరణి అని జ్ఞాపకం...." అమ్మ బాబోయ్, మీ అమెరికా తెలుగు ప్రేక్షకులని నవ్వించడం, మెప్పించడం మాకు చేత కాదు సార్....మా ఇండియా జోకులు, నాటకాలు అక్కడ పేలవు. మీరే ఏదైనా రాసి మా మొహాన్న పడెయ్యండి, మేము అవే వేస్తాం" అన్నాడు.

సరే, మూడు, నాలుగు నెలలు ఇంట్లో వాళ్ళందరిచేతా చివాట్లు తింటూ, మనం చెయ్యవల్సిన పనులన్నీ వాళ్ళ నెత్తిన రుద్దేసి....డ్రామా రిహార్సల్స్ మొదలుపెడతాం. అసలు సంగతి అందరికీ తెలిసినదే... అసలు స్టేజి మీద ఎలా ఏడిచి చచ్చినా, ఈ రిహార్సల్స్ మటుకు ఎప్పుడూ మహా సరదాగా ఉంటాయి. ఉదాహరణకి ఒక నాటకంలో ఒకావిడకి...పేరు చెప్పను లెండి...క్వీన్ విక్టోరియా అనుకుందాం.... ఆవిడకి ఎన్టీవోడిలా కొన్ని మాటలు, వత్తులు పలికేవి కావు...రెండు రిహార్సల్స్ తరవాత ఈ రహస్యం కనిపెట్టేసి, పాత్ర అంతా ఆవిడకి నోరు తిరిగే భాషలోనే తిరిగి రాయవలసి వచ్చింది.

ఇక అన్నింటికన్నా పెద్ద చికాకు బతిమాలడం కార్యక్రమం. అంటే ఈ తానా, ఆటా, మరియు అన్ని తెలుగు సంఘాల - ఆర్గనైజర్లనీ ఈ నాటకం వేసే అవకాశం కోసం కాళ్ళా, వేళ్ళా పట్టుకుని బతిమాలడం. వాళ్ళ మొట్ట మొదటి ప్రశ్న.....ఎంత సేపు? అనగా టైము ఎంత కావాలీ" అని నిలదీస్తారు...అక్కడికి మిగిలిన ప్రోగ్రామంతా హై క్లాసు కార్యక్రమాలతో నిండిపోయి మనకి టైము ఇవ్వడానికి ఏదో ఫేవరు చేస్తున్నట్టుగా. "అరగంట" అని చెప్పామనుకోండి. "అయ్య బాబోయి, అరగంటే, పావు గంటలో వెయ్యలేరా?" అన్నాడు ఒక మహా ఆర్గనైజరు వీరుడు.

"అఫ్ కోర్స్, వెయ్యచ్చనుకోండి. మా ఏక్టర్లలో చాలా మంది వాళ్ళ డైలాగులు మరిచిపోతున్నారు. పైగా ఆఖర్న చెప్పాల్సిన క్లోజింగు డైలాగు ముందే చెప్పారనుకోండి కొంతమంది నటీ నటులు, ఇంకేముందీ, అరగంట బదులు ఐదు నిముషాలలోనే ఫినిష్ చేసేస్తాం" అన్నాను.

ఈ డైలాగు ఆయనకి అర్థం అవలేదనుకుంటాను. మొహం అదోలా పెట్టాడు.

"అదే సార్, ఓపెనింగ్ స్పీచ్ బదులు, అనుకోకుండా మీరు వందన సమర్పణ చేసి జనగణమణ పాడేశారనుకోండి..అలాంటిదనమాట" అని విశదీకరించాను. మొత్తానికి ఇండియా పద్ధతిలో ఆయన స్వయానా బావ మరిదికి ఒక చిన్న వేషం ఇచ్చి, లంచం ఇచ్చి, రికమండేషన్ చేయించడం వలన, మధ్యాహ్నం లంచ్ టైములో హాలులో అందరూ అప్పడాలూ, చికెనూ తినడానికి వెళ్ళిపోయే టైములో మా బృందానికి ఇరవై ఆరు నిముషాలు కేటాయించారు "అర నిముషం ఎక్కువైతే, మైకులు కట్ చేసేస్తాం" అని వార్నింగ్ ఇస్తూ. "సరే, సార్, అలాగే" అని వాగ్దానం చేసేసి, ఆఖరు క్షణంలో సదరు బావ మరిది పాత్ర కేన్సిల్ చేసి పారేసి, నా మాట నిలబెట్టుకున్నాను.

మరొక విశేషం ఏమిటంటే, అమెరికాలో ఎక్కడ నాటకం వేసినా, మా ఖర్చులన్నీ మేమే పెట్టుకుంటాం. అనగా, ప్రవేశ రుసుము, ప్రయాణం ఖర్చులు, కాస్ట్యూములు, ఒకటేమిటి అన్నీ కలిపి తానా, ఆటా సభలలో అయితే మనిషికి కనీసం వెయ్యి డాలర్ల పైగా ఖర్చు అవుతుంది. అదే వాళ్ళు ఇండియానించి ప్రత్యేకంగా తెప్పించిన సినిమా వారి నాటకానికి యాభై వేల డాలర్లకు పైగా భరిస్తారు. అమెరికా నాటకానికి మాత్రం స్టేండింగు మైకులు తప్ప చొక్కాకో, చీరకో తగిలించుకునే లేపెల్ మైకులు సాధారణంగా ఇవ్వరు. ఒక వేళ ఇచ్చినా,

పిల్లల గోల, ఆడియన్స్ నిరంతరంగా చెప్పుకునే కబుర్లూ, కాకరకాయల మధ్య కేవలం మొదటి రెండు వరసలకి మాత్రమే మా డైలాగులు వినపడును. మిగిలిన వారికి పాత్రోచితమైన హావ, భావాలతో మా మొహాలు మాత్రమే కనపడుతూ, ఉంటే గింటే బాడీ లాంగ్వేజీ మాత్రమే కనపడి వినపడి అనేక అపార్థాలకి దారి తీస్తుంది. ఒకసారి నేను అతి కోపంగా హీరోయిన్ కేసి నడుస్తూ, చేతులు ముందుకు చాపే సీను అత్యంత సహజంగా నటిస్తుండగా, ఎక్కడో వెనకాలనుంచి వీడియో తీస్తున్న ఆవిడ భర్త గారు అది నేనేదో అతిగా ప్రేమ నటిస్తున్నాననుకుని వీడియో మానేసి స్టేజి మీదకి పరిగెట్టగా, రిహర్సల్స్‌లో లేదు కాబట్టి  మేమంతా బిక్క చచ్చిపోయాం ఆ సీనులో ఎలా నటించాలో తెలియక.

ఈ సంగతులన్నీ రంగరించి చూడగా అమెరికాలో తెలుగు రంగస్థలానికి, నటీ నటులకి తగిన గౌరవం లేదని మాలో కొందరికి అనిపించి, దేశస్థాయిలో అటువంటి అవకాశం కనిపించాలని "అమెరికా తెలుగు నాటకోత్సవాలు" అనే పేరిట ఒక నూతన ప్రయోగం మొదలుపెట్టాం. జూన్ 9, 2007 నాడు మొట్ట మొదటి అమెరికా తెలుగు నాటకోత్సవం శాన్ ఏంటోనియో నగరంలో నిర్వహిస్తున్నాం. తెలుగు నాటకాభిమానులందరూ బంధు మిత్ర సపరివారంగా వచ్చి మదర్పిత నాటక తాంబూలాలని స్వీకరించి ఆనందించమని కోరుతున్నాం.

## ముఖ్యమంత్రులూ – ముసిరే దోమలూ

**నేనే కాదు, మీరు కూడా గమనించే ఉంటారు.** ప్రస్తుతం అమెరికాలో ప్రస్తుత మరియు మాజీ ఆంధ్రా ముఖ్యమంత్రుల సీజనే కాక అదే కేటగిరీకి చెందిన అమాత్యుల అమెరికా పర్యటనలు కూడా భారీగా ఉన్నాయి. గత నెలలో ప్రస్తుత ముఖ్యమంత్రిగారు అమెరికా వచ్చేస్తే...సారీ..విచ్చేస్తే...ఈ నెల మాజీ ముఖ్యమంత్రి గారు అమెరికా విచ్చేశారు..సారీ ..వచ్చేశారు. మీకు కూడా తెలుసుగా... పదవిలో ఉన్న వారు సగౌరవంగా విచ్చేయుదురు. లేని వారు మామూలుగా వచ్చుదురు.. ముఖ్య మంత్రి అయినా, పోర్ట్ ఫోలియో లేని మంత్రి అయినా, తనకున్న పోర్ట్‌ఫోలియో ఏమిటో తెలియకపోయినా మంత్రి పుంగవులు అందరికీ అమెరికా ఇప్పుడు రావడానికి మొదటి కారణం మటుకు ఒకటే.....వచ్చే ఏడు రాబోయే ఎన్నికలకి అందరి డబ్బూ, దస్కం, కులం, గిలం ..అంటే స్వకులం వారి అండదండలూ, డొనేషన్‌లూ, పరాయి గిలం వారిని తమ వేపు తిప్పుకునే మార్గాన్వేషణలూ ఇలాటివన్నీ అన్వేషించడానికే అని నా బోటి వెరీ బ్రిలియంట్ వెర్రి వెధవాయికి కూడా తెలిసిన చిదంబర రహస్యం. అమెరికా తిరనాళ్ళలో మన వేపు ఎలా తిప్పుకోవాలీ అనే సమస్య బాగా డబ్బున్న వాళ్ళ తోటీ, మధ్య తరగతి వాళ్ళ తోటీ మాత్రమే. బీదా, బిక్కీ, బడుగూ, గిడుగూ, చదువూ, సంధ్యా లేని ఓటర్లని డబ్బూ, గిబ్బూ, సారా, గీరా మొదలైన వాటితో మార్కెట్ రేటు ప్రకారం కొనుక్కోవచ్చుగా. అది ఏ మాత్రం ఇబ్బంది లేని పనేగా.

నేను గత కొన్ని దశాబ్దాలుగా రిసెర్చ్ చేసి కనిపెట్టిన ప్రాథమిక సూత్రం ఏమిటంటే..... ఏ మంత్రిగారైనా వస్తున్నారు అనగానే ఆయన వర్గం వారు అమెరికా అంతటా ..ముఖ్యంగా సదరు మినిస్టరు గారు విచ్చేసే నగరాలలో ప్రైవేటు మీటింగులు పెట్టుకుని, మొదటి దండ ఎవరు వెయ్యాలి, స్టేజి మీద ఎవరెవరు ఎక్కడ కూచోవాలి, ఆయనకి ఇవ్వగానే, "ఈ చెత్తంతా ఇండియా దాకా ఎవడు

మోసుకెడతాడులే" అని ఎవరూ చూడకుండా చెత్త డబ్బాలో పారేసే పతకమూ, ప్రశంసా పత్రమూ, ఎంతో జాగ్రత్తగా ఇండియా తీసుకెళ్ళే గిఫ్టులు, అంటే తైవాన్‌లో తయారయిన అమెరికా చెడ్డీలూ, మరియు ఆయన తాలూకు ఆడవారికి వజ్రాల నెక్లెసూ ఎవరు ఇవ్వాలీ మొదలైన అత్యంత ముఖ్యమైన విషయాల మీద ఐక్యరాజ్య సమితి స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటారు. అప్పుడప్పుడు ఈయనగారి రాక కేవలం ముందు రోజు మాత్రమే తెలిసినా ఇలాంటి మీటింగు కనీసం ఫోనులో ఐనా, రాత్రి ఒంటి గంటకైనా సరే జరిగి తీరుతుంది. ఈ మీటింగులలో మరొక ఎజెండా అంశం తసమదీయులలో, అంటే, మిగిలిన వర్గాలలో రాజకీయ పరంగా ఎవరు ఉపయోగపడతారూ, రెండో దండ వేయిస్తే డబ్బెంత ఇస్తాడూ, నిజంగానే మంత్రిగారు స్టేజి మీద ఆప్యాయంగా, అంటే అమెరికా పద్ధతిలో ఎముకలు విరక్కుండా కావలించుకుంటే దాని రేటెంత, ఇండియా పద్ధతిలో ప్రాణం విలవిలలాడేదాకా ఆలింగనమూ మరియూ వీపు గోకుడూ మొదలైన ప్రగాఢ స్నేహ పూర్వకమైన పిచ్చి వేషాలకి మొత్తం ఖర్చు అంతా పెట్టుకునే అవకాశం ఉందా అని కూడా చర్చలు జరుగుతాయి. అఫ్ కోర్స్, పది, పదిహేనేళ్ళ క్రితం ఇలాంటి డబ్బు రాబట్టుకునే సంగతులు తెలిసి చచ్చేవి కాదు కానీ, ఈ రోజులలో ఆ ప్రోబ్లెం లేదు. ఎందుకంటే అమెరికాలో ప్రతీ ఊళ్ళోనూ ఏ వర్గంలో ఎవరు దేనికి ఎంత డబ్బిస్తారూ అనే విషయాలు అందరికీ తెలిసిపోయాయి. ఉదాహరణకి, మా ఊళ్ళో, ఎటువంటి కావలించుకునే కార్యక్రమానికైనా, కాణీ రాబట్టడానికైనా నన్ను ఎవరూ తలపరు, పిలవరు, మాట్లాడరు, అడగరు, ఉలకరు, పలకరు. ఆ మాటకొస్తే మా వర్గం వారి అందరి రెప్యుటేషనూ కూడా అంతంత మాత్రమే. ఈ పేరాగ్రాఫులో వర్గం అంటే మీకు అర్ధం అవకపోతే చెప్పుట సులభమే కానీ చెప్పిన యడల అన్ని వర్గముల వారితోనూ, మా క్వీన్ విక్టోరియా తోనూ నేను టెంకి జెల్లలు తినుట కూడా గ్యారంటీ. మా వర్గ ప్రతిష్ట "ప్రతిగ్రహం" అనగా పుచ్చుకొనుటయే మా జన్మ హక్కు. డబ్బిచ్చుట అలవాటి బుచ్చెమ్మల నాటి చచ్చు సంప్రదాయం.

ఈ జూన్-జులై -ఆగస్టు సీజన్‌లో కేవలం మంత్రులే కాక మిగిలిన ఉపపాండవులూ... అంటే ఐయేస్ ఆఫీసర్లూ, పార్టీ వినాయకులూ, వ్యాపార వేత్తలూ, కవులూ, పండితులూ, స్వామీజీలూ కూడా అమెరికా గుంపులు, గుంపులుగా అమెరికా రావడానికి మరొక ముఖ్య కారణం వాళ్ళు కళ్ళారా చూసి తరిద్దామనుకునే సినీ తారలని చూడ్డమే కాకుండా, నిజంగా, అచ్చంగా, ముఖ్యంగా ఇంపోర్టెడ్ తెలుగు హీరోయిన్‌లని క్షణం కంటే ఎక్కువగా ముట్టుకునే అవకాశాలు...ఈ మ్లేచ్ఛ ఖండంలోనే....అనగా అమెరికాలోనే, ఈ సీజన్ లోనే దొరుకుతాయి. ఎందుకంటే ఈ సీజన్‌లోనే అమెరికా తెలుగు తిరనాళ్ళు. జరుగుతాయి. గిట్టని వాళ్ళు వాటినే తానా మహసభలనీ, ఆటా కన్వెన్షన్ అనీ పిలుస్తూ ఉంటారు.

నాకు బాగా జ్ఞాపకం..జ్ఞాపకం ఏమిటీ నా మొహం....ఆరేళ్ళ క్రితం జరిగిన సంఘటన తల్చుకుంటే నా కుడి చెయ్యి వణుకుతోంది, ఎడంచేతికి మళ్ళీ పక్షవాతం వస్తోంది. ఎందుకంటే ఒక అమెరికా తిరనాళ్ళలో నేను ఒక నాటకం వేసి, స్టేజి దిగి గ్రీన్ రూంలోకి రాగానే ఒకావిడ చుట్టూ పోలీసులతో...స్మార్ట్‌గా, అందంగా ఉండే అమెరికా పోలీసులు లెండి...పొట్టి లాగులూ, భారీ పొట్టలతో ఉండే మన వెంకట స్వాములు కాదు....అరడజను ఆర్గాన్ రైజర్లతో...సారీ.. ఆర్గనైజర్లతో విలాసంగా నిలబడి ఉంటే అనాలోచితంగా ఆ మహా సభల అధ్యక్షులవారు ఆవిడకి నన్ను పరిచయం చేశారు. ఆవిడ చెయ్యి చాపగానే నా మామూలు అలవాటు ప్రకారం నేను నా కుడి చెయ్యి పైన, దాని కింద ఆవిడ "ఈ వెధవెవడోయ్?" అనే చూపుతో ఆప్యాయంగా చాపిన కోమల హస్తమూ, మళ్ళీ దాని క్రింద నా వామ హస్తమూ కలిపి, రంగరించి కరచాలనం చేశాను. అసలు సమస్య ఏమిటంటే, ఆవిడ ఎవరో తెలిసిన మొహంలా ఉంది కానీ, తెలియదు.. ఎవరైతేనేం, బహు సున్నిత స్పర్శ అనుభవించక వాపోవుట ఎందుకూ అని అప్పటి వరకూ ...హాయిగా ఉందిగదా పోనీలే అని నేను నా మామూలు మొహంతోటే చిన్నసైజు మందహాసం చేస్తూండగా, సదరు అధ్యక్షుల వారు, నోరు మూసుకుని ఉండకుండా "మీకు తెలుసుగా, ఈవిడ ఫేమస్ బాలీఉడ్, తాలీఉడ్, టేక్ ఉడ్, సరుగుగుడు చెట్ల ఉడ్, అబ్బనీ, తియ్యనీ దెబ్బ ఫేం, శ్రీదేవి గారు, అవర్ చీఫ్ గెస్ట్ టు డే" అని ఆవిడని ఇంప్రెస్ చెయ్యడానికి తన పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ, పరిచయం చేశారు. అప్పటికి మామూలు పద్ధతిలో

పూర్తిగా వెనక్కి లాగేసుకున్న నా రెండు చేతులనీ శరవేగమూ, మరియు లైట్నింగ్ స్పీడ్‌తో మరొక కరచాలనం కోసం దూసుకుపోయాను. కానీ అప్పటికే ఆ నటీమణి, భర్త బోనీ కపూర్ కబంధహస్తాలలో ఇరుక్కుపోయి, అక్కడ ఉన్న మిగిలిన చచ్చు వెధవలతో కిచ కిచ లాడుతోంది. అదుగో, అప్పటినుంచీ మొదలయ్యింది నా కుడిచేతి ప్రకంపనం. ఎడం చేతి పక్షవాతం. మన సినీ హీరోయిన్లకి అంత పవర్ ఉంది కాబట్టే ప్రకంపనం, పక్షవాతం రోగాలన్నిటికీ సిద్ధపడి పైన ఉదహరించిన కవులూ, పండితులూ, మంత్రులూ ఆంధ్రాలో దొరకని అపురూప అవకాశాల కోసం అమెరికా ఈ సీజన్ లో వస్తారు అని నా అభిప్రాయం. పైగా, ఈ చెయ్యి వణకడం లాంటివి టెంపరరీలే అని మా క్వీన్ విక్టోరియాకి నచ్చ చెప్పినా. మహానటి శ్రీదేవి గారు, సన్మానానంతరం,  కేవలం ఒకే ఒక మాట, "థేంక్యూ" అని అంగ్రేజీలో చెప్పిన కార్యక్రమానికి కేవలం ముప్ఫై వేల డాలర్లు మాత్రమే నిర్వాహకులు ఖర్చు పెట్టారని తెలియగానే అంత ఖరీదైన చేతిని క్షణం ముట్టుకున్న నా చేతులకి పెర్మనెంటు రోగాలు రావడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. ఇలాటి ఖర్చులు పెట్టి, నాబోటి గాళ్ళని ఇలాటి కష్టాలు పెట్టవద్దనీ ఆర్గాన్ రైజర్లని...సారీ... ఆర్గనైజర్లని కోరుతున్నాను.

సినిమా తారల ప్రభావం నిరూపించడానికి మరొక ఉదాహరణ కూడా ఉదహరిస్తాను,. ఒక సారి, మా హ్యూస్టన్‌కి ఒక పేద్ద స్వామీజీ వచ్చారు.... సారీ విచ్చేశారు. అప్పుడు మా అమ్మాయి పసి పాప...కేవలం మూడు నెలలు. ఆయన ఆశీర్వచనం కోసం స్వామీజీ గారి దగ్గరకి తీసుకెళ్ళి, కాళ్ళకి నమస్కారం పెడుతూండగా, పొరపాటున మా అమ్మాయి మృదువైన చిన్న చెయ్యి ఆయన పాదాలకి తగిలింది. ఆయన ఠకీమని నాలుగు అడుగులు వెనక్కి వేసి "నా దేహం పవిత్రం. ఎవరూ ముట్టుకోకూడదు. ఆ మాత్రం తెలియదా" అని కోప్పడ్డారు. బహుశా  రాత్రి ఇంటికెళ్ళి గోమూత్రంతో స్నానం చేసి, దేహశుద్ధి చేసుకుంటారేమో, అమెరికా గోమూత్రం పనికొస్తుందో లేదో అని నేను చాలా మథన పడ్డాను. సరిగ్గా ఆ రోజు సాయంత్రం జరిగిన మహాసభలో ఒకానొక సినీతారని ఆయన ఎముకలు విరిగేలా కావలించుకోడం చూసి మా క్వీన్ విక్టోరియా గింజుకున్నా, నేను ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే, సదరు సినిమా తార ఎముకలు విరిగాయి కానీ, స్వామీజీ గారు నిక్షేపంగా, ద్విగిణీకృతమైన ఉత్సాహంతో, "మానవజీవితంలో ప్రేమ పాలు" అనే అంశంపై అనర్గళంగా ప్రసంగించారు. ఇందులో  ప్రేమ అంటే నాకు తెలుసు కానీ, "ప్రేమ పాలు" అంటే ఏమిటో మరి?

అసలు విషయం ఏమిటంటే, ఎక్కడ బెల్లం ఉంటే అక్కడ దోమలు, ఈగలు ముసురుతాయి. దేముళ్ళూ, దేవతలూ ఎలాగా దిగిరారు కాబట్టి, సెకండ్ బెస్ట్ అయిన స్వామీజీలు దిగితే నరకానికి పోడం ఇష్టంలేని లక్షలమంది చుట్టుముడతారు. రాజకీయ నాయకులు వస్తే, ఆ వాసన కావలిసిన వాళ్ళు వేల కొద్దీ వాళ్ళ చుట్టూ తిరుగుతారు.. ఇక కార్పొరేట్ వారు, అంటే వ్యాపారస్తులు వస్తే బిజినెస్ డీల్స్ కోసం వందలకొద్దీ వాళ్ళ చుట్టూ తిరుగుతారు. ఎందుకూ పనికిరాని. పండితులూ, తెలుగు భాషావేత్తలూ వస్తే మర్యాద కోసం పది, పదిహేను మంది పలకరిస్తారు. సినిమా తారలు వస్తే, రాజకీయ నాయకులు, స్వామీజీలు, కార్పొరేట్ వారు, పండితులూ , నా బోటి అనామకులూ, మీ బోటి అమాయకులూ వెరసి కోట్లకొద్దీ తెలుగు వారు నీరాజనం పడతారు. ఈ సూత్రం అటు ఆంధ్రాలో ఎంత నిజమో, ఇటు అమెరికాలోనూ అంతే నిజం.. అన్నట్టు, పొరపాటున ఎవరైనా సంఘ సేవకులు వస్తే, రేపో, మాపో అనుకుంటున్న సినీ తారని అయినా సరే కూడా తీసుకెళ్ళండి.. మీ క్వీన్ విక్టోరియా కానీ, కింగ్ జార్జ్ కానీ విసుక్కోరు..గారంటీడ్... ***

# క్లింటన్‌దొరా - జిందాబాద్

**అసలు ఈ కాలర్లు ఎగరేసుకునే** సంప్రదాయం ఎక్కడినుంచి వచ్చిందో నాకు తెలియదు. ఎవరికైనా తెలిసినా నాకు చెప్పకండి..ప్లీజ్... ఎందుకంటే మీకు కూడా నిజంగా, ఖచ్చితంగా తెలియదనీ, కేవలం ఊహిస్తున్నారనీ నాకు తెలుసు. నా ఊహ ఏమిటంటే, మన పవిత్ర భారత లాల్చీలకు, చీరా జాకెట్టులకూ, గాంధీ బనియన్లకూ కాలర్లు ఉండక పోవుటయే కాక, అప్పుడప్పుడు చేతులు కూడా ఉండకపోవుటయూ, దొరలందరికీ...అంటే మన పిట్టల దొరలూ, కోయ దొరలూ కాదు... అసలు దొరలు వేసుకునే చొక్కాలూ, కోట్లూ మొదలైన వాటికి ఎల్లవేళలా కాలరు ఉండును కాబట్టి ఈ కాలరెత్తుట సత్సంప్రదాయం కూడా లండన్ నుంచి దిగుమతి అయిందనే నా నమ్మకం. యా దేశాలు చలితో బిగుసుకుపోయే దేశాలు కాబట్టి, ఎంత ఎక్కువ చెమటపడితే అంత గొప్పవాడని లెఖ్ఖ. అంచేత కాలరు ఎత్తుకుని చెమట తుడుచుకున్నవాళ్ళందరూ గొప్పవాళ్ళ కిందే జమ కదా. టెక్నాలజీని దొరలు మనకి ఔట్‌సోర్సింగ్ చేశారన్న మాట.

ఈ కాలరు ఉండుట, కొన్ని సమయములలో మాత్రమే అది ఎగరవేయుట మున్నగు విషయాలపై నా అమూల్యమైన ..అంటే.. ఏ మానవ మాత్రుడూ డబ్బిచ్చి కొనుక్కోని, ఒక వేళ నేనే డబ్బిచ్చినా అది జేబులో పెట్టేసుకుని పారిపోయేంత వాల్యూ ఉన్న నా అభిప్రాయం ఇప్పుడు వెలిబుచ్చడానికి కారణం గత రెండు, మూడు వారాలనుంచీ అమెరికా తెలుగు వారిలో, ముఖ్యంగా తానా తెలుగువారిని చూస్తే అందరి కాలర్లూ రెప, రెపలాడూతూ ఎగురుతూనే ఉన్నాయి. ఆఖరికి ఆఫీసులో అమ్మాయిల ముందు తప్ప మిగిలిన చోట్ల సిల్కు లాల్చీ ధరించి తరించే ఒకానొక మంచి చౌదరి మిత్రుడు కూడా లాల్చీకి జిగురు పెట్టి కాలరు అతికించుకుని మరీ ఎగరేశాడు. ఎందుకనగా మొన్న వాషింగ్టన్‌లో జరిగిన తానా మహాసభలకి ఆయన....అంటే అసలు, సిసలు దొర....బిల్ క్లింటన్ దొర.... విచ్చేసి, మిలియన్ డాలర్లు తనకూ, మరొక మిలియన్ డాలర్లు మానికా అనబడే అమ్మాయికీ.... ...సారీ..హిలరీ అనబడే అర్ధాంగి గారి ఎలక్షన్ నిమిత్తం చెక్కులు రాయించుకుని తెలుగు మహా సభల ప్రధానోపన్యాసం ఇంగ్లీషులో చేశారు. ఇక నాయుడు గారూ, మంత్రులూ, పొలిటికల్ రౌడీలూ వచ్చి అందరినీ అదరగొట్టేసిన విషయం గమనిస్తే మన తెలుగు సంఘాల ప్రాతిపదిక "కలాపోసన" నుంచి "రాజకీయ డామినేసన్" కి "ఎదిగి" లేదా "దిగజారి" పోయిందనడానికి ఏ విధమైన సందేహమూ లేదు.

అన్నట్టు, మీకు తెలిసే ఉంటుంది. అమెరికాలో మూడు రకాల తెలుగు వాళ్ళున్నారు. తానా వారు, ఆటా వారు,, "త్రిశంకు వర్గం" వారు..అంటే ఎటూ చెందక ఎంగిలి మెతుకులు తినేవారు, మరియు """ప్రైవేటు మేస్టరు" జాతి వాళ్ళు.. అంటే ఏదో పెళ్ళాం, పిల్లలూ, వాళ్ళ పెళ్ళిళ్ళు అవుతాయో, లేదో అనే బెంగలూ, ఉన్న కాస్త డబ్బు రోజూ లెఖ్ఖపెట్టుకుని ఆనందపడుతూ, స్టాక్ మార్కెట్ పడుతోందా. లేస్తోందా అని అని రోజూ దేవుడికి పూజలూ, పునస్కారాలూ చేసుకుంటూ, వీలున్నప్పుడల్లా పై మూడు కేటగిరీ వాళ్ళనీ కించపరిడం తప్ప సంఘానికి ఏ విధంగానూ ఉపయోగపడని వాళ్ళన్న మాట. అందరూ గోధుమ రంగు వాళ్ళే అయినా, ఒకరికీ, మరొకరికీ మధ్య మౌలికమైన బేధాలు ఉన్నాయి. ఉదాహరణకి, మొన్నటి తానా మహాసభలకి ఎంతమంది వచ్చారు అని తానా వారిని అడిగాం అనుకోండి. ఓరి నాయనోయ్, కనీసం పధ్నాలుగు వేల మంది గ్యారంటీగా వచ్చారు, వుయ్ క్రియేటెడ్ హిస్టరీ ఎగైన్... అంటారు సగర్వంగా. అదే ఆటా వారిని అడిగామనుకోండి. " అదెక్కడన్నా, మహా అయితే ఏడువేల మంది..మేక్సిమం...నువ్వే చెప్పు అన్నా, వాషింగ్టన్ లో ఆ మాత్రం రావడం పెద్ద ఇజ్జతా ఏంది? అంటారు. అదే "త్రిశంకు వర్గం" గాళ్ళని అడిగితే "ఏమో, మేమంతా భయం, భయంగా సర్దుకున్నాం, అక్కడా, ఇక్కడానూ, అంతా నందమూరి వారి ఫేమిలీ గెట్ టుగెదర్ లా ఉంది". అంటారు.. అవును మరి, మహాసభలకి విచ్చేసిన పదీ, పరకా నందమూరి కుటుంబ సభ్యులు ఆ నాటి ఎన్టీర్ నుండి ఈ నాటి ఎన్టీఆర్ వరకూ ఒకరినొకరు పొగుడుకుంటూ

అందర్నీ అమందానంద భరితుల్ని చేశారు గదా. "ఈ దెబ్బకి తానా వారి స్టాకు బలే పెరిగిపోయింది సార్, వచ్చే యేడు మరి ఆటా వారు ఏంచేస్తారో చూడాలి" అంటారు "ప్రైవేటు మేస్టర్లు". ఆటా వారు అప్పుడే జార్జ్ బుష్ గారికి ఫోన్ చేసి, "ఈ ఇరాక్ యుద్ధంలో గూబ వాయించుకుంటున్న కారణాన మీకెలాగా అమెరికాలోను, ప్రపంచం మొత్తం మీదే పరువుపోయింది కదా, అందుచేత మా వాళ్ళందరికీ నచ్చచెప్పే అవకాశం వచ్చే ఏడు మా ఆటా సభలలో బ్రహ్మాండమైన అవకాశం ఇస్తాం, మీ రేటు తగ్గిస్తారా?" అని బేరం పెట్టినట్టి నాకు ఇప్పుడే అందిన లోపాయికారీ వార్త.

చెప్పొద్దూ, క్లింటన్ దొరగారికి, హిలరీ దొరసాని గారికీ కలిసి రెండు మిలియన్ డాలర్లు ఇస్తున్నారని తెలిసి నాకు తానా వారి మీద జాలి వేసింది. అయ్యో పాపం అనుకుంటూ వెంటనే మిస్టర్ తానా గారికి అర్జంటుగా, ఫోన్ చేశాను. ఇక్కడ "అర్జంటు" అనే మాట అనగా అది పనీ, పాటూ లేని నాకు అన్వయించదనీ, ఫలానా మిస్టర్ తానా గారు రెస్ట్ రూం లో "అర్జంటు" పనిలో ఉన్నట్టు తెలియనేమిం చేసి, నేను "అర్జంటు" సమయంలో పిలిచాననీ గమనించగలరు. ఆయన బహుశా అత్యంత నైపుణ్యంతో కేవలం ఒక చేత్తో ఎవరికీ చెప్పలేని అవస్థ పడుతూ "హూ ఈజ్ దిస్, వాట్ డు యూ వాంట్, కాల్ మి బాక్ లేటర్, అయాం బిజీ" అని విసుక్కుంటూండగా, నేను, నిస్వార్థంగా, కేవలం తానా వారికి అంత డబ్బు ఆదాయం చేసే సదుద్దేశంతో "అయ్యా, నేను ఫలానా ఊళ్ళో ప్రైవేటు మేస్టర్ని, మీరు మిలియన్ డాలర్లు సేవ్ చేసుకునే ఉపాయం నా దగ్గర ఉంది. నేనే మీకు పది వేల డాలర్లు ఎదురు కట్నం ఇచ్చి, కీనోటో, గీనోటో ఎడ్రసు లాంటిదేదో నేనే ఇస్తాను. పైగా ఐ కెన్ టాక్ ఇన్ టెలుగూ, నో ప్రోబ్లెం" అన్నాను. ఎందుకో తెలియదు కానీ "యూ ఫూల్, ఇడియట్" లాటి ఘాటైన టెలుగు తిట్లు, వెనకాల నేపథ్యంలో పెద్ద ఎత్తున నీళ్ళ చప్పుడూ వినపడి, నేను చాలా ఆశాభంగం చెందాను. నయాగరా జలపాతం లాటి నీళ్ళచప్పుడు వలనే సదరు మిస్టర్ తానా వారు "అర్జంటు"పనిలో బిజీగా ఉన్నారని నేను తెలుసుకున్నాను. ఈ విషయంలో మిస్టర్ ఆటా వారిని కూడా త్వరలోనే పిలుస్తాను కానీ, వారి "అర్జంటు" కార్యక్రమాల జనరల్ టైమింగ్ ముందే కనుక్కుంటాను. ఎందుకైనా మంచిది కదా.

పైగా నేను విన్నదేమిటంటే ఈ క్లింటన్ దొరతో బాటు ఇప్పటివరకూ అమెరికాలో కనీ వినీ ఎరగని, ఈ గడ్డపై ఎవరూ ఎప్పుడూ చూడని మన శుద్ధ తెలుగు "కోయ దొర"ని తమ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఇండియానించి స్పెషల్‌గా పిలిచి నిర్వాహకులు గౌరవించారూ అని. ఇదే నిజమైతే, ఇక చెప్పేదేముందీ. అమెరికా తెలుగు చరిత్రలో అవధానాలూ, జానపద కళాకారులూ పోయి "కోయదొర"ల సువర్ణయుగం ప్రారంభం అయిందన మాటే. మీరు నమ్ముతారో నమ్మరో నాకు తెలియదు కానీ, నాకు మటుకు కోయదొరలంటే భలే భయం. ఎందుకంటే మా క్వీన్ విక్టోరియా చిన్నప్పుడు రైల్లో వెళ్తుంటే ఒక కోయదొర కనపడి, ఆవిడ సుందరవదనారవిందంలో కించిత్తు విచారం చూసి "అమ్మరోయమ్మ, నన్ను నమ్ము తల్లీ, మరో నాలుగేళ్ళలో వేపకాయంత వెర్రి మనిషి పై దేశం నుంచొచ్చి నిన్నెగరేసుకుపోవునమ్మోయ్, వాడికి తోచదూ, నువ్వు చెప్పినా వినడమ్మోయ్, కతలు చెప్పి వెతలు బెడతాడమ్మోయ్" అని చెప్పి, మా మామగారు కోపంగా చెయ్యి ఎత్తే లోపుగా తరవాతి స్టేషన్ లో దిగిపోయాడు. ఇప్పటికీ తను ఎప్పుడు ఇండియా వెళ్ళినా మా క్వీన్ గారు "కోయ గూడెం" రైల్వే స్టేషన్ కి పనిగట్టుకు వెళ్ళి, మళ్ళీ కోయ దొర వారు కనపడి ఈ కథానాయకుడి రోగాలకి "విరుగుడు" ఏమైనా చెప్తాడేమోనని ఆశగా ఎదురు చూస్తూ ఉంటుంది. అందుకే, తానా మహసభలకి ఒక కోయ దొర వస్తున్నాడని తెలియగానే నేను మా రిజర్వేషనూ, విమానం టిక్కెట్లూ అన్నీ "అర్జంటు"గా కేన్సిల్ చేసి పారేసి, ఈ కోయదొర గమనం వార్త మా విక్టోరియా మహరాణీకి ఏ మాత్రం తెలియకుండా జాగ్రత్త పడ్డాను. ఇక్కడ "అర్జంటు" అన్న మాట ఖచ్చితంగా నాకే అన్వయిస్తుందనీ, ఆ విధమైన కంగారు పడడానికి గల కారణాలు కూడా ప్రగాఢమైన వ్యక్తిగత కారణాలనీ గమనించగలరు.

ఈ మహాసభల గంగరగోళం ఇలా ఉండగా, గత రెండు, మూడు వారాలుగా అమెరికాలో కూడా ప్రసారమయే "బాహా" లేదా "హెమినై" మొదలైన తెలుగు "ఏటీవీ" అయినా సరే, స్విచ్ ఆన్ చెయ్యడానికి భయం వేస్తోంది. భయం అంటే నిజంగా భయం కాదు

గానీ, ప్రతీ క్షణమూ, ఎవరో ఒక నటుడో, నటీమణియో, అభిమాన బృందం తాలూకు వారో "జిందాబాద్" అనీ "హూహో, హూహో," అనీ నినాదాలు ఇస్తూ పాపం కాళ్ళు కొంకర్లుపోయిన కారణాన కొంచెం వంకరగా ఒక మోకాలు నిటారుగానూ, మరొకటి ముడిచిపెట్టుకునీ నిలబడ్డ మెగాస్టార్ "సిరంజీవి" ఫొటోలకి, కట్ ఔట్‌లకీ ప్రదక్షిణాలు చేస్తూ హడావుడి చేస్తున్నారు ఇరవైనాలుగ్గంటలూనూ. పాపం ఏమయిందో చిరంజీవికి అని నేను జాలిపడుతుంటే "ఏమిటవడం, ఏమిటీ, నీ మొహం, అది అసలైన మగాడు స్టయిల్ గా నిలబడితే అలాగే ఉంటుంది. అలాంటివి నీకేం తెలుస్తాయి కానీ అదంతా చిరంజీవి లేటెస్ట్ సినిమా "శంకర్ దాదా, జిందాబాద్" సినిమా వార్తలు" అని విశదీకరించింది వంటింట్లోంచి ఒక గొంతుక కించిత్తు నిరాశగా. అప్పటికి పది రోజులుగా పదివేల సార్లు విన్న కారణంగా

"ఓ అదా, ఆకలేస్తే అన్నంపెట్టవు, అలిసొస్తే ఆయిల్ రాయవు, ఆఖరికి నాకు మూడ్ వస్తే.." అనగానే, "మూడ్ నీకు కాదోయ్ వెర్రి మొహమా, నాకు రావాలి, ఫర్ గెట్ ఇట్, సిగ్గు లేకపోతే సరి" వగైరా ఆశీర్వచనాలు, అష్టోత్తర నామాలు వినపడుతూండగానే టీవీ వాల్యూం పెంచేశాను.

"సరేలే, ఇవిగో, రేపు హ్యూస్టన్‌లో శంకర్ దాదా సినిమా రిలీజు...ఇండియాలో కంటే ఒక రోజు ముందు, ఏమిటనుకున్నావో, నాకు టిక్కెట్టు కొను. నువ్వూ వస్తానంటే నీకు కూడా కొనుక్కో." ఆర్డరు వేసింది మా వంటిల్లు. ఇహ తప్పదురా అనుకుంటూ సినిమా వాళ్ళ వెబ్ సైట్ కి వెళ్ళి టిక్కెట్టు ఖరీదు చూసేటప్పటికి నా గుండె ఆగిపోయింది. ఒక్కొక్కటీ 18 డాలర్లు. అనగా మాకు రెండు నెలల బియ్యం ఖర్చు. "మామూలుగా అందరిలాగా నడవలేని కుంటివాడిని, చూచుటకు ఇంత డబ్బా?" అని నేను చేస్తున్న కుయ్యో, మొర్రో వగైరా శబ్దాలు విని "అందుకే, నిన్ను రావద్దంటున్నాను, వస్తే నాకున్న మూడంతా చెడగొడతావు" మళ్ళీ అరిచింది వంటిల్లు.. అది విని, ఆవిడ "మూడ్" ఏ రకమైనదో తెలియక, ఇప్పుడు "అర్జంటు" గా నేను పౌడరు రాసుకుని, మాంఛి సెంటు రాసుకోవలయునా, లేదా నోరు మూసుకుని మామూలుగానే గరాజ్‌లో పడుకోవలెనా తెలియక నా మూడ్ కాస్తా పాడయిపోయింది.

ఈ మహా సభల హడావుడిలో శ్రీ నాయుడు గారు ఎన్టీఆర్ ట్రస్టుకి కూడా మిలియన్ డాలర్లు పోగేసుకుని, పనిలో పనిగా ఎన్నారై టీడీపీ అనే కొత్త సంస్థ అమెరికాలో అఫీషియల్‌గా అనేక నగరాలలో వ్యవస్థాపించారు. ఇది నాకెలా తెలిసిందీ అంటే, నేను - ఆయన మీటింగుకి వెళ్ళగానే ఒకనొక మిత్రుడు "అర్జంటు" గా నాకు ఎన్నారై టీడీపీ అని రాసి ఉన్న ఒక పసుపు రంగు టోపీ పెట్టేసి , మరియు అదే రంగు కండూవా మెడలో వేసి నన్ను అఖండంగా గౌరవించాడు. చెప్పొద్దూ, నేను రోజూ తెలుగు టీవీ వార్తలలో చూస్తున్న వాళ్ళ దొంగ మొహంలా నా మొహం కూడా ఊహించుకుని హడిలి చచ్చిపోయాను. ఇప్పటికే అమెరికాలో ఉన్న తెలుగు వారి కాంగ్రెస్‌పార్టీ ఇకనుంచీ నిద్ర లేచి మరి కొంత వేగం పుంజుకుంటుంది. ఎందుకంటే మొన్న అసెంబ్లీలో వైయస్సార్ గారు నాయుడి గారి మీదో, ఆయన తల్లి మీదనో తన అభిప్రాయం వెలిబుచ్చగానే, ఒక తెలుగు పత్రికలో "బేఏరియా టీడీపీ వారి ఖండన" అనే వార్త చూశాను. అనగా అమెరికా తెలుగు నాయకులు డైరెక్ట్‌గానే ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాలలో తలదూరుస్తున్నారనమాట. ముందు, ముందు అమెరికా తెలుగు వారి సాంఘిక జీవితం అంతా ఇంకా "భశుం" అవుతుందేమో? ఏమో?

ఎన్ని విధాలుగా చూసినా ఈ మధ్య అమెరికా "తెలుగు దేశం"అంతా క్లింటన్ భజన, శంకర్ దాదా జిందాబాద్ వెరసి క్లింటన్ . దాదా జిందాబాదుగా వెల్లి విరిసింది. ****

# ఆంధ్ర విలేఖరులూ - అమెరికా ఎన్నారైలూ

**మన జీవితంలో మర్చిపోలేని సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతూ ఉంటాయి.** అలాటి అపురూపమైన, అద్వితీయమైన సంఘటన నా మొట్టమొదటి పత్రికా విలేఖరుల సమావేశం. అసలు సంగతేమిటంటే, మా అమ్మాయిలకి జ్ఞానం వచ్చాక (అనగా అంత వరకూ దద్దమ్మలు అని కాదు నా తాత్పర్యం... సుప్రసిద్ధ నర్తకి రత్న పాప ధర్మమా అని కూచిపూడి నృత్యం చేయడం బాగా వచ్చిన వయసులో అని మీకు చెప్పడం నా ఉద్దేశ్యం) మేము సకుటుంబ సమేతంగా, క్రెడిట్ కార్డుల సహాయంతో ఇండియా వెళ్ళాం. తమ సంతానం కూచిపూడి నృత్యాన్ని చూసి, అందరికీ చూపిస్తూ కాలరు ఎగరేసుకునే ఛాన్సు మరొక సారి వచ్చింది కదా అనుకునే అందరి ఎన్నారై తల్లిదండ్రుల తరహాలోనే, "భాష రాకపోయినా ఎంత బాగా డాన్సు చేశారో ఈ అమెరికా అమ్మాయిలు" అనిపించుకోవాలనే తపనతో హైదరాబాదు, కాకినాడ మరియు ఇతర నగరాలలోనూ వాళ్ళ నృత్య ప్రదర్శన పెడితే బావుంటుంది అని ఐడియా వచ్చింది మన దేశం గాలి పీల్చగానే.

ఆ ఆలోచన మా గురూజీ కి చెప్పగానే "హాలుకీ, మ్యూజిక్ వాళ్ళకీ, బేనర్లకీ, చిల్లర ఖర్చులకీ మహా అయితే పాతిక వేలు అవుతుంది.. నీ లాటి అమెరికా ఎన్నారైలకి నో ప్రోబ్లెం, మీ బంధువులూ, స్నేహితులూ కలిసి ఎంత మంది ఉన్నారూ, అందులో ఎంత మంది నువ్వు పిలిస్తే ఈ ప్రోగ్రాముకి వస్తారూ?" అని అడిగాడు గురూజీ. నా మొహం చూసి కూడా పాతిక వేలు "నో ప్రోబ్లెం" అని ఎలా అనగలిగాడో తెలియదు కానీ "మహా అయితే వంద మంది ఉంటారేమో" అని గురూజీ ప్రశ్నకి సమాధానం చెప్పాను.

"అబ్బే, చాలదు, హాలు ఖాళీగా ఉంటే మీ అమ్మాయిలు నిరుత్సాహ పడి, "ఆకలేస్తే అన్నం పెడతా, మూడొస్తే మొహం తగలేస్తా" లాంటి డాన్సు చేసే అవకాశం ఉంది. లాభం లేదు" అన్నాడు గురూజీ, సాలోచనగా.

"అవును సార్, ఇలాంటి ఎన్నారై పిల్లల గెంతులు ఇక్కడ రోజూ జరుగుతూనే ఉన్నాయి. మీ బంధు వర్గం అందరూ వచ్చినా హాలు ఖాళీగా ఉంటుంది. అది చాలా ఇన్సల్టింగ్ కాబట్టి ఒక విలేఖరుల సమావేశం పెడదాం. వాళ్ళు అన్ని పేపర్లలోనూ మీ గొప్పతనం గురించి, మీ పిల్లలు చేసే మహత్తరమైన నృత్యం గురించి పొగిడి అవతల పారేస్తారు కాబట్టి ఈ తమాషా చూద్దామని కొంత మంది అమాయకులు, ఆ సాయంత్రం ఇంకేమీ పని లేని వాళ్ళూ వస్తారు. అది హైదరాబాదు ఆనవాయితీ లెండి" అని సలహా ఇచ్చారు మా గురూజీ గారి శిష్యాజీ.

"కరెక్ట్, ప్రెస్ మీట్ కి ఎంతో అవదు, ఏదీ పది వేలు తియ్యి, చాలు" అని తొందర పెట్టాడు గురూజీ, కళ్ళు మిల మిల లాడిస్తూ.

"ప్రెస్ మీట్ కి డబ్బెందుకూ?" అన్నాను అమాయకత్వం నటిస్తూ, ఎందుకైనా మంచిదని కళ్ళు మిల మిల లాడించకుండా.

"తెలుగు రిపోర్టర్లకి పకోడీలు, ఇంగ్లీషు పేపరు రిపోర్టర్లు అలాటి దేశవాళీ సరుకు పబ్లిగ్గా తినరు కాబట్టి వాళ్ళకి కుకుంబర్ సాండ్‌విచ్‌లూ, అనగా దోసకాయ ముక్కలు మధ్యలో పెట్టి సింగారించిన దేశవాళీ బ్రెడ్డూ, అందరికీ చికెన్ టిక్కా, నాలుగైదు రంగు రంగుల డ్రింకులూ, పెన్నులూ, కాగితాలూ ఇవన్నీ కావాలిగా" అని విశదీకరించాడు శిష్య పరమాణువు.

సడెన్‌గా తలజుట్టు మీద వెనకాల భాగంలో ఎవరో టెంకి జల్ల కొట్టిన ఫీలింగు రాగానే, తడుముకుంటూ వెనక్కి తిరిగి చూశాను. అప్పుడే తెలిసింది కొంప మునిగిపోయింది సుమా అని. మా క్వీన్ విక్టోరియా నా పక్కనే ఉన్న మాట మర్చిపోయి పై ఢబ్బు డైలాగులు - ఆవిడకి వినపడేలాగా మాట్లాడుకున్నాం నేనూ, గురూజీ మరియు శిష్యాజీలు.

"వెధవ పేపర్లో వార్త వెయ్యడానికి ఇంకో పది వేలా, చాల్లే, ఇప్పటికే హాలూ, మ్యూజిక్ గాళ్ళూ, మైకు గాళ్ళూ అందరూ కలిసి పాతిక వేలకి బిల్లు ఇచ్చేలా ఉన్నారు. మొత్తం అంతా కేన్సిల్ చేసి పారెయ్. ఇంతోటి హైదరాబాదులో వాళ్ళు డాన్సు చెయ్యకపోతే మన్మోహన్ సింగూ, వైయెస్సారూ ఏమీ అనుకోరు, దేశానికి ఏ మాత్రం నష్టం లేదు" వగైరా డైలాగులు ధారావాహికంగా వస్తుండగా, నేను చేసిన పొరపాటు తెలిసిపోయింది.

మీకు కూడా నా ఉచిత సలహా ఏమిటంటే, పై వాళ్ళతో, ముఖ్యంగా పవిత్ర భారత దేశంలో ఎవరితోనైనా అత్యవసర ఆర్థిక సమాలోచనలు జరుపుతున్నప్పుడు మీ భార్యలకి... అంటే మీకు ఒక్కకరికీ పదేసి భార్యలు ఉన్నారని అని కాదు నా తాత్పర్యం.... అఫీషియల్‌గా నమోదు అయిన ఒకే ఒక్క అర్థాంగి మాత్రమే అని నా ఉద్దేశం... ఆ అర్థాంగికి చేతి వాటు దూరంలో, అంటే సునాయాసంగా అందుకోగల అందుబాటులో ఉన్నయెడల మీ బాడీ లో కొన్ని భాగములు కించిత్తు డేమేజీ అయే అవకాశం చాలా ఉంటుంది, మరియు ఎన్నారై భర్తగా మీ బండారం బయట పడి పోవును. ఎందుకంటే నేను ఎంత సహజంగా, ఏదో బుర్ర గోక్కుంటునట్టు నటించినా సదరు గురూజీ గారు చాలా సూక్ష్మగ్రాహి కావున మా దాంపత్య రహస్యం కనిపెట్టేసి, మా కుటుంబంలో డబ్బు స్విచ్చి ఎక్కడ ఉన్నదో కనిపెట్టేసి, నన్ను వదిలేసి, మా క్వీన్ దగ్గరకిపోయి మంతనాలు..అనగా నెగోషియేషన్స్ మొదలుపెట్టాడు. మొత్తానికి ప్రెస్ మీట్ రేటు నాలుగు వేల తొమ్మిది వందల ఇరవై రెండు రూపాయలు ప్లస్ రిక్షా ఖర్చులకీ ఒప్పుకుని అంతకు మించి నయాపైసా కూడా ఇవ్వను అని కూడా హెచ్చరించింది, ఎందుకో తెలియదు కానీ నా వేపు తన అందమైన చూపుడు వేలు ఆడిస్తూ.

ఆ రాత్రంతా కూచుని నేను మా కుటుంబమూ, మాకు లేని కుక్క పిల్లా, లెక్సస్ కార్లూ మొదలైన అమెరికా స్టేటస్ సింబల్సూ ఉన్నట్టుగానూ, నిజంగానే ఉన్న పిల్లల చదువులూ, వాళ్ళ డాన్సు కార్యక్రమం వివరాలూ అన్నీ రంగరించి మా లెవెల్ చూపించుకోడం కోసం ఒక నాలుగు పేజీల "పత్రికా ప్రకటన" తయారు చేశాను.

"అదేమిటీ, విలేఖరులు వచ్చి, ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాసుకుని, తర్వాత మాంఛి భాషతో, ఫొటోల తోటీ పేపర్లో ఆర్టికిల్ వెయ్యరా" అడిగింది మా ఆర్థిక మంత్రి. ఎప్పుడైతే డబ్బు వ్యవహారానికి ఆవిడతో సమాలోచనలు జరిపాడో, అప్పటినుంచి గురూజీ నన్ను కేవలం పనులు చేసిపెట్టే గుమాస్తాలాగ చూడడం మొదలుపెట్టాడని మీరు ఊహించే ఉంటారు.

"అవుననుకోండి, కానీ వాళ్ళకి అంత టైము ఉండదు. పైగా మనకేం కావాలో మనం విలేఖరులకి రాసి ఇవ్వకపోతే వాళ్ళకి తోచినది వాళ్ళే రాసేసి కొంపముంచేస్తారు. మన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులే కాకుండా, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ, మొదలైన వారంతా ఈ రకంగానే వాళ్ళకి కావలిసిన విషయాలు ముందే ఫొటోలతో సహా పంచి పెట్టేసి జాగ్రత్త పడతారు. అన్నట్టు, సార్, ఫొటోలంటే జ్ఞాపకం వచ్చింది. అర్జంటుగా మేడం గారిదీ మీ అమ్మాయిలవీ, పాతిక ఫొటోలు కావాలి, ఈ సందులోనే మంచి స్టూడియో ఉంది. పదండి వెడదాం" అన్నాడు గురూజీ.

"ఏమిటి, నా ఫొటో కూడా పేపర్లో వేస్తారా? అంటూ లేచింది మా ఆవిడ స్టూడియోకి వెళ్ళడానికి. నేను చీర మార్చుకొస్తాను. వన్ మినిట్" అంటూ లోపలికి పరిగెత్తింది మా అర్థాంగి. మహిళలపై పత్రికల మహిమ చెప్ప తరమా!

మర్నాడు ఈ ఫొటోలూ, పత్రికా ప్రకటన కాపీలూ, క్వీన్ విక్టోరియా, మా తాలూకు పిల్లలూ అందరం కలిసి ఈ విలేఖరుల సమావేశం జరిగే చోటుకు వెళ్ళాం. అంత వరకూ పత్రికా విలేఖరుల సమావేశం అంటే నేను టీవీలో రాజీవ్ గాంధీ, లేదా క్లింటన్ గారి అంతర్జాతీయ లెవెల్లో ఉంటుంది అనుకుని తదణుగుణంగా సెంటు కొట్టుకుని బట్టలు వేసుకున్న నా ఊహా శక్తి చాల దెబ్బ తినేసింది.

అక్కడ వెలిసిపోయిన రంగూ, మచ్చలతో డైనింగ్ టేబుల్ లాంటి ఒక పెద్ద పొడుగాటి బల్లా, పగలు కూడా నల్లులు యధేచ్ఛగా విహరించే పాతిక ప్లేము కుర్చీలూ, ఒక వేపు మటుకు పరవాలేదు సుమా అనిపించే నాలుగు కుర్చీలు, ఒక మైకు ఎరేంజ్ చేసి ఉన్నాయి. ఆ పరవాలేని కుర్చీలలో మా కుటుంబాన్ని కూచోబెట్టారు. వరసగా విలేఖరులు రావడం, వాళ్ళకి గుమ్మంలోనే మా శిష్యాజీ కాగితాలూ,

బహుశా కాగితాల మధ్య కరెన్సీ నోటులూ , ఫొటోలూ పంచిపెట్టడం, విలేఖరులు నోట్లు జాగ్రత్తగా లెఖ్ఖ పెట్టుకుని, మిగిలినవి నిర్లక్ష్యంగా జేబులో కుక్కేసుకుని, డ్రింకులూ, పకోడీలూ వేపు వెళ్ళి పోయి వాళ్ళలో వాళ్ళు కబుర్లు చెప్పుకుంటూ జోకులేసుకుంటూ కుర్చీలలో చతికిల పడడం మొదలైన కార్యక్రమం అరగంట సేపు జరిగింది.

ఎలా గమనించిందో తెలియదు కానీ మా క్వీన్ విక్టోరియా అర్జంటుగా శిష్యాజీని పిలిచి "అదేమిటీ, ఫొటోలూ, కాగితాలతో బాటు, కరెన్సీ నోటులు అందరికీ ఏల ఇచ్చుచుంటివి?, ఎంత ఇచ్చుచుంటివి? మా బిల్లు పెంచుచుంటివా?" అని అడిగింది.

"ఓ అదా, వాళ్ళ ఖర్చుల కోసం తల్లీ, అటువంటి చిన్న ఏర్పాటు లేనియడల ఇలాటి విలేఖరుల సమావేశానికి ఏ పాత్రికేయులు వచ్చుదురూ? కేవలం చికెన్ టిక్కా కోసం వచ్చిననూ, మన మీద చెత్త రాయుదురు కదా వారి పత్రికలలో. అది మీకు ఇష్టమా?" అని ఎదురు ప్రశ్న వేశాడు శిష్యాజీ.

అప్పుడు నాకు స్పష్టంగా అర్ధమయింది మా జార్జి బుష్ గారిని అమెరికాలో అందరు విలేఖరులూ ఎందుకు తిడతారో. అమెరికా తిరిగి వెళ్ళగానే ఆయనకి ఇలాగ ఖర్చుల నిమిత్తం ఏబీసీ, సీబీయస్ టీవీలూ, న్యూయ్యార్క్ టైమ్సు, వాల్ స్ట్రీట్ జర్నల్ మొదలైన వారి విలేఖరులందరికీ ధన సహాయం చేస్తే మీ జాతకం మారుతుంది, ఇరాక్ యుద్ధంలో జయం పొందుతారు అని సలహా చెప్తాను. ఎంతయినా బ్రిలియంట్ ఫెలో ని కదా. ఇంత సింపుల్ విషయాన్ని ఎంత బాగా కనిపెట్టానో! బుష్ గారు మాత్రం ఎందుకు కనిపెట్టలేదో?

అసలు సంగతేమిటంటే అంత సేపూ, ఆ స్పెషల్ కుర్చీలలో అరగంటకి పైగా కూర్చుని ఉన్నా, ఫొటోలకీ ఇతర ఖర్చులకీ కలిపి తడిపి మోపెడు తగలేసిన మా ఎన్నారై కుటుంబాల మొహాల కేసి ఎవరూ చూడే లేదు. అంతకీ వాళ్ళలో ఎవడో ఒకడైనా నా కేసో, అందమైన మా ఆడంగులకేసో చూస్తారేమో అనే ఆశతో నేను తీవ్రంగా, దగ్గడం, నాలుగు సార్లు హడావుడిగా లేచి, కూచోవడం లాంటి ఎంత ఓవర్ ఏక్షన్ చేసినా లాభం లేక పోయింది. ఎటొచ్చీ మా క్వీన్ మరియు అమ్మాయిల కేసి దొంగ చూపులు చూసే విలేఖరులని నేను వీక్షిస్తూనే ఉన్నానని వాళ్ళకి తెలియదని నా అనుమానం. పర పురుషులు స్వీయ భార్యా వీక్షణ విషయాలలో ప్రతీ ఎన్నారై మొగుడూ ఆరితేరిన వాడే ప్రతీ ఇండియా మొగుడూ అరివీర భయంకరుడే. అందరి కళ్ళూ డేగ కళ్ళే. అనగా తన భార్యని ఎవడైనా అదోలా చూస్తుంటే గమనించని మగాడు అమెరికాలో కానీ, ఆంధ్రాలో కానీ ఉండడూ అని నా నమ్మకం. ఎందు వలన అనగా, సదరు భర్తలకు కూడా ఆ విద్య బాగా వచ్చును కాబట్టి, నాకు తప్పు...నిజమేనండి బాబోయ్ !

ఈ లోపుగా మా అమ్మాయి నా వీపూ, ఎందుకైనా మంచిదని వాళ్ళ అమ్మ, మరియు చెల్లెలు వీపూ సున్నితంగా గోకడం మొదలుపెట్టింది. అసలే నెర్వస్‌గా ఉన్న నేను అనుకోకుండా "ఏమిటే" అని అరిచాను. "లుక్ ఎట్ దట్ గై" అంది మా అమ్మాయి బ్రహ్మానందం బఫూన్ పాత్రధారణ టైపులో రంగులూ, పువ్వులూ ఉన్న చొక్కా, మరియు కేవలం అండర్ వేర్ లాంటి పొట్టి లాగూ వేసుకున్న నాలుగున్నర అడుగుల రిపోర్టర్‌ని చూపిస్తూ. "హూ ఈజ్ దిస్ బఫూన్?" అని అడగబోతుండగా, గురూజీ నన్ను వారించి, రహస్యంగా, "ఆయన ఎన్నారై దుర్భిణీ అనే పేపర్‌కి ఇన్‌వెస్టిగేటివ్ రిపోర్టర్..అనగా గూఢచారి విలేఖరి. ఎందుకైనా మంచిది, జాగ్రత్తగా ఉండండి" అని హెచ్చరించాడు. నేను కూడా నా బేంకు బేలన్సు కేవలం పదహారు డాలర్లే అని ఆ మానవుడికి తెలియడం బొత్తిగా ఇష్టం లేక ఆ తరవాతి రెండు గంటలూ ఆ మానవుడి కేసి చూడ లేదు.

ఈ తతంగం జరుగుతూండగా శిష్యపరమాణువు గురూజీ దగ్గరకి వెళ్ళి తన ఇంపోర్టెడ్ వాచీ చూపించాడు. అంటే, మనం ఈ హాలు కేవలం గంటకి మాత్రమే బుక్ చేసుకున్నాం సార్, మనం కార్యక్రమం అర్జంటుగా మొదలుపెట్టి పూర్తిచెయ్యకపోతే అమెరికాలో లాయరు ఫీజులాగా క్షణ క్షణానికీ రేటు పెరుగును. ఈ ఎన్నారై కుటుంబం పైకి డాబులు, జేబులు నిల్లూ అని చెప్పినట్టూ నాకు తరవాత తెలిసింది.

వెను వెంటనె గురూజీ గారు గంట కొట్టి, అందరినీ సాదరంగా ఆహ్వానించి నన్ను, మరియు మా అర్ధాంగినీ జాతక చక్రాలు మినహా మిగిలిన వివరాలు ఉటంకిస్తూ ఘనంగా పరిచయం చేశారు. అది విని, ఒక విలేఖరి వర్యులు డ్రింకూ, సమోసాలూ పట్టుకుని, ఇంచుమించు లేచి నుంచుని "ఇంతకీ రేపు డాన్సు ఈయన చేస్తున్నాడా?" అని అనుమానంగా అడిగాడు.

"అబ్బే, ఈయన కేవలం రియల్ ఫాదర్, అనగా కన్న తండ్రి మాత్రమే, డాన్సు చేసేది ఈ అమ్మాయిలిద్దరూనూ" అని విశదీకరించాడు గురూజీ.

"ఓహో, మరి మేడం కూడా ఏమన్నా స్టెప్పులు వేస్తారా?" అని అదో రకంగా ఆ విలేఖరి అనగానే అనగానే మేడం గారు లేచినుంచుని ఈ ప్రత్యేక విలేఖరి గారు ఆశిస్తున్న స్టెప్పులు వేసి శాంపుల్‌గా చూపించవలెనో, కేవలం కుర్చీలోనే కూచుని కాళ్ళూ, చేతులూ మరియు మెడా ఆడించిన చాలునో తెలియక, గింజుకుంటూ నా కేసి, గురూజీ కేసి చూడ్డం మొదలుపెట్టారు.

ఘనత వహించిన ఆ విలేఖరి గారు మళ్ళీ కూచుకుని " అది కాదు గురూజీ, ఆ డాన్సు చేసే అమ్మాయిల గురించి చెప్పకుండా, ఏమీ చేతకాని ఈళ్ళ గురించి ఏటీ నీ గోల. ఎవరు స్టెప్పులేస్తే ఆళ్ళ గురించి చెప్పాల, నీకు తెలవకపోతే, ఆ అమ్మాయిల్నే రేపు ఏం చేస్తారో సెప్పమనాల" అని మిగిలిన రిపోర్టర్ల కేసి సగర్వంగా చూశాడు. అవును సుమా అన్నట్టు అందరూ తలలు ఊపారు. ఎన్నారైలని అవమానించే అవకాశం వచ్చినందుకు కొంతమంది తప్పట్లు కూడా కొట్టారు.

అప్పుడే పప్పులో కాలేశాడు శిష్యాజీ. "మన ఎన్నారై కాగడా" లాటి సుప్రసిద్ధమైన పత్రిక స్పెషల్ కరెస్పాండెంట్ గారు చెప్పింది కరెక్టే. అందుచేత ఇప్పుడు అమెరికా పెద్దమ్మాయి రేపటి కార్యక్రమం వివరాలు చెప్తారు." అని, "ఏమ్మా, పాపా, రేపు ప్రోగ్రాం గురించి చెప్పమ్మా" అని మైకు ఏదో చెప్పబోతున్న నా దగ్గర నుంచి లాగేసుకుని మా పెద్దమ్మాయి మొహం ముందు పెట్టాడు.

ఈ భాషా, జరుగుతున్న వివాదమూ తెలియని కారణం చేత నిస్సహాయంగా మా పెద్దమ్మాయి నా కేసి చూడగానే, నేను తనకి అర్థం అయే టెక్సస్ భాషలో వాళ్ళిద్దరూ మర్నాడు ఏమేం డాన్సులు చేస్తారో చెప్పమని నేను వివరించాను. తనకి ధారాళంగా వచ్చిన టెక్సస్ భాషలో మా పెద్దమ్మాయి ఆ మర్నాడు చేయబోయే కూచిపూడి నృత్యాల గురించి వివరించడం మొదలుపెట్టింది. సరిగ్గా మూడే మూడు (మూడొస్తే ముద్దులు పెడతా టైపు మూడు ఏ మాత్రం కాదని నా విన్నపం) నిముషాలలో విచ్చేసిన పదహారు విలేఖరులూ ...మన బఫూన్ గారితో సహా.... మా అమ్మాయి చెప్పిన విషయాలు ఒక్క అక్షరం ముక్క కూడా అర్థం అవక, అర్జంటుగా నోట్స్ రాసుకుందామని నా స్వంత ఖర్చుతో బల్ల మీద పెట్టిన పెన్నులు, వాటి మూతలు మూసేసి జేబులో పెట్టేసుకుని, "ప్రాణంబుల్ తావుల్ తప్పె" అని నా కేసీ "కరుణించు మేరి మాతా" అనే ఫీలింగుతో క్వీన్ విక్టోరియా కేసి, "ఏమిటి సార్, మాకేమీ సమఘౌతలే" అని గురూజీ, మరియు శిష్యాజీ కేసి చూడ్డం మొదలు పెట్టారు.

ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి టైపులో ఎన్నారైల మీద కూడా ఇన్ని పత్రికలు ఆంధ్రాలో ఉన్నట్టు నాకు అంతవరకూ తెలియదు. హోలు మొత్తం ఆంధ్రా అంతా ఎన్నారైల సుఖ సంతోషాల మీదే నడుస్తోందేమోననే అనుమానం వచ్చేస్తోంది ఇవన్నీ చూస్తుంటే.

ఆ మర్నాడు మేము ఎందుకైనా మంచిదని మూడు గంటలు ముందుగానే ఆడిటోరియంకి వెళ్ళగానే, కళ్ళు చెదిరాయి. అప్పటికే హాలు చాలా మటుకు నిండిపోయింది. మేము కష్టపడి తోలుకొచ్చిన మా వంద మంది బంధువులూ కూచోడానికి చోటు లేదు. మేం అందరం హాచ్చెర్యంగా వెర్రి మొహాలు పెడుతూండగా జమాలుద్దీన్ నా చొక్కా పట్టుకు లాగుతూ "ఇదిగో సార్, మా పేపర్లో మీ ప్రోగ్రాం గురించి ఎంత బాగా వేశామో. చూశారా, అప్పుడే ఎంత మంది వచ్చారో " అని పేపరు చూపించాడు. ఉర్దూ చదువుట మనకి తెలియదే, ఈ జమాలుద్దీన్ గారు ఏమి వ్రాసి ఉంటిరి అను నేను కేవలం ఫొటో చూచుచుండగా, నిన్న నన్ను తిట్టి పోసిన ఎన్నారై కాగడా విలేఖరి గారు, ఇవాళ నా భుజం తట్టి పేపరు కాపీ నా చేతిలో పెట్టారు.. అందులో కూడా అదే ఫొటో.

ఈ లోపుగా అంతటా కల కలం..... ఇంకెవరూ? మన బఫూన్ గారు చిద్విలాసంగా ''రంగ ప్రవేశం'' చెయ్యడం, నా చేతిలో ''ఎన్నారై కాగడా'' పెట్టడం క్షణంలో జరిగిపోయాయి. తీరా చూద్దును కదా, పెద్ద సైజులో ఫోర్ కాలం వెడల్పూ మరియు ఎనిమిదంగుళాల పొడుగూ ఉన్న విశేషాలతో ''క్వీన్ విక్టోరియా ఆఫ్ అమేరికా అండ్ అమ్మాయిలూ '' అనే మకుటంతో పేద్ధ సైజు ఫొటో, ''క్వీన్ విక్టోరియా పదవిన్యాసం, అపూర్వ నృత్యవికాసం, అమూల్యమైన అవకాశం, అనుజుడి ఆనందాతిశయం, ప్రవాసం రాజా వారి నీరస నిర్వహణం, రేపే ఈ హైదరాబాదు నగర విశేష కార్యక్రమం'' అనే కవితా అని నాకు కొట్టొచ్చినట్టు కనపడ్డాయి.. ఈ ఫొటోలు ఏవీ నేను ఇచ్చినవి కాదు. మేటరు మరీ బొత్తిగా కాదు.

అది చూడగానే ''ఓయ్, వికట కవీ, మా శ్రీమతి ముద్దు పేరు నీకెలా తెలుసూ, ఈ ఫొటో ఎక్కడిదీ? అన్నా, హోయ్'' అని గింజుకుంటున్న నాతో ''నిన్న చెప్పాను కదా సార్, ఎన్నారైల గురించి ఆయనకి తెలియని విషయాలు లేవు. పైగా కవిత్వం కూడా రాస్తాడు. ఎన్నారైల సభలకి జనాల్ని పోగెయ్యడం ఆయన స్పెషాల్టీ, ఆంధ్రాలో పత్రికల వారందరికీ ఆయనే ఆరాధ్య దైవం. మీ అదృష్టం బావుండి నిన్న విలేఖరుల సమావేశానికి వచ్చారు. యూ ర్ వెరీ లక్కీ, ఆ మహానుభావుడు మీ మీద దయతలిచాడని ముందు తెలిస్తే రవీంద్ర భారతి బుక్ చేద్దును'' అని గురూజీ అంటూండగా జేమ్సు బాండ్ సినిమాలలో ఆఖరి సీన్‌లో లాగా అందరి దగ్గరా షేక్ హేండ్స్ అందుకుంటూ ఈ సువిశాల ప్రపంచంలోకి విరమించాడు బఫూన్ బ్రహ్మానందం.

# అమెరికా పనివాళ్ళూ - పోలీసులూ

**మా చిన్నప్పుడు ''అమెరికాలో పనివాళ్ళు కూడా** కార్లో షోగ్గా వచ్చి, ఇల్లంతా శుభ్రం చేసి మళ్ళీ హాయిగా కారులో వెళ్ళిపోతారుట'' అనుకునే వారు చాలా మంది గృహిణులు. దాని అర్ధం ఏమిటంటే ''ఒరేయ్, మొగుడూ అనే యూస్‌లెస్ ఫెలో గారూ, నువ్వూ ఉన్నావు ఎందుకూ, మనకి కారూ లేదు, కనీసం రిక్షా కూడా లేదు'' అని లోలోపల అనుకునే వారనమాట. ఈ పని మనుషులు అంటే మైడ్స్.... వచ్చిన రోజే మా ఇల్లు బావుంటుందనీ, లేకపోతే చండాలంగా ఉంటుందనీ అపోహ పడకండి. అమెరికాలో కార్లో వచ్చే పని మనుషులని పెట్టుకున్నాం కాబట్టి, మా ఇంటి నిండా నగలూ, నాణ్యాలతో తులతూగుతున్నామని కూడా భ్రమ పడకండి. అలాగే ఉంటే, అమెరికామెడిలు ఎందుకు రాస్తానూ. మిగిలిన వాళ్ళ లాగే నేనూ డబ్బు లెక్క పెట్టుకుంటూ రోజులు గడిపే వాణ్ణే కదా !

ముందు జరిగిన కథ ఏమిటంటే ఇంచుమించు మూడేళ్ళ కితం మా ఇంటి ముందుతున్న గడ్డీ గాదమూ చూసి జాలిపడి ఒకానొక మెక్సికనుండు మా తలుపు తట్టాడు. మీ గడ్డి సైజు మీ ఇండియా స్వాములవారి గెడ్డంలా సంస్కారం లేక పెరిగిపోతోందీ, ఇంక కొన్నాళ్ళు ఇలా సాగితే మీ సబ్ డివిజన్ యజమానులు..అంటే హోం ఓనర్స్ అసోసియేషన్ వారు పోలీసులని పిలిచి, మిమ్మల్ని జైల్లో పెట్టిస్తారూ, అది బావుండదు కదా.... ఎందుకంటే మీ కుటుంబం అంతా ఇంట్లో ఎంజాయ్ చేస్తూ ఉంటే, మీరు జైల్లో ఉంటే అదోలా ఉంటుంది కాబట్టి నేను ప్రతీవారమూ వచ్చి పాతిక డాలర్లకి లాన్ కట్ చేసి పెడతానూ, ఏమంటారూ, జైల్లో ఉంటారా, లేక నన్ను సహాయం చెయ్యమంటారా అని అడిగాడు. నేను మన కమ్యూనిష్టుల లాగా కొడవలి చేత్తో పట్టుకుని సుత్తి కొట్టే అలవాటు లేక, మెక్సికనుడి ప్రపోజల్ కి వెంటనే ఒప్పేసుకున్నాను. ఈ సంభాషణ అంతా మా ఇద్దరికీ కామన్‌గా ''శరీర భాష'' లో జరిగింది. ఎందుకంటే వాడి స్పానిష్ భాష నాకు రాదు, నా అమెరికనైజ్డ్ తూ.గో. జిల్లా తెలుగింగ్లీషు వాడి తాత ముత్తాతలకి కూడా రాదు. అందు

చేత కేవలం బాడీ లాంగ్వేజ్ అనగా శరీర భాషలోనే మాట్లాడుకుని కాంట్రాక్టు మాట్లాడుకున్నాం, రాత, కోతలూ, రాతల్లో కూతలూ లేకుండా.

సరిగ్గా వారం తరవాత, మళ్ళీ మెక్సికనుడు మళ్ళీ తలుపు తట్టాడు. ఈ సారి ముందు వరసలో అతని భారీ భార్య, వెనకాల నక్కుతూ ఆ వీరుడూ నిలబడ్డారు. పరాయి ఆడంగులతో, ముఖ్యంగా ఆవిడ తలూకు మొగుడు వెనకాలే నక్కి ఉన్నప్పుడు మంతనాలాడడం మా జిల్లా సాంప్రదాయం కాదు కాబట్టినీ, ఎందుకైనా మంచిదనినీ నేను కూడానా వెనకాల నుంచుని ఉన్న మా క్వీన్ విక్టోరియాని అర్జంటుగా ముందుకు తోసేసి, ఆ బిజినెస్ మీటింగునుంచి నేను తప్పుకున్నాను. వాళ్ళిద్దరూ కూడా శరీర భాషలోనే సంప్రదించుకుని ప్రతీ రెండువారాలకీ, ఆరుబయట ముగుడు గడ్డి పీకుడు సమయంలో ఆవిడ మా ఇల్లు శుభ్రపరిచే ఒప్పందానికి వచ్చారు. అమెరికాలో ఇలాటి కటింగులూ, క్లీనింగులూ స్పానిష్ వాళ్ళే బాగా చేస్తారు. మిగిలిన వాళ్ళందరూ చేయించుకుంటారు.

రెండు, మూడేళ్ళగా ఈ తతంగం బాగానే జరుగుతూ, నేను ఇక పోలీసుల బారి తప్పించుకుని జైలుకి వెళ్ళఖ్ఖర లేని పరిస్థితులు ఏర్పడ్డాయి కదా అనుకుంటూ ఉండగా, నాలుగు వారాల క్రితం ఆ మెక్సికన్ వీరవనిత, తనకి సహాయం చెయ్యడానికి మరొక "కజిన్ మెక్సికన్" ని కూడా తీసుకొచ్చింది. ఆ సాయంత్రం ఎక్కడికో వెళ్ళడానికని మా ఆవిడ తయారవుతూ యధాలాపంగా తన చిన్న సైజు నగల పెట్టె తీసింది. కొంచెం ఖాళీగా ఉందేమిటా అని అన్ని చోట్లా వెతికి, " ఇదిగో, ఈ మధ్య నువ్వు ఏమన్నా గాజులు పెట్టుకుంటున్నావా?" అని అదిగింది నాకేసి అదోలా చూస్తూ. అమెరికాలో అలాటి చూపుకి అర్థం నాకు తెలుసు కాబట్టీ ఆవిడని నేను తీవ్రంగా ఖండించి, ఆ బీరువా అంతా వెతికి, వెతికి, వేసారి మొత్తానికి రెండు బంగారు గాజుల జతలు కనపడడం లేదు అని నిర్ధారణకి వచ్చాం. ఎవరి మీదా అనుమానం లేక, ఎక్కడో పారేసుకుని ఉంటాం అని నగలు పారేసుకునే పద్ధతులన్నీ లిస్టు రాసుకుని, కంప్యూటర్ లోకి ఎక్కించేశాం భవిష్యత్తులో పనికొస్తుందని.

మళ్ళీ రెండు వారాల తర్వాత మా పని మనుషులిద్దరూ ఇల్లు క్లీన్ చేసి బయటకు వెళ్ళగానే మా క్వీన్ విక్టోరియాకి ఎందుకో కొత్తగా వస్తున్న కజిన్ మెక్సికన్ భామ మీద అనుమానం వేసి, మళ్ళీ నగల పెట్టె తీసిచూడగానే, అంతకు ముందు రోజు రాత్రే తను అందు లోపెట్టిన మిల, మిలా మెరిసే చిన్న నెక్లెస్ మెరవడం మానేసింది. తీరా చూస్తే, అసలు నెక్లేసే మాయమయిపోయింది.

అనుమానం పెనుభూతమై, బయటకు వెళ్ళి వాళ్ళిద్దరినీలోపలకి రమ్మని గాజులు, నగల విషయం ప్రస్తావించాం. వాళ్ళు "దొంగ తనాలు మా ఇంటా, వంటా లేదు. మా వంశమేమిటీ, గోత్రమేమిటీ" అని అని తలకాయలు ఊపుతూ, చేతులు తిప్పుతూ ఆవేశపడ్డారు. ఇలా లాభం లేదని, మా జన్మలో మొట్టమొదటి సారిగా మా ఊరి పోలీసులని మా ఇంటికి ఆహ్వానించాం. మొదటి సారి మా ఇంట్లో అడుగుపెడుతున్నారు కదా, హారతి ఇచ్చి, దిష్టితీసి, కుడికాలు ముందు వెయ్యామని అడుగుదామనుకున్నాను కానీ, గుండె ధైర్యము విలోలం బయ్యె.

ఉన్న మాట చెప్పొద్దూ, అమెరికా పోలీసులు కూడా మన సినిమా హీరో, హీరోల లాగే తెరమీద, ఎక్కడో దూరం నుంచీ మాత్రమే దర్జా గనూ, ధైర్యంగానూ అప్పుడప్పుడు అందంగానూ కూడా ఉంటారు. తీరా మన దగ్గరకి, మనింటికే వచ్చారనుకోండి. మన పనివాళ్ళే బావుంటారు వాళ్ళకంటే.

గత నెలగా మా ఇంట్లో జరిగిని ఈ దొంగతనాల వివరాలూ, మా మెక్సికన్ పనివాళ్ళ మీద మా అనుమానమూ చెప్పగానే, నిగ, నిగ లాడుతూ, రకరకాల బేడ్జీలు తగిలించుకున్న ఒక పోలీసు నన్ను చూసి "మీ ఇంట్లో టీన్ ఏజ్ కుర్రకారు పిల్లలు ఎవరైనా ఉన్నారా?" అని అడిగింది. చెప్పొద్దూ, అంత వరకూ ఆ పోలీసు మనిషిని చూసి మన గుమ్మడీ వాళ్ళలాగ మీసాల్లేని మగ పోలీసు అనే అనుకున్నాను. గొంతుక వినగానే హడిలిపోయి, ఆ శరీరాన్ని పైనించి పని కింద దాకా స్పీడుగా చూసేసి, కించిత్తు అవయవ శోభ గమనించి రెండు అడుగులు వెనక్కి వేసి, "హారినీ, ఈ కేసు మన తలుపులమ్మ విజయ శాంతి టైపు" అని కనిపెట్టేశాను. నా దిగ్భ్రమని

గ్రహించిన విజయ శాంతి విజయ గర్వంతో నన్ను చూసి, మళ్ళీ అదే ప్రశ్న అడిగింది. "ఉన్నారు అయితే ఏమిటీ?" అని సమాధానం చెప్పింది మా ఆవిడ ఇంకో అరగంట దాకా నా నోరు పెగలదు అని నిశ్చయించుకుని.

"అబ్బే ఇలాటి చిల్లర దొంగ తనాలు ఇంట్లో ఉన్న పిల్లలు సిగరెట్లూ, బీరూ కొనుక్కోవడానికి చేస్తారు" అంచేత ముందు ఆ విషయం పరిశీలించాలి" అని విశదీకరించింది విజయ శాంతి. ఈ దెబ్బకి మా క్వీన్ విక్టోరియాకి కూడా అరగంట దాకా నోరు పెగలదు అని నేను ధైర్యం పుంజుకుని మన పవిత్ర భారతీయ సంతానమూ , వారికి లెఖ్ఖలలో ఎక్కువ మార్కులు వచ్చుట మొదలైన విషయాలు ఏకరువు పెట్టి, మా పిల్లల్లు ఇంటువంటి చిన్నా, చితకా దొంగ తనాలు చేయరు, కానీ కాలేజీలకి వెళ్ళినప్పుడు వేల కొద్దీ డాలర్లు మాత్రం శుభ్రంగా అడిగే తీసుకుంటారు అని ఇండో-అమెరికన్ సంతానం గురించి క్లాసు పీకాను.

"ఈ మెక్సికనులు దొంగ తనం చేసినట్టు, మీరు చూడ లేదు కాబట్టి, పోయిన వస్తువులు వాళ్ళ బేగులలో దొరికితే మాత్రమే మేము ఏదైనా చెయ్యగలం అని ఈ సారి రెండో పోలీసు... ఖచ్చితంగా మగాడే, ...ఏలనగా మీసములు కనపడుతున్నాయి..... విజయ శాంతికి అసిస్టెంటు లా ఉన్నాడు, అందరి బేగ్ లూ, దర్జాగా ఉన్న వాళ్ళ కారూ వెతికి పెదవి విరిచాడు.

"మరి వ్రేలి ముద్రలు నగల పెట్టెమీద కనపడితేనో?" అన్నాను నా చిన్నప్పటి డిటెక్టివ్ యుగంధర్ లాగా గంభీరమైన గొంతుకతో..... గొంతుక తడి ఆరిపోతున్నప్పటికీ. ఆ పిల్ల ఒక నవ్వు నవ్వు నవ్వి "వీళ్ళు ఇల్లు శుభ్రం చెయ్యడానికి వచ్చారు కాబట్టి, వాళ్ళ వ్రేలి ముద్రలు ఎఖ్ఖడైనా ఉండవచ్చు లా ప్రకారం.. ఆఖరికి మీ ఒంటి మీద కూడా" అనగానే, ఎందుకైనా మంచిదని నేను నా దవడలూ, మొహమూ అర్జంటుగా తుడిచేసుకున్నాను.

ఇక ఆ అసిస్టెంట్ గాడు మా ఆవిడకేసి చూసి "మీరు ఇంకా వాళ్ళ మీద కేసు పెట్టదల్చుకుంటే, మీ ఇష్టం. ఐదారు నెలలు పోయాక, మీరు ఓడిపోతే, తప్పుడు కేసు పెట్టినందుకు మేమే మీ మీద కేసు పెడతాం, ఇంతకీ మీ పిల్లల గదులెక్కడా?" అడిగాడు.

"సర్లే, ఉద్ధరించావ్, కేసూ లేదు, పాడూ లేదూ, అందరూ బైటకి వెళ్ళండి. కాస్సేపుంటే మమ్మల్ని అందరినీ జైలుకి లాక్కుపోయేలా ఉన్నావు? బుద్ధి తక్కువై పిల్చాను మిమ్మల్ని. ఇదే మా ఇండియాలో మా వెంకట స్వామి, వాళ్ళిద్దరినీ రెండు తగల్నిచ్చి, - దాచిన చోటనుంచి నా నెక్లెస్ సంపాదించేశేవాడు" వెధవ అమెరికా, వెధప పోలీసులూ, వెధవ పనివాళ్ళూ.....మా గంగమ్మా, సూన్నారాయణే నయం" చతికిలపడిపోయింది అంతటి మహారాణీ నూ.

# మటన్ సామ్రాట్ కథ

**గత నాలుగు వారాలుగా నేను** అమెరికాలో అనేక నగరాలు తిరుగుతున్నాను. రాబోయే నాలుగు వారాలుగా కూడా తిరుగుతూనే ఉంటాను. కారణం ఏమిటంటే హైదరాబాదులో ఉన్న వేగేశ్న ఫౌండేషన్ అనే వికలాంగుల సేవా సంస్థకి నేను అమెరికాలో డబ్బులు పోగేసే కార్యక్రమం చేపట్టి మూడేళ్ళయింది. అందులో భాగంగా అమెరికా అంతటా ఇంచుమించు ముప్ఫై అయిదు ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఆ మహనీయుడి 85 వ జన్మసంవత్సరం సందర్భంగా ఆయన పాటలతో సంగీత కార్యక్రమం ఉచితంగా ఏర్పాటు చేసి, నివాళులు అర్పించి, అందరికీ పుణ్యమూ, పురుషార్థమూ కలిసి వచ్చేలా ఆ కార్యక్రమాలని ఫండ్ రైసింగ్ ఈవెంట్స్ గా తీర్చిదిద్దాం. అంటే ప్రోగ్రాం ఉచితమే కానీ, విరాళాలు ధారాళంగా పుచ్చుకోబడును అన్నమాట. ఈ ఆరాధనోత్సవాలలో పాడుతున్న వారు గాయక శిరోమణి జీ.వీ ప్రభాకర్ గారు (హైదరాబాదు) మరియు హ్యూస్టన్ గాయనీ మణి మణి శాస్త్రి గారు. హైదరాబాదులో వేగేశ్న ఫౌండేషన్ ని గత

ఇరవై ఏళ్ళగా అత్యుత్తమ స్థాయిలో నడుపుతున్నది వంశీ రామరాజు గారు. ఆయన అనేక సంవత్సరాలుగా అనేక సన్మాన సభలు నిర్వహిస్తూ సాంస్కృతిక సేవా తత్పరుడిగా కూడా మంచి పేరు సంపాదించారు.

ఈ తతంగంలో నా ముఖ్య పాత్ర ఏమిటంటే ఈ ముగ్గురినీ అమెరికాలో అన్ని చోట్లకీ తీసుకు వెళ్ళే ఏర్పాట్లు చేసి, నేను కూడా వారితో వెడుతూ, చోదక వృత్తి చేస్తున్నాను. అంటే ఘనత వహించిన డ్రైవరు ఉద్యోగమన్న మాట. ఏదో ఒక ఎయిర్ పోర్ట్‌లో దిగడం, కారు అద్దెకి తీసుకోడం, పొలో మని ఎవరింటికో, పాటల కార్యక్రమం జరిగే ఆడిటోరియంకో వెళ్ళడం, మర్నాడు మరొక ఊరికి డ్రైవు చేసుకుంటూ పోడం.... అన్నీ కలిసి అందరం కలిసి అనేక గంటలు సరదాగా ప్రయాణాలు చెయ్యడం....అదీ మా పరిస్థితి.

ఉన్నమాట చెప్పొద్దూ..... ముగ్గురితోటీ అనేక గంటలు విమానంలోనూ, కారులోనూ ప్రయాణం చెయ్యడం నా అదృష్టమే. ఎందుకంటే అందరూ హాస్యప్రియులే....జోకుల మీద జోకులే. ముఖ్యంగా అనేక వేల సన్మానాలు చేసిన అనుభవంతో రామరాజు గారూ, డజన్ల కొద్దీ సన్మానాలు చేయించుకున్న మేము ముగ్గురమూ సన్మానాల టాపిక్ మీద పదే, పదే రక రకాల హాస్య సంఘటనలు సంగతులు జ్ఞాపకం చేసుకుని నవ్వలేక చస్తున్నాం గత నాలుగు వారాలుగా.

ఎవరికి, ఎందుకు, ఎలాగ, ఎంత ఖర్చుతో, ఏ ముఖ్య అతిధితో, ఏ పద్ధతిలో సన్మానం చెయ్యాలో, స్వర్ణ కంకణం వెయ్యాలో, లేకపోతే ఉత్తి శాలువ తో సరిపెట్టెయ్య వచ్చో నిర్ణయించుకోవడం అంత కష్టం కాదు కాదు కానీ వచ్చిన గొడవల్లా సన్మానం చేయించుకునేవాడికి బిరుదు కావాలంటేనే పెద్ద ప్రోబ్లం అన్నారు వంశీ రామరాజు గారు మాటల సందర్భంలో. నా మటుకు నాకు అది పెద్ద సమస్యగా అనిపించ లేదు. ఆ మాటే ఆయనతో అన్నాను. సరే, అలా అయితే మీకో పరీక్ష పెడతాను ఇది వినండి..అని ఆయన ఒక కథ చెప్పారు.

అల్లాఉద్దీన్ కులవృత్తి మటన్ కటింగ్. అతను చిన్నప్పటినించీ ఎంతో కష్టపడి, కులవృత్తిలోనే రాణించి, పిల్లలందరికీ మంచి చదువులు చెప్పించాడు. అతని కొడుకులు ఇద్దరు అమెరికాలో ఉన్నారు. డబ్బుకి ఏలోటూ లేకపోయినా, అతను మటుకు రోజూ కాస్తో, కూస్తో మటన్ కటింగ్ చెయ్యనిదే అతనికి తోచదు. "ఎందుకయ్యా అల్లా ఉద్దీన్, ఇంత పెద్ద ఇల్లు కట్టుకున్నావు, డబ్బుకి లోటు లేదు. ఇంకా ఈ మటన్ కటింగ్ అవస్థ" అని ఎవరయినా అడిగితే "అదేమిటి బాబూ అలా అంటారూ, డబ్బుంటే మటుకు రైతులు భూమి దున్నటం లేదా, పురోహితుడుగారు రోజూ మంత్రాలు చదవడం లేదా, అలాగే నేనూనూ" అంటాడు. చూస్తూండగానే అల్లాఉద్దీన్‌కి వందేళ్ళు వచ్చాయి. కొడుకులు ఇండియా వచ్చి తండ్రికి ఏదైనా మంచి సన్మానం చేసి ఋణం తీర్చుకోవాలనుకున్నారు. మరి ఎలాటి బిరుదు ఇస్తారూ? వంశీ రామరాజు గారు అడిగిన ప్రశ్నకి అందరూ తర్జన భర్జన మొదలుపెట్టాం.

"అవును సుమా, పాటలు పాడేవాడికి అపర ఘంటసాల, గాంధర్వ ఘంట, లేదా అపర బాలూ ఇవ్వవచ్చు, డాన్సులు చేస్తే నాట్య రంభ, నాట్య భారతి లాటి బిరుదులు ఉన్నాయి....ఆఖరికి సినిమా వాళ్ళకి కూడా నట సామ్రాట్, నట రత్న లాటి బిరుదులు, ప్రతీ మీటింగులోనూ అడ్డమైన చెత్తా వాగే "ఓరల్ డయేరియా" వీరులకి సభా సామ్రాట్ లాటి బిరుదులూ, పుష్కలంగా ఉన్నాయి కదా....మరి ఈ అల్లాఉద్దీన్‌కి అవేవీ రావు కదా. అతనికి తెలిసిన కళ అంతా మటన్ కటింగే కదా" అని అనుకుంటూ ఉండగా, నా బుర్రలో ఒక ఆలోచన తట్టింది.

"మటన్ సామ్రాట్" అన్నాను పెద్ద గొంతుకతో.

"మటన్ సామ్రాట్టా? అదేం బిరుదు నీ తలకాయ" అని ఒకరూ "నీ మొహం లా ఉంది" అని మరొకరూ "నీకు బుర్ర లేదు" అని మూడో వారూ నా శారీరంలో ఉన్న అవయవాలపై తమ, తమ అభిప్రాయాలని బాహాటంగా వెలిబుచ్చారు.

"తప్పేముందండీ, మాటకొస్తే అల్లాఉద్దీన్ కొడుకు జమాలుద్దీన్‌కి కూడా బిరుదు కావాలంటే యువ మటన్ స్సామ్రాట్ అనో, కుటుంబంలో ఎవరైనా పొరపాటున సినిమాలో వేషం వేస్తే, ఇంకేముందీ, మటన్ నట స్సామ్రాట్ లేదా మటన్ నట రత్న మొదలైన బిరుదులు పుంఖానుపుంఖాలుగా తయారు చెయ్యవచ్చు" అని ఘాటుగా సమర్ధించుకున్నాను నా బ్రిలియంట్ ఐడియాని.

"బిరుదు సరే, మరి సన్మాన సభకి అధ్యక్షుడిగా ఎవరిని పిలవాలి? అడిగారు రామరాజు గారు.

"దానికేముంది సార్, సాహితీ సదస్సుకో, పాట కచేరీకో రారు కానీ హోం మినిస్టరో, ఛీఫ్ మినిస్టరో గేరంటిగా వస్తారు. ఈ కటింగులన్నీ వాళ్ళకి అలవాటే కదా! " అన్నాను.

ఈ లోపుగా మా ఇల్లు వచ్చేసింది. సామానులన్నీ తీసుకుని, తాళం తీసి ఇంట్లోకి అడుగుపెట్టగానే "వచ్చారా చోదక స్సామ్రాట్ గారూ, తమరి మొహం చూసి వారం దాటింది" అని పలకరించింది మా క్వీన్ విక్టోరియా.

"అదేం గ్రీటింగూ,హాయిగా, హనీ, డార్లింగ్, ప్రియా అనకుండా ఈ చోదకమేమిటీ? స్సామ్రాట్టేమిటీ?" అని కించిత్తు తడబడుతూ అన్నాను సరిగ్గా వారం కిందటి మొహాన్నే పెట్టి.

"అదేనోయ్, నువ్వు వెలగబెడుతున్న ఉద్యోగం కారు డ్రయివింగే కదా. అందుకే నీకు చోదక స్సామ్రాట్ అనే బిరుదు ప్రదానం చేస్తున్నాను" అని మా ఆవిడ అనగానే మా మిత్రులు మొహామొహాలు చూసుకుని నా మొహం చూడ్డం మానేశారు జాలిపడి.

# అమెరికా పలకరింపులు

మా నలుగురం ..అంటే ఒక సన్మాన స్సామ్రాట్, ఒక గాయక శిరోమణి, ఒక గాయక రత్న, మరియు ఒక చోదక స్సామ్రాట్ అనగా నేను.... కలిసి గత రెండు నెలలగా అమెరికా అంతటా ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తూ, ఇప్పటికి మేము వెళ్ళిన 27 అమెరికా నగరాలలోనూ నేను గమనించిన విషయం ఏమిటంటే తెలుగు వారి పలకరింపులు పరిపరి విధములుగా ఉండునూ అని మాత్రమే.

ఉదాహరణకి ఒకానొక పేద్ద నగరంలో, నా అభిమాన రచయిత గారు పరిగెట్టుకొచ్చి "నీకు ఇది తెలుసా" అన్నారు.

"భలే వారే, మహాశయా, నాకున్న వెర్రి, మరియు వెచ్చి...సారీ...పిచ్చి మరియు వెర్రివేషాలు మీకు తెలిసినవే కదా, కొత్తగా ఏమి తెలియాలి సార్" అన్నాను.

" అది కాదు, ఏమిటో, నేను గత రెండు, మూడు నెలలుగా ఈ మధ్య మంచం మీద నుంచి క్రింద పడటం లేదు, అయాం వర్రీడ్, నువ్వు నీ చచ్చు రాతల్ని చాలా ఇంప్రూవ్ చెయ్యాలి" అని సలహా ఇచ్చారు.

"అదేమిటి సార్, మంచం మీద నుంచి స్పెషల్ ఎఫెక్ట్సతో నేలమీద పడడం ఎందుకూ, హాయిగా నేలమీదే పడుకోవచ్చుగా" అన్నాను విషయం అర్థం అవక.

"అబ్భ, వెధవ చమత్కారమూ, నువ్వూనూ, నేను అనేది అది కాదు" అని అసలు విషయం విశదీకరించారు నా అభిమాన రచయిత గారు.

ఆయన క్లుప్తంగా విశదీకరించిన విషయం ఏమిటంటే ఇది వరలో నేను వ్రాసిన అమెరికాకాలక్షేపాలూ, అమెరికామెడీలో మొదలైనవి చాలా మటుకు ఎప్పుడు చదివినా నవ్వలేక, మంచం మీదనుంచి క్రిందకి పడిపోయి, దొర్లుతూ ఆనందించేవాడిననియూ, ఇటీవల నేను వ్రాసిన వన్నీ నా "మొహం" లా ఉన్న కారణం చేత కేవలం చిరునవ్వే కాని, పగలబడి నవ్వుతూ మంచం నుంచి క్రిందకి పడిపోయి ఆనందించే సీను బొత్తిగా లేదనీ, అటువంటి ప్రాక్టీసు తప్పిపోతే తను చాలా ఇబ్బంది పడుతాననీ, నువ్వు నీ చచ్చు రాతల్ని చాలా ఇంప్రూవ్ చెయ్యాలి సుమా' అని ఆయన వాపోయారు.

ఆయన నిర్వచించిన "నా మొహం" అనేది ఆయన మొహమో, లేదా కించిత్తు వార్ధక్య ఛాయలు గోచరిస్తున్నప్పటికీ అందచందాలు వెల్లివెరిసే నా ఒరిజినల్ మొహమో తెలియక నేను కించిత్తు గించుకున్న విషయం వాస్తవమే.

నాకు వెంఠనే విషయం ..అనగా ఆయన బాధ అర్ధమయిపోయి, నా సెల్ ఫోన్‌లో ఆయన సతీమణి, తదితరులనీ పిలిచి ఆ మహాశయుడు గారు, నా కథ కానీ, వ్యాసం కానీ మరేదైనా కానీ చదవడం మొదలెట్టెగానే, రహస్యంగా, కనపడకుండా, నాజూగ్గా చాలా సహజంగా ఆయనని మంచం మీదనుంచి క్రిందకి తోసేసి, ఆయన్ని ఆనందపరిచే ఒప్పందం చేసేసుకున్నాను. ఎందుకంటే నేను వ్రాసే చెత్త ఆయనకి, మరియు ఇంకెవరికైనా అరక్షణం నవ్వించగలిగితే నాకు అంతకంటే మహదానందం ఇంకేమీ లేదు. అమెరికాలో కొంత మంది అస్మదీయ మరియు తస్మదీయ ప్రముఖ సాహితీ వేత్తల దృష్టిలో "లో క్వాలిటీ" రచయితల లిస్ట్ లో నా పేరే హై లెవెల్లో ఉంటుంది కానీ నా గోల నాదీ, వారి గోల వారిదీ! అందువలన నా ఏర్పాట్లు నేనే చేసుకోవాలి కదా! నాకు అమెరికాలో గాఢ మిత్రులూ, నిగూఢ శత్రువులూ ఉన్నారు మరి.

మరొక ఘంటసాల ఆరాధనోత్సవాల కార్యక్రమంలో ఒకాయన నన్ను చూడగానే "అయ్యో అలా అయిపోయారేం" అని అఖండంగా ఆశ్చర్యపోయాడు. పాపం ఏమయిందో అని వెనక్కి తిరిగి చూశాను. నా వెనకాలే ఐశ్వర్యా రాయ్ మహా గొప్పగా ముస్తాబు చేసుకుని, సర్వాంగ సుందరంగా ఏ ఏంగిల్ చూసినా భలే సెక్సీగా ఉన్న అమ్మాయిని చూడగానే ఈ ఆప్త మిత్రుడు చెప్పిన "అదేం అలా అయిపోయారేం"అనే ప్రగాఢమైన డైలాగు సదరు ఐశ్వర్యా రాయ్‌ని ఉద్దేశించి కాదనియూ, ఆ చచ్చు అభిప్రాయం నా గురించి మాత్రమే అనియూ నాకు స్పష్టంగా తెలిసిపోయింది.

ఈ పలకరింపుల టాపిక్ మీద చాలానే వ్రాయగలను కానీ రేప్పొద్దున్నే కన్నెక్టికట్, బోస్టన్ మరియు న్యూయార్క్ వెళ్ళాలి కాబట్టి, అర్జంటుగా ఇంటికి వెళ్ళి మా క్వీన్ విక్టోరియాకి చాలా కాలం తరవాత నా మొహం చూపించాలి కాబట్టి.....అర్జంటుగా శలవు తీసుకుంటున్నాను....

## తెలుగింగ్లీష్ సంఘాలూ ఆఫ్ అమెరికా

**పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు**.. సరేలే, పోవోయ్. ఏదో పోజుకి, మొహమాటానికి ఈ సోకాల్డ్ శుభాకాంక్షలు చెప్తున్నావు కానీ, నీ సంగతి మాకు తెలియదా, అస్తమానూ ఎవరో ఒకరిని తిడుతూనే రాస్తావుగా, అలాంటిది, ఇవాళ మామీద అంత అభిమానం పుంజుకొచ్చిందంటే మేము నమ్మం సుమా అని పాఠకులు అనుకుంటే అందులో కొంత వరకూ కరెక్టే. ఎందుకంటే నాకూ అలాటి సమస్యే ఉంది. మన ఉగాది కూడా కలుపుకుని నాకు వచ్చే సవాలక్ష నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆ బాపతే అని నా

అనుమానం. అనగా, నేను ఈ ఏడాదిలో ఏదో సాహితీ సదస్సు గురించో, పుస్తకాలకి విరాళాల కావాలనో, ఏదో ఒక సాంస్కృతిక కార్యక్రమానికి ఆహ్వానమో అని ఏదో వంకతో ఎన్ని ఈమైల్స్ పంపించినా ఉలకని, పలకని ఈ వీరులూ, వీర నారీ మణులూ కనీసం ఇప్పుడైనా నన్ను తలుకున్నారు కదా అని సంతోషించాలో, లేక వీళ్ళని తలుచుకుని ఈ నూతన సంవత్సర విచారంగా మొదలుపెట్టాలో తెలియక అవస్థ పడుతూ ఉంటాను.

నేను గమనించిన మరొక ప్రగాఢమైన విషయం ఏమిటంటే, ప్రతీ యేడూ ఈ టైములో "ఏమైనా సరే, ఈ కొత్త ఏడాదిలో మిలియన్ డాలర్లు సంపాదించి అవతల పారేద్దాం", "ఐశ్వర్యా రాయ్, ఇలియానాలతో మూడోస్తే ముద్దులు పెడతా టైపులో స్టేజిమీద ఫొటో దిగుదాం" మొదలైన ప్రగాఢమైన నిర్ణయాలు తీసేసుకుని, బుర్ర గీర, చేతకాని తనం మొదలైన ప్రగాఢమైన పరిపరి కారణాలగా సంవత్సరం అంతా మొద్దు నిద్ర పోయి, మళ్ళీ కొత్త సంవత్సరం రాగానే, ఆ గ్రామఫోన్ ప్లేటే మళ్ళీ వేసుకుంటున్నాను నాకు జ్ఞానం వచ్చినప్పటినుంచీ.. "నీకు జ్ఞానం ఎప్పుడొచ్చిందోయ్ వెర్రి మోహమా, అ యాం స్టిల్ వైటింగ్, కనీసం పేపర్లయినా సరిగ్గా చూడవు. ఐశ్వర్యా రాయ్ కి పెళ్ళయిపోయింది. స్టేజి మీద మాట దేవుడెరుగు, స్టేజి కింద ఆఖరి వరసలో కూడా ఫోటో, గిటో నై జాంతా" అంటూ మా క్వీన్ విక్టోరియా నిన్ననే విమానం ఎక్కేసింది ఇండియా వెళ్ళడానికి. ఒక నెల పాటు నాకు "హేపీ డేస్" అని నేను ఎయిర్ పోర్ట్‌లో ఆనందపడుతూండగా "పోకిరీ " వేషాలు వెయ్యకు అని మేము ఇద్దరమూ చూడని రెండు తెలుగు సినిమాలనీ తల్చుకున్నాం.

డజను బాత్ రూం టిస్యూ రోల్స్, గంజిపెట్టి ఉతక వలసిన తన ఫేవరైట్ కాటన్ చీరలు యాభై మొదలైన సకల లాంఛనాలతోటీ ఆవిడని విమానం ఎక్కించి నేను ఇంటికొచ్చి వంటా, పెంటా చేసి మా పిల్లల్ని భోజనానిని పిలిస్తే వాళ్ళు కూడా మదర్ విక్టోరియా నాకేసి చూసినట్టే చూసి టాకో బెలో కో, లింగ్, పింగ్ అండ్ చాంగ్ సన్స్, డాటర్స్ అండ్ మునిమనవలూ వారి చైనీస్ జిగట పదార్థాలు భుజించుటకో వెళ్ళిపోయారు.

ఏదో ఒక అమెరికాలక్షేపం చెయ్యాలిగా అనుకుంటూ భయపడుతూనే తెలుగు టీవీ ఆన్ చేశాను.. ఆ కార్యక్రమం పేరు ఫిల్మ్ న్యూస్. మీకు తెలుసుగా, వెధవ సీరియల్స్ టైములో గంగాళాలకొద్దీ కన్నీరు, మిగిలి టైములో టన్నులకొద్దీ సినిమా గోల, అవి కాక కల్చర్ పేరుతో డాన్స్ బేబీ డాన్స్ లాటి వాటిల్లో చీప్ తెలుగు ఇమిటేషన్ ఆఫ్ అమెరికన్ నల్ల వాళ్ళ పాటలూ, నృత్యాలూ. ఇదే ఈ రోజుల్లో మన టెలుగూ కల్చర్.

కిచ, కిచ లాడుతూ ఒకానొక యుక్తవయస్కురాలు మనకి ఆప్యాయంగా చెప్తున్నట్టుగా నటిస్తూ చదువుతున్న ఆ ఫిల్మ్ న్యూస్ లో నాకు ఆశ్చర్యం వేసిన వార్త ఏమిటంటే రెండు, మూడు రోజుల ముందు హైదరాబాదులో ఆటా వేడుకల మీద వార్త. యథాప్రకారం స్టేజి మీద ముఖ్య మంత్రి గారూ, ఇతర మంత్రివర్యులూ అమెరికా తెలుగు వారు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టు బడులు పెట్టి, తమ అమూల్య డాలర్ సంపదని శుభ్రంగా క్షవరం చేసుకుని తరించాలని, అందుకు తాము సింగిల్ విండోపద్ధతిలో, ఏ విధమైన శ్రమా లేకుండా అన్ని విధాలుగా సహకరిస్తామనీ వాగ్దానం చేశారు..

ఫిల్మ్ న్యూస్‌లో కూడా అమెరికా తెలుగు నాయకులు కనపడగానే అమెరికా తెలుగు సంఘం వారు కూడా సినిమా వార్తలలోకి ఎక్కేసి మన తెలుగు సంస్కృతిని, భాషా సాహిత్యాలని పెంపొందింప జేస్తున్నారని నాకు తెలిసిపోయి, నా హృదయం మహదానందకండోళమయింది. అంటే నిజంగా ఏమిటో నాకూ, మీకూ తెలియదు కానీ, నా మనస్సు చాలా గందరగోళం అయినా సంతోషంగా ఉంది అని నా తాత్పర్యం.

వెను వెంటనే సినీ నటుడు మురళి మోహన్ మరొక వార్త బయటపెట్టారు. అదేమనగా, అమెరికాలో "అంటా" అనే మరొక సంస్థ వెలిసిందనీ, వారి ప్రధానోద్దేశ్యం ప్రతీ ఏడూ తెలుగు సినిమాలో ఉత్తమ నటుడు, ఉత్తమ చిత్రం, ఉత్తమ వెకిలి నటుడు మొదలెన పది కేటగిరీలలో బహుమతులు ఇస్తారనీ వివరించి, ఆ బహుమతులు నెగ్గిన వారి వివరాలు చదివారు. అవి విన్నాక నేను కూడా "పెంటా"

అనే సంఘం సంస్థాపించి ఉత్తమ చెత్త చిత్రమూ, అత్యుత్తమ చెత్త నటుడూ, చెత్త ఉత్తమ నటి, చెత్తాతిచెత్త దర్శకుడూ, మహా చెత్త పాటల రచయిత, మొదలైన బహుమతులతో కని, వినీ ఎరగని స్థాయిలో తెలుగు సంస్కృతినీ, భాషనీ, సాహిత్యాన్నీ పెంపొందింప పారెయ్యాలని నిశ్చయించుకున్నాను.

ఇంతలో టెలిఫోన్ మోగగానే నేను హలో అని కూడా అనకుండానే, " ఏమన్నా చెత్తా, చెదారం రాస్తున్నావా నేను ఇంట్లో లేను కదా అని ? పిల్లలకి ఏమన్నా భోజనం పెట్టావా ? " అని నా కుశలం అడిగింది అప్పుడే ఏంస్టర్ డాం చేరిన మా క్వీన్ విక్టోరియా యూరప్ నుంచి..

ఇంతకీ ఈ "అంటా" అనే సంస్థ పూర్తి పేరు ఇంగ్లీషులో "అమెరికా ఎన్నారై తెలుగు అసోసియేషన్", కానీ తెలుగులో మటుకు "అంటా" యూ విశదీకరించబడింది. చెప్పొద్దూ, నాకు భలే తిక మకగాఉంది. ఎందుకంటే యునైటెడ్ స్టేట్స్ అఫ్ అమెరికాని ప్రతీ మాటకీ ముందు ఉన్న మాటని తీసుకుని, యూ.ఎస్.యే అని టూకీ గా పలుకుతాం కదా! అలాగే ఈ కొత్త ఎన్నారై సంఘాన్ని కూడా టూకీగా చెప్పాలంటే ప్రతీ పదానికీ మొదటి మాటలు రాసుకుని, "అ ఎ టె అ" అనాలి కదా, మరి ఈ "అంటా" ఎక్కడినించి వచ్చిందీ?. అందుకే నేను పెట్టబోయే సినీ సత్కార సంఘానికి అందరికీ అర్థమయ్యే పద్ధతిలో "పెంటా" అని పేరు సెలెక్ట్ చేసుకున్నాను. దాన్నే ఇంగ్లీషులో కావాలంటే 'పి అనగా పిచ్చి, ఎ అనగా ఎన్నారై, అని అనేక రకాలుగా మీరు అన్వయించుకోవచ్చును. ఆఫ్టరాల్, అమెరికా ఈజె ఫ్రీ కంట్రీ !

అసలు అమెరికా అంతటా ఈ తెలుగు సంఘాల పేర్లు కనీసం ఐదు రకాలు ఉన్నాయి అని గత మూడు, నాలుగు నెలలలో స్పష్టంగా తెలిసింది. ఎందుకంటే మా నలుగురం ..అంటే ఒక సన్మాన స్మామ్రాట్, ఒక గాయక శిరోమణి, ఒక గాయక రత్న, మరియు ఒక చోదక స్మామ్రాట్ అనగా నేను.... కలిసి గత నాలుగు నెలలగా అమెరికా అంతటా ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించడానికి నేను అమెరికాలోని అనేక నగరాలలో ఉన్న తెలుగింగ్లీష్ సంఘాల నాయకులూ, లేదా మాకు స్వచ్ఛందంగా సహాయం చేసే మిత్రులతో చాలా సార్లు సంప్రదింపులు చేయవలసి వచ్చింది. ఈ తతంగంలో నేను గమనించినది ఏమనగా అమెరికా తెలుగు సంఘాల పేర్లలో మొదటిది ఇంగ్లీషు పేరు. అమెరికాలో ఆదాయం పన్ను...అనగా టేక్స్ కట్టకుండా ఉండాలంటే ఈ ఇంగ్లీష్ పేరే కావాలన మాట... రెండోది తెలుగు పేరు. మూడోది ఇంగ్లీషులో టూకీ పేరు. అంటే ముద్దు పేరు అనమాట. నాలుగోది తెలుగులో పొట్టి పేరు. ఐదోది, అన్నింటికన్నా ముఖ్య మైనదీ తెలుగింగ్లీషు పేరు. కానీ మన జాతి లక్షణం ప్రకారం ఎవరూ, ఏ విధమైన రూల్స్, అంటే యూనీకోడ్, నానీకోడ్, ఎవరూవాడనీకోడ్ లాటివి పాటించరు. ఎవరి గోల వారిదే!

ఉదాహరణకి, ఒక మెగా సంస్థ పేరు ఇంగ్లీషులో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా. కానీ దాన్ని సంక్షిపంగా వ్రాసినప్పుడు, ఆ సంస్థ పత్రిక మకుటంలోనూ కూడా "తానా" అంటారు. కానీ నా లెక్క ప్రకారం ఇంగ్లీషు పేరుని టూకీగా రాయాలంటే మరి "టానా", లేదా "టేనా" అనాలి కదా. పోనీ, మాయాబజార్ లో యస్వీ రంగారావు చెప్పినట్టు "ఎవరూ పుట్టించకపోతే మాటలెలా వస్తాయ్?" అని ఈ తానా అనే కొత్తమాటని తెలుగు భాషకున్న జీర్ణశక్తి ప్రకారం మన భాషలో కలుపుకుందామే అనుకోండి. మరి, రెండో మెగా సంఘం వాళ్ళు ఒప్పుకుంటేనా? మీకు తెలుసుగా, రెండో సంఘం వారి పేరు "అమెరికా తెలుగు సంఘము" అని కదా. మరి వాళ్ళు తెలుగు అసోసియేషన్ అనే మాటకి టూకీగా తానా వారు వాడే "తా" అనే మాటని వాడుకుని తమ సంఘాన్ని "ఆతా" అని అనవచ్చుగా! కానీ వాళ్ళు "ఆటా" అంటారు కదా.

నా ఉచిత సలహా ఏమిటంటే ఒక సంఘాన్ని "తెలనాఅ", అనీ, అదే విధంగా రెండో సంఘాన్ని "అతెసం" అనీ సరయిన టూకీ పేర్లతో పున:నామకరణం చేసి తానా ని, ఆటాని సమాధి చేసి ఆ సమాధుల మీద మీద కొత్త పునాదులు వేస్తే బావుంటుందనీ, తెలుగు భాషకి న్యాయం చేకూరుతుందనీ నా అప్రస్తుత ప్రసంగం.

మరొక సారి పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.. సరేలే, పోవోయ్. ఏదో పోజుకి, మొహమాటానికి ఈ సోకాల్డ్ శుభాకాంక్షలు చెప్తున్నావు కానీ, నీ సంగతి మాకు తెలియదా........****

# సన్మానాలూ-గిన్మానాలూ

**నేను పుట్టిన వేళా విశేషాల గురించి** ప్రపంచంలో నా గురించి చాలా మందికి తెలియని రహస్యం ఒకటి ఉంది....ఒకటేమిటీ....రెండున్నాయి....ఇవాళ మాంఛి వెధవ మూడ్‌లో ఉన్నాను కాబట్టి ఎవరికీ అవసరం లేని ఆ రహస్యాలు బయటపెడుతున్నాను. ఒకటేమిటంటే నాతో బాటు నా కవల పిల్లవాడుగా మరొక శాల్తీ కూడా పుట్టాడుట. కానీ మున్ముందు ప్రపంచం నాలాటి ఇద్దరు "అదో రకం" మనుషులని ఏక కాలంలో భరించ లేదు కాబట్టి, నేను బతికాను.... రెండో శాల్తీ అర్జంటుగా బాల్చీ తన్నేశాడు.. నేను కూడా రెడీయేమో నాకు తెలియదు.

మరొక రహస్యం ఏమిటంటే నేను పుట్టబోయే ముందు రోజే జర్మన్ నియంత హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. నేను పుట్టిన కాకినాడ, గాంధీనగరానికీ, సదరు హిట్లర్ మహాశయుడు విషం మాత్రలు గుటుక్కుమని మింగో, తపీమని పిస్తోలుతో పేల్చుకునో చచ్చిపోయిన జర్మనీ లో ఉన్న బెర్లిన్ నగరానికీ ఉన్న టైం డిఫరెన్స్ అనే మాట కూడా ఆ రోజుల్లో ఎవరికీ తెలియదు కాబట్టి బతికి బయట కట్టిన నేను హిట్లర్ అవతారమా కాదా అనే విషయం మీద తర్జన భర్జనలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి.

ఇందులో నా సిద్ధాంతం ఏమిటంటే మా కవల వెధవలిద్దరిలో ఎవరి బెటరా అని నిర్ణయించుకుని సదరు హిట్లర్ మహాశయుడు ఒక బాడీలో దూరాడు.... కానీ నా జన్మలో ఇప్పటి దాకా నన్ను చాలా మంది "యూస్‌లెస్ బ్రిలియంట్ ఫెలో" అని జాలి పడేవారూ, "పాపం, వెర్రిబాగుల వాడు" అని లోపల అనుకుంటూ నన్ను వాడుకునే వారూ చాలామందే ఉన్నారు కానీ, "ఈ వెధవ హిట్లర్ కన్నా అన్యాయం" అనే ముద్ర ఎవరూ వెయ్యలేదు ఇప్పటి దాకా. అందువలన నేను హిట్లర్ అవతారం ఏ మాత్రమూ కాదనీ, అందువలన నేను బతికుండగానే హిట్లర్ ఎక్కడో అక్కడ అవతారం ఎత్తి నా ఊహ నిజం అని బుజువు చేస్తాడనీ నాకు ఆశగా ఉంది. కానీ సాంస్కృతిక సంఘాలలో కూడా హిట్లర్లు ఉండవచ్చు సుమా అని ఈ సంవత్సరమే నాకు తెలిసింది.

నాకు టెంపరరీగా స్వాతంత్ర్యం వచ్చి నెలయింది...దాన్నే "తాత్కాలిక స్వాతంత్ర్యం" అంటారు. అంటే బ్రిటిష్ వాళ్ళ టైములో కొన్నాళ్ళు మనకిచ్చిన "ప్రొవిజినల్ గవర్నమెంట్" లాటిది అనమాట. మా పట్టపు రాణి, యువరాణులు..., అంటే మా అమ్మాయిలు ఇండియా వెళ్ళారుగా. అందుకని నేనూ మా యువరాజూ అమెరికాలో కాలక్షేపం చేస్తున్నాం...ఒక రకమైన స్వేఛ్ఛావాయువులు పీల్చుకుంటూ, గాలి భోజనం చేస్తూ. నాకూ వంటా, పెంటా చెయ్యడం, చెయ్యికాల్చుకోవడం వచ్చును కానీ మా అబ్బాయికి వయసు వస్తున్న కొద్దీ నేను చేసే వంట పెంటవలే ఉంటోంది అనే వాస్తవిక విషయాలు అవగాహనకి వచ్చి, నేను ఏంచేసినా "లెటజ్ గో ఔట్ అండ్ ఈట్" అంటున్నాడు మొహం అదోలా పెట్టి. పైగా మా ఆవిడ ఊళ్ళో ఉన్న రోజులలో మాత్రమే మమ్మల్ని భోజనానికి పిలిచేవారంతా ఇప్పుడు నేను ఒంటరిగా ఉన్నాననీ, టెంపరరీ గా బ్రహ్మచారిగా ఉన్నాననీ తెలిసి కూడా విందు భోజనం మాట ఎలా ఉన్నా, కనీసం పప్పూ, చారూ లాటి వాటికి కూడా ఎందుకు నన్ను పిలవడంలేదో నాకు అర్థం అవడం లేదు. "దె నో యూ టూ వెల్, అందుకే"

అంటాడు మా సుపుత్రుడు. వాడు "సు" పుత్రుడో, "ఉట్టి" పుత్రుడో ఇంకా తెలియడం లేదు. ఎందుకంటే పబ్లిగ్గా సుపుత్రుడూ, లేదా సుపుత్రికలలా నటిస్తూ, నైస్ కిడ్స్‌లా కనపడుతూ, అమెరికాలో తల్లిదండ్రులని మభ్యపెట్టడం టీనేజ్ పిల్లలకి అలవాటే....పాపం ఈ తల్లిదండ్రులు కూడా, తమ పిల్లలు చేసే కొన్ని, కొన్ని కోతి చేష్టలు తెలిసినా, "మా పిల్లలు సూపర్ కిడ్స్ ఓచ్" అని సంఘాన్ని మభ్యపెట్టడం కూడా అలవాటే. అమెరికాలో మన వాళ్ళకి ఉన్నంత హిపోక్రసీ ఇండియాలో లేదేమో అని నా అనుమానం. అనుమానం ఏమిటీ, నా మొహం.... ఇంచుమించు గారంటీగా చెప్పగలను.

నేను "తాత్కాలిక స్వాతంత్ర్యం" అనుభవిస్తున్న శుభ సమయంలో ఒక రోజు మన పవిత్ర భారతం రిపబ్లిక్ డే జరుపుకొనుట, మా ఊళ్ళో ఇండియా కల్చర్ సెంటర్ అధ్యక్షుల వారు నన్ను పిలిచి " ఈ ఏడు మన 59వ రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా మీకు ఉత్తమ కమ్యూనిటీ సర్వీస్ అవార్డు ఇస్తున్నాం" అని "దారుణమైన" ప్రకటన చేశారు. కనీసం నా అంగీకారం కూడా అడగలేదు. వారి ప్రవచనం నాకు లోలోపల అమదానందకందోళం...ఎట్సెటరా.., ఆర్ వాటెవర్... కలిగించినా...ఈ మాట, కానీ, దాని అసలు అర్థం కానీ నాకు నిజంగా తెలియదు. మన మామూలు భాషలో చెప్పాలంటే అది వినగానే ఎగిరి గంతులెయ్యాలని అనిపించినా, వెంఠనే మా క్వీన్ విక్టోరియా గారు పట్టు శాలువా కప్పుకుని జయలలిత టైపులో ఉన్నప్పటికీ మహిషాసురవర్ధని పాత్రపోషిస్తున్న పోజులో కనపడగానే....నాకు ఆయన ఉవాచ "కర్ణకఠోరం" గా వినపడి, కొంచెం పాదప్రకంపనం కూడా కలిగినది. దానికి ప్రధాన కారణం ఇది వరలో నాకు ఏ విధమైన సన్మానమూ, చట్టు బండలూ లాటివి జరిగినా తాను వికటాట్టహాసంతో వేళాకోళం చేయుటతో మొదలు పెట్టి, ఆఖరికి విసిగి, విసిగి వేసారిపోయి, ఒకానొక నా ప్రగాఢమైన వీక్ మొమెంట్ లో... అనగా అర్ధరాత్రి నేను టెంకి జెల్లలు తినే టైములో అనమాట... "ఇక మళ్ళీ సన్మానాలకి వెళ్ళను, చేయించుకోను, చెయ్యను" లాటి మాటలతో వాగ్దానం చేయించుకున్నారు క్వీన్ విక్టోరియా గారు. నాకు సన్మానం జరిగితే సంతోషించ వలెను కదా, లేదా, తనకి జరగనందుకు చింతించవలయును కానీ ఈ విపరీత ప్రవర్తనకి ఏమైనా సైకలాజికల్ కారణాలు ఉన్నాయేమో అని ఏ ఫ్రాయిడ్ మనవణ్ణో, ఈ మధ్య ఆంధ్రదేశంలో, కంప్యూటర్ కంపెనీలూ, మంగలి షాపులకీ మధ్య వీధి, వీధినా వెల్లివిరుస్తున్న మానసిక వికాస నిపుణులనో అడగాలి. ఎటొచ్చీ వాళ్ళు పొరపాటున నా మానసిక పరిస్థితిమీద తమ అభిప్రాయాలని మా రాణీ గారికి చెప్తే, కాగల కార్యం గంధర్వులే తీర్చారు అని టైపులో ఆవిడ సంతోషపడే అవకాశాలు కూడా ఉన్నాయి కదా అని ప్రయత్నం విరమించుకున్నాను..

నాకు కూడా ఈ సన్మానాల మీద తీవ్ర కాంక్ష లేదు కావునా, అంత కంటే ముఖ్యం....నాకు మొట్టమొదటి సారిగా ఈ సంవత్సరం, మా ఊళ్ళోనే అగౌరవాలూ, అవమానాలూ మొదలయ్యాయి కాబట్టి ఈ జన్మలో నా సన్మానాలూ, సత్కారాల కోటా అయిపోయిందేమో అనుకుంటున్న టైములో ఈ సదరు ఇండియా కల్చర్ సెంటర్ వారి నిర్ణయం నన్ను పెద్ద ఇబ్బందిలో పడేసింది. అనగా ఈ అవార్డు తీసుకోవాలా, వద్దా అనేది పెద్ద సమస్య. ఎందుకంటే, మా ఆవిడ ఎలాగా వైజాగ్ లో హాయిగా ఉంది కాబట్టి, ఈ బహుమతిని నేను తీసుకున్న సంగతి ఆవిడకి తరవాత తెలిసినా మరీ అంత కొంప మునగదేమో అనే ఆశ ఒకటీ, నిరాకరించి ఈ అవకాశాన్ని చేజేతులా పాడుచేసుకుంటే, మళ్ళీ ఈ జన్మలో ఈ ఇండియా కల్చర్ సెంటర్ వాళ్ళు నా మొహం చూడరు కాబట్టి మా ఊళ్ళో నా దుకాణం పూర్తిగా మూసేసి అండమాన్ మరియు నికోబా ద్వీపాలకి పారిపోవాలేమో, అక్కడ ఇంటర్నెట్ ఉంటూందో లేదో అనే అనుమానం వేసింది. ఇటువంటి అంతర్జాతీయ సమస్యా పరిష్కారానికి తీవ్రంగా ఆలోచించి దండ వేయించుకోడానికే నిశ్చయించుకుని, ఎందుకైనా మంచిదని ఇండియా ఫోన్ చేసి విషయం విశదీకరించాను.

అప్పుడు నాకు మరొక రహస్యం తెలిసింది. అదేమనగా, అమెరికా ఇల్లాళ్ళు ఇండియా వెళ్ళగానే తమ, తమ భర్తలతో ఈ దేశంలో ఉన్నప్పుడు ఉన్నంత ఖచ్చితంగా, ధాటీగా ఉండరనియూ, మహా అభిమానంగానూ, కొండొకచో నమ్మశక్యం కానంత ప్రేమగానూ మారిపోదురు సుమా అని తెలిసింది. కారణం ఏమిటంటే, నేను హడిలి చస్తూ, ఈ అవార్డు విషయం చెప్పగానే ఎక్కడ తాను

విరుచుకుపడి, విడాకుల ప్రసక్తి తెచ్చునేమో అని శంకించుచుండగా, "ఓ అలాగా, దట్ ఈజ్ నైస్, ఈ ఎవార్డు పుచ్చుకునే టైములో నీ మొహం నా మొహంలా పెట్టకుండా, నవ్వు మొహం ప్రాక్టీసు చూసుకుని మరీ వెళ్ళు" అని మహామంత్రి తిమ్మరుసు టైపులో మా అర్ధాంగి గారు అనగానే "అమెరికా భార్యలు- ఇండియాలో బిహేవియరూ" అనే మకుటంతో ఒక సుదీర్ఘమైన వ్యాసం రాసి పారేద్దామని నిశ్చయించుకున్నాను.

ఇకముందు ఎప్పుడైనా ఇటువంటి పరిస్థితి వచ్చినప్పుడు, వెధవ డాలర్లు పోతే పోయాయి కానీ మా రాణీ గారిని ఇండియా పంపించిగానీ అసలు సంగతి చెప్పను గాక చెప్పను. అమెరికా మగ పాఠకులకి కూడా ఈ ఉచిత సలహా వర్తిస్తుంది అని వేరే చెప్పక్కర లేదు కదా!. టూకీగా చెప్పాలంటే "అమెరికా ఆడు వారి మాటలకు ఇండియాలో అర్ధాలే వేరులే" అమెరికాలో "నో, నో" అంటే ఇండియా లో "యస్, యస్" అని అర్ధం. అదే విధంగా అమెరికాలో ఉన్నప్పుడు "యస్, యస్" అంటే ఇండియా వెళ్ళగానే "నో, నో" అని కూడా అర్ధం. ఎందుకంటే మా ఆవిడ ఇండియా వెళ్ళేముందు "పోనీ మనం హైదరాబాదులోనో, వైజాగ్ లోనో ఒక ఇల్లో, ఎపార్ట్మెంటో కొనుక్కుందాం" అనగానే "యస్, యస్" అంటూ ఎగిరి గంతేసింది. ఆవిడ అక్కడకివెళ్ళిన రెండు వారాల్లో ఫోన్ చేసి "ఏమన్నా ఇళ్ళూ, ఎపార్ట్మెంట్లూ చూశావా" అనగానే విరుచుకుపడి పోయి "మనకి అమెరికాలో ఉన్న ఆస్థి అంతా అమ్మినా, ఇక్కడ మరుగుదొడ్డి కూడా కొనలేం, షవర్ కూడా కావాలంటే మన పక్కింటి జాన్సన్ గాడి ఇల్లు కూడా అమ్మెయ్యాలి. ఫర్గెట్ బయింగ్ ఎనీ ఆస్థి ఇన్ ఇండియా, నో, నో, నో, నో," అని ఆరు డాలర్ల ఫోన్ కాల్ ఖరీదు అయ్యేలా అరవై సార్లు అరిచి నేను ప్రతిపాదిస్తున్న "అమెరికా ఆడు వారి మాటలకు ఇండియాలో అర్ధాలు మారునులే" అనే నూతన సిద్ధాంతానికి పునాది వేసింది మా క్వీన్ విక్టోరియా.

రిపబ్లిక్ దినోత్సవం నాడు "ఒరేయ్, కొడుకూ, నాకు ఇవాళ నాకు భారతీయులందరూ, అనగా గుజరాతీలు, అరవ్వాళ్ళూ మేక తోలు కప్పుతున్నారూ, నువ్వు వచ్చి వీక్షించి, వీడియో కానీ, ఫొటో కాని తీస్తావా" అని మా యువరాజుని బతిమాలగానే వాడు "ఐ డోన్ట్ కేర్, అండ్ యూ నో దట్ మామీ విల్ కిల్ మీ ఇఫ్ ఐ డు ఇట్ , ఐ హేవ్ ఎ బేస్కెట్ బాల్ గేం, లిండా ఈజ్ కమింగ్ టు వాచ్" అని హడావుడిగా పారిపోయాడు. ఈ లిండా, బ్రెండా మొదలైన వాళ్ళెవరో తరవాత విచారిద్దామని నేను సన్మాన స్థలి...అనగా - ఆడిటోరియంకి వెళ్ళాను. చెప్పొద్దూ, ఈ సన్మానం మటుకు ఆంధ్రాలో జరిగే అర్ధం, పర్ధం లేని సన్మానాలకంటే భిన్నంగానే ఉంది. అలా అని మరీ అంత అమెరికా పద్ధతిలో మరీ సీరియస్ గానూ లేదు.. ఎంతయినా ఇండో-అమెరికన్ వ్యవహారం కదా. అందు చేత ఫిఫ్టీ-ఫిఫ్టీ అనుకోవచ్చు.

ఈ గణతంత్ర దినోత్సవాలు ఐదు వేలమంది జనమూ, అరడజను రెస్టారెంటు వాళ్ళూ, నలభై పైగా వ్యాపార సంస్థల దుకాణాలతో ఆర్భాటంగానే ఉన్నాయి. చుట్టుపక్కల ఉన్న నాలుగైదు నగరాల మేయర్లూ, కొంత మంది స్థానిక రాజకీయ నాయకులూ, అందరూ వెరసి, ఇండియా పద్ధతిలో అరవై మందీ తోసుకుంటూ స్టేజి మీద కూర్చోకుండా, విడి, విడిగానే మన పవిత్ర భారత దేశం ఎంతగొప్పదో, ఇండో-అమెరికన్లు తమ, తమ విరాళాల ద్వారా తాము ఎన్నిక అవడానికి ఎంత సహాయం చేశారో, విధంగా ఆర్ధిక సహాయం చెయ్యక పోతే తాము ఆ రోజు ఇక్కడికి రాకనే పోదుమనీ వాస్తవ విషయాలని చెప్పారు. అంటే, ఇండియాలో లాగానే, డబ్బిచ్చి అమెరికాలో కూడా కొందరిని కొనుక్కోవచ్చును సుమా అని నాకు అర్ధం అయింది.

ఈ తతంగంలో భాగంగా ఈ మధ్యనే సిటీ కౌన్సిల్ కి సభ్యుడుగా ఎన్నికైన ఒక పవిత్ర భారతీయుడు ఇండియా ఇన్వెంటెడ్ జీరో అనే అంశాన్ని తన ప్రసంగాంశంగా ఎన్నుకుని అనర్గళంగా పది హేను నిముషాలు ఉపన్యసించి నన్నూ, ఆహూతులైన మన ఇతర భారత సోదర సోదరీమణులనీ గందరగోళం పెట్టాడు. ఎందుకంటే ఆయన చెప్పదల్చుకున్న అంశం "మన పూర్వీకులు గణిత శాస్త్రంలో అతి ముఖ్యమైన జీరో..అనగా, శూన్యం, అనగా గుండు సున్నాని కనిపెట్టీ, అంతటితో ఆగకుండా దశాంకాలని.....అనగా డెసిమల్ సిస్టంని ప్రతిపాదించి యావత్ ప్రపంచానికీ అఖండమైన సేవ చేశారని చెప్పదల్చుకుని, ఎంత సేపూ, ఇండియా-సున్నా, కేరళా సున్నా, ఈ రోజు

అవార్డులతో సత్కరించబడుతున్న ఫలానా వారు.....అనగా...నేను కూడా మొత్తం అంతా సున్నా అంటూ మాట్లాడి నన్ను చచ్చే కన్ఫ్యూజ్ చేసి పారేశాడు మేత్యూ అనే కేరళీయ సిటీ కౌన్సిల్మన్. ఈ దెబ్బతో మన ఎవార్డు కేన్సిల్, చెక్క పతకమూ లేదు, పట్టు శాలువా లేదు, అనవసరంగా టైం వేస్టు చేసుకున్నానే, లోపలికి వెళ్ళడానికి పది డాలర్లు దండగయిపోయాయే....అదే టైములో మరొక చోట జరుగుతున్న తెలుగు వారి సంక్రాంతి కార్యక్రమానికైనా వెడితే గౌరవంగా చూద్దురు కదా అని నేను బెంగ పడ్డాను కానీ, మేత్యూ గారి ఉవాచ ఆ-హూతులైన అమెరికన్ మేయర్లందరికీ అక్షరం ముక్క కూడా అర్థం అవక మొహాలలో శూన్య భావం...అంటే సున్నా మోహం అనమాట...ఉన్న కారణం చేత, ఆర్గనైజర్లు ఇలాటి ఉపన్యాసాలు ఎప్పుడూ వినకుండా వాళ్ళ పని వాళ్ళు చేసుకుపోతారు కాబట్టీ సన్మాన కార్యక్రమం యథావిధిగానే జరిగింది.

అందులో కూడా చాలా జోకులు జరిగాయి కానీ, నాకు అర్థమవంది ఒకటే. మీకు తెలిసే ఉంటుంది, మన ఇండియాలో ఒక అలవాటు ఉంది. మనం మరీ అంత అమెరికా వాళ్ళలా మొహాల మీద వెకిలి నవ్వు పులుముకుని పబ్లిగ్గా కావలించుకోక పోయినా, అప్పుడప్పుడు, ఒక రకమైన చిన్న "హగ్" ఇచ్చి, లేదా అవతలివాడి భుజం మీద చెయ్యి వేసి తడమడమో, వీపు మీద చెయ్యి వేసి అభిమానంగానో, కృతజ్ఞతగానో కొన్ని క్షణాలు ఆప్యాయంగా నిమురుతాం కదా. దీన్నే దొరలు "పేటింగ్ ది బాక్" అంటారు. అవునా? నాకు అవార్డు ప్రదానం చేసిన వారు సుగర్ లాండ్ సిటీ మేయరు గారు. నిజానికి ఈ తడుముట, లేదా నుమురుట నాకు ఆయనే చేయాలి కదా!. మరి ఆయన ఆ ప్రయత్నంలో ఉన్నట్టు నాకు అనిపించక, పోనీలే నేనే పని చేస్తే పోలే అని అనుకున్నాను. సదరు మేయరు గారు అసలు, సిసలు టెక్సన్ కౌబోయ్ కావున నా తూ.గో జిల్లా బాడీ కంటే కొన్ని వేల అడుగుల ఎత్తుగా ఉన్న కారణం చేత, నేను అవార్డు పుచ్చుకున్న క్షణంలో ఆవేశపడి, నిటారుగా నిలబడి, చేతులు ఆకాశంలోకి పెట్టి ఎంత ప్రయత్నించినా ఆయన తాలూకు ఎడమా, లేదా కుడి భుజాలు అందుబాటు లేని కారణం చేత, గత్యంతరం లేకనూ, పైగా ఆఫ్టరాల్, అతను నా కంటే వయసులో చిన్నవాడు కనుకనూ, నేను నా ఎడం చెత్తో నా కిచ్చిన పతకాన్ని హత్తుకుని, కుడిచేత్తో అతని నడుం మీద నాకు అందిన కింది భాగంలో ప్రేమగా నిమిరినంత మాత్రాన్న, ఆ అమెరికన్ మానవుడు అంతగా గింజుకోవలయునా? హఠాత్తుగా వెనక్కి నాలుగడులు వేయవలయునా? నాకొచ్చిన ఒకే ఒక్క ఫొటో అవకాశాన్ని పాడుచేయవలయునా? పైగా అన్ని విషయాలూ కూలంకషంగా తెలిసిన మన పవిత్ర భారతీయ కాన్సల్ జనరల్ (ఈ మాటని తెలుగులో ఏమంటారో నాకు తెలియదు. నాకు తెలిసీ రాయబారులు ఉంటారు కానీ ఉప రాయబారులు ఉండరు) అక్కడికి నేను తన నడుం మీదనే చేయి వేసినట్టు కిచ కిచలాడ వలయునా?

ఈ పిట్ట కథ మాటా ఎలా ఉన్నా, ఈ అఖండ సన్మానానికి ఆనందిస్తూ అర్జంటుగా అరవై మైళ్ళు డ్రైవ్ చేసుకుని మన తెలుగు వారి సంక్రాంతి కార్యక్రమానికి వెళ్ళగానే, మరొక పది డాలర్లు ముడుపు కట్టించుకుని, నన్ను లోపలికి రానిచ్చారు, లేటయినా. "మా నియంత నాయకుడు గారు "ఈ ముసలాణ్ణి వదిలించుకోవడం ఎలాగరా బాబోయ్" అనే దూషణ, భూషణ తిరస్కారములతో కూడిన చూపులతో నన్ను ఆఖరి వరసలో సగౌరవంగా కూచోబెట్టి, ఘనంగా సన్మానించారు...సారీ గిన్మానించారు.

పైగా, అంతకు రెండు గంటల ముందే హాలు మొత్తం ఇండియన్స్ అంతా కలిసి మా మేయర్ల చేత నాకు సన్మానం చేయించారు కదా!. అ సంగతి తెలుగు నాయకుడిగారికి ముందురోజే నేను తెలియపరచాను కదా! అంచేత మా సంక్రాంతి ప్రోగ్రాము లో తోటి తెలుగు వాడికి జరిగిన ఈ సత్కారం గురించి చెప్తాడేమో అనుకుని, నా స్పీచ్ నెమరు వేసుకుంటూ ఆయన విషయం సగర్వంగా ప్రకటించగానే ఆఖరి వరస నుంచి స్పీడుగా పరిగెట్టుకుని స్టేజి మీదకి వెళ్ళడానికి రెడీగా కూచున్నాను కదా!. ప్రోగ్రాం అయిపోవచ్చింది కానీ మానవుడు ఈ ప్రసక్తి ఇక ఎలాగా తెచ్చేలా లేడు సుమా అనిపించగానే, హఠాత్తుగా అసలు విషయం తట్టింది నా బ్రిలియంట్ బుర్రకి. అదేమనగా, ఒక తెలుగు వాడు మరొక తెలుగు వాడి గురించి మైకులో మంచిగా ఎందుకు చెప్తాడూ? మనకి

అలవాటు లేని సాంప్రదాయం కదా!. పైగా ఆయన అస్మదీయుడు కూడానూ. అస్మదీయుడికి ఎల్లప్పుడూ గాఢ మిత్రుడూ - గూఢ శత్రువూ మరి అస్మదీయుడే కదా !

## బచ్చన్ గారి బచ్చలి తైలం మరియు బుల్లి తెర భాషాదోషాలూ

### జరిగీ జరగని కథ:

**(నేను ఎప్పుడు, ఏమి వ్రాసినా అందులో నిజంగా జరిగిన వ్యవహారం కొంత,** నా స్వయంప్రకటిత పైత్య ప్రకోపం కొంతా ఉంటుంది అని చాలా మంది అంటూ ఉంటారు. అందుకే బావుంటుందని కొందరూ, తలా, తోకా లేకుండా నీ మొహంలా రాసి పారేస్తావు అని చాలా మందీ కూడా అంటూ ఉంటారు. కిందటి నెల అమెరికామెడిలో నిజంగా జరిగిన కథ ఏమిటంటే, నాకు గత క్రిస్మస్ సమయంలో వైర్‌లెస్ టీవీ శ్రవణ యంత్రం నాకు నిజంగానే మా పిల్లలు బహుమతి ఇవ్వడం. ఆ యంత్రాన్ని పరీక్షించే సమయంలో మన తెలుగు భాష కమర్షియల్ ప్రకటనల విషయాలలో గత ఐదారు శతాబ్దాలుగా మారలేదనియూ, కనుచూపు మేరలో ఆ భాషాదోషాలు మారవనియూ నేను విశ్వసించడానికి ప్రగాఢమైన కారణాలు ఈ నాటి టీవీలో ప్రతీ రోజూ కని. విని, మూర్ఛొనవచ్చు అనియూ నా ప్రతిపాదన. నేను ఎప్పుడు, ఏ విధంగానైనా, ఏ విషయంపైన అయినా క్వీన్ విక్టోరియా గురించి కానీ, ఆవిడ తాలూకు డైలాగులు కానీ, టెంకి జల్లలు లాటి చేష్టలు కానీ జరగని కథలు అనియూ, అసత్యములు అనియూ అని మనవి చేసుకుంటున్నాను. ముందు మాటలోనే ఇలా ఎందుకు స్పష్టంగా ప్రవచించ వలసి వచ్చిందో పాఠకులు ఊహించుకుని నవ్వుకోగలరు. ఇక చదవండి.)

ఇక నేను మా పిల్లలు నాకు బహూకరించిన శబ్ద శ్రవణ యంత్రం చెవులకి తగిలించుకుని, ఏస్ట్రోనాట్ సునీతా విలియమ్సు టైపులో ఫీలయిపోతూ , ధైర్యం పుంజుకుని తెలుగు టీవీ పెట్టగానే అమితాబ్ బచ్చన్ మహాశయుడు ఒక తెల్ల తివాసీ మీద శీర్షాసనం వేస్తూ....అంటే అతని పొడుగాటి కాళ్ళు గాలిలోనూ, నెరిసిపోయిన జుట్టుతో మెరిసిపోతున్న తల కార్పెట్ మీద విశ్రమిస్తూనూ కనపడ్డాడు. అయ్యో, పాపం అంతటి మహా నటుడూ దిక్కు తోచక ఇలా తలకిందులుగా ఎందుకు వేలాడుతున్నాడో అని కించిత్తు విచారంగా వాల్యూం పెంచేసి చూస్తుండగా, ఆయన అతి లాఘవంగా లేచి నిటారుగా నుంచుని, చేతిలో ఒక రంగు బాటిల్ పట్టుకుని ఇలా ప్రవచించారు. " ఇదిగో, వాడండి నూతన బచ్చలి తైలం, ఇదే అల్లమూ, ఇంగువా, మరియు కారప్పొడీ రంగరించి తయారి చేసిన జుట్టు పెంచే హెయిర్ ఆయిలు. పెరుగును మీ జుట్టే, నాది ఇక పెరగదు కదా. ఇక చూసుకోండి, పెరుగును మీ జుట్టు, అదుపు లేకుండా, మరియు రింగులు, రింగులు గా కూడా తిరుగును ఉంగరాలుగా... అమెరికా మరియు ఆముదాలవలసలో పేటెంటు పొందిన ఈ అద్భుత నూనె మీ అతి తెల్లని కార్పెట్ ను ఏ మాత్రమూ చేయదు మరక, గమనించండి, మీ జుట్టు పూర్తిగా రాలిపోయి, మీరు ధర ఖర్వాటుడిగా మారిపోయిన యడల వాపస్ మీ డబ్బు, వివరాలకు 58585 - గుండూ - కి ఎస్ యం ఎస్ చెయ్యండి" అంటూ తను అంతకు ఐదు క్షణాల ముందు తలకాయ మదుపు పెట్టిన తివాసీ కేసి చూపించాడు. అది ఇంకా అతి తెల్లగానే యుండుట నా అద్భుతమైన పరిజ్ఞానంతో గమనించాను. మా చిన్నప్పుడు కాకినాడ మ్యునిసిపల్ హైస్కూలులో యజ్జన్న శాస్త్రి గారు చెప్పిన తెలుగు

గ్రామరు ప్రకారం ఈ వాక్యం అంతా శుద్ధ తప్పు. వ్యాకరణం మాట ఎలా ఉన్నా, బచ్చలి ఆకు, అల్లమూ, ఇంగువా, కారప్పొడీ కలిపిన పదార్థాన్ని ఎవరైనా అన్నంలో కలుపుకుని తిన వచ్చునేమో కానీ, జుట్టుకు రాసుకునే రిస్కు తీసుకుంటారా? మీరే చెప్పండి. పోనీలే, అమితాబ్ బచ్చన్ అంతటి వాడు తెలుగు నేర్చుకుని సలహా ఇచ్చాడు కాబట్టి ఈ కేశవర్ధినీ తైలం బాగా రంగు వేసుకున్న జుట్టు గల నా గాఢ మిత్రుడూ-గూఢ శత్రువులలో ఎవరో ఒకరికి వారి షష్టి పూర్తి సమయంలో నాలుగు బాటిల్స్ బహుమతి ఇచ్చేసి, వారి కేశాలంకరణ ఒక నెల పాటు తీవ్రంగా వీక్షించి ఎక్కడైనా బట్టతల ఏర్పడుతున్న సూచనలు, లేదా వాళ్ళింట్లో తెల్ల తివాసీ కి మరకలు కనపడగానే నా డబ్బు వాపస్ కి ఎస్.ఎం.యెస్ చేద్దాం అనే కోతి ఆలోచన కలుగుతూ ఉండగానే, వెంటనే టీవీలో మరొక ప్రకటన వచ్చేసింది.

అందులో ఒక పదేళ్ళ కుర్రాడు , చొక్కా నిండా నల్ల మరకలతో డైనింగ్ టేబుల్ దగ్గర కూచుని "మరక మంచిదే కదే, అమ్మా" అంటూ ఆనంద పడుతూ ఒక బట్టలు ఉతికే పౌడరు పేకెట్టు జేబులోంచి తీస్తాడు. అందులో ఆదివారం, సోమవారం ఇలా ఏడు రోజులకీ ఏడు చిన్న సైజు పేకెట్లు ఉంటాయి. తివాసీ మరక అడ్వర్టయిజ్మెంట్కీ, ఈ బట్టల మరక కమర్షియల్ కీ భాషలో ఏ మాత్రం తేడా లేదు. ఎందుకంటే ఈ కుర్రాడి తల్లి ఐశ్వర్యా రాయ్ ఎంతో ఆనందంగా " అవును, కుర్ర వెధవా, నువ్వు బట్టల నిండా చేసుకున్నా ఎన్ని మరకలు, ఉతుకుతాను రోజూ బబ్బా బ్రాండు వారి అమోఘ సబ్బు పౌడరుతో, అది దొరకును కేవలం పది రూపాయలకే, వారానికి ఏడు రోజులూ హాయిగా ఉతుక్కోవచ్చు అత్యంత ఆనందంగా, అవును మరక మంచిదే, బాల వాక్కు బ్రహ్మ వాక్కే కదా!". వెనకాల అమితాబ్ బచ్చన్ గారి కుమారుడు మరియు ఆవిడ తాలూకు భర్త అజితాబ్ బచ్చన్ పిల్లాడి బట్టలు ఉతుకుతూ "మూడొస్తుందా, ముద్దిస్తుందా, మరో షూటింగుకి పోతుందా?" అని డొటుగా పాట పాడుకుంటూ ఉంటాడు. ఆ బాలీవుడ్ జంటకి ఐదేళ్ళ కొడుకు పెళ్ళి అయిన ఏడాదిలోగానే పుట్టడం బాలీవుడ్ వింతల్లో వింత. ఏమంటారు?

ఇలా ఫేమస్ తారలు చెప్తున్నారు కాబట్టి, కొనకపోతే వాళ్ళేమైనా అనుకుంటారేమో అని ఈ తైలం బాటిల్స్ నాలుగూ, రెండు, మూడు వారాలకి సరిపడే బబ్బా బ్రాండు వారి "మరక మంచిదే" బట్టల పౌడరు, ఈ వారం గ్రోసరీ లిస్టులో రాయమని క్వీన్ విక్టోరియాకి చెప్పాలి సుమా నేను మెంటల్ నోట్ చేసుకుంటూ ఉండగా మూడో ప్రకటన అర్జంటుగా వచ్చేసింది.

ఇందులో ఇద్దరు, ముగ్గురు అందమైన అచ్చ తెలుగు ఇంపోర్టెడ్ తెలుగు సినిమా తారలు, బహుశా త్రిష, జినేలియా, చార్మి లాటి వాళ్ళు అందరూ ఒకే సారి అర్ధనగ్నంగా స్నానం చేస్తూ ఉంటారు. క్షణా క్షణానికీ సీను మారిపోతోంది కాబట్టి వాళ్ళందరూ ఒకే బాత్ రూంలో మూక ఉమ్మడిగా జలకాడుతున్నారో లేదో స్పష్టంగా నాకు తెలియ లేదు. కానీ ఎవరికీ వీపు మీద కానీ, నాజూకుగా ఉన్న కాళ్ళ మీద కానీ, కనీ, కనపడని వక్షోజాల మీద కానీ, నేను ఎంత తీవ్రంగా చూసినా ఎక్కడా, ఏ విధమైన మరకలూ కనపడలేదు ఈ సారి. ఎటొచ్చీ వాళ్ళందరూ కూడా ఒకే రకమైన సబ్బుతో వళ్ళు తుడుచుకుంటూ, ఆనందిస్తూ ఉంటారు. అంతేకాక ఒకరి తరవాత ఒకరు ఏదో సువాసన అనుభవిస్తున్న అభినయం చేస్తూ ఉంటారు. ఇంతలో వెనకాల నుంచి "అనుభవించండి మీరు కూడా శుద్ధమైన చర్మ సౌందర్యమూ మరియూ ఎక్కువ ఖర్చు లేకుండా జీవిత కాలం. ఈ సుందర సబ్బులో రంగరించి ఉన్నవి తెల్లదనం కోసం పాలు, - ఆకర్షణ కోసం సున్ని పిండి, క్రిములని మర్డర్ చెయ్యడానికి పసుపు, అన్నీ అమెరికానుండి దిగుమతి చేయబడినవే మీ సౌందర్యం కోసం జీవితాంతం" అంటూ సాగుతుంది ఈ అడ్వర్టయిజ్మెంట్. నేను అనేక సంవత్సరాలుగా అమెరికాలో ఉంటున్నా, అప్పుడప్పుడు కుంకుడు కాయలు దొరకవచ్చునేమో కానీ, సున్నిపిండి ఎక్కడా కనపడలేదు. పైగా చిన్నప్పుడు మా గంగమ్మ, మంగమ్మ పండగల టైములో బలవంతాన చెరో చెయ్యా ఘాటుగా పట్టుకుని కూచోబెట్టి కుంకుడు కాయలతో తలస్నానం చేయించినప్పుడు కళ్ళు మండిపోయి బాబోయ్ అంటూ ఏడ్చిన నాకు ఈ సుందరాంగులు అంత హాయిగా నవ్వుతూ ఈ సబ్బుతో స్నానం చేస్తుంటే అందులో నిజంగా కుంకుడు కాయలు కలిపారా, లేక మనకి చెవిలో పువ్వు బాపతా అని అనుమానం వచ్చేసింది నాకు. ఇక భాష అంటారా? వద్దు లెండి. ఏమీ అనకండి, ప్లీజ్.

మొత్తానికి నాటి నేటి వరకూ కమర్షియల్ వేషాలు మారినా ఏ మాత్రం మారనిది తెలుగు భాషే సుమా అనే నా అమూల్యమైన.....అంటే వేల్యూలెస్, అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారు కదా!. లేక పోతే నా ఖర్మ, అంతే కదా!

****

## బాబోయ్, అంకుల్ శ్యాం....

**చెప్పొద్దూ, నాకు ఏప్రిల్ నెల వస్తుంది** అని మార్చి నెలలో అనిపించగానే అంటే భలే భయమూ, దడా, కంపరమూ మొదలైనవి టప, టపా వస్తాయి. ఎందుకంటే, ఏప్రిల్ ఒకటో తారీకునుంచీ నెలాఖరు దాకా గత అనేక సంవత్సరాలుగా నేను "ఫూల్" అవుతానని, అయ్యాననీ నాకు స్వానుభవరీత్యా బాగా తెలుసు. ఏప్రిలూ, ఫూలూ లాటి మాటలు ముందే తెలిసుంటే, అసలు ఏప్రిల్ లో పుట్టకపోదును. ఏప్రిల్ లో పెళ్ళి చేసుకోక పోదును. ఏప్రిల్లో హ్యూస్టన్ రాకపోదును.

పైగా, నా జాతక మహిమ ఏమిటో తెలియదు కానీ, ప్రతీ ఏప్రిల్ నెలలోనూ మొదలు పెట్టి మళ్ళీ ఏప్రిల్ దాకా అందరి చేతా అడ్డమైన చివాట్లూ తింటూ ఉంటాను. ఉదాహరణకి, ఈ ఏడు ఏప్రిల్ మొదటి వారంలో నాకు ఒక ఆకాశవాణి ఉత్తరం వచ్చింది. అందులో సారాంశం ఏమిటంటే "మీలాటి బూజు పట్టిన రచయితల చెత్త రచనలని బుట్టలో పారెయ్యకుండా, జాగ్రత్తగా మా కాకినాడ, రాజమండ్రి సంఘాలకి పంపుతున్నాను, తగిన విధంగా "సన్మానించమని" కోరుతూ. మీ తప్పు మీరు తెల్సుకున్నారనుకొంటా." ఈ ఉత్తరం అందగానే బూజులు దులిపే డాక్టర్ దగ్గరకి వెళ్ళి శల్య పరీక్ష చేయించుకుని, నాకు సన్మానం ఏర్పాట్లు చేయిస్తున్నానని ఈ పెద్ద మనిషి హామీ ఇచ్చారు కాబట్టి అర్జంటుగా కాకినాడ, రాజమండ్రిలకి టిక్కెట్టు కావలెను అని మా ట్రావెల్ ఏజెంట్ గారికి విన్నపం పంపించాను. ఎందుకైనా మంచిదని ఆ ప్రాంతాలలో నాకు తెలిసిన కొందరికి కనీసం ఐదారుగురు బాడీ గార్డులని కూడా ఏర్పాటు చేయమని వర్తమానం పంపించాను. ఎందుకంటే ఈ సన్మానం ఏ టైపో తెలియదు కదా! "సన్మానం" అనే మాటకి "దేహశుద్ధి" అనే అర్థం కూడా ఉంది కదా!.

ఇవన్నీ ఎలా ఉన్నా, అసలు విషయం ఏమిటంటే, ఏప్రిల్ నెలరాగానే అమెరికా లో పదిహేనో తారీకు కల్లా ఆదాయం పన్ను ...అనగా ఇన్కం టాక్స్ రిటర్న్ అందరూ అంకుల్ శ్యాం గారికి, సమర్పించాలి. ఈ ఇన్కంటాక్స్ అసలు ఎందుకు కట్టాలో ఎవరికీ తెలియదు. ఎంతకట్టాలో అంతకంటా తెలియదు. ఇదే ఇండియాలో అయితే ఇన్కమూ లేదు, టాక్సూ లేదు. ఒక వేళ ఉన్నా, బల్ల కింద మదుపు పెడితే కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్ర ప్రభుత్వము వారూ, మా కరణం గారూ అందరూ ఆనందించి " పోదురూ, సదువుకున్నోళ్ళు, తమరు పన్ను కట్టడం ఏమిటీ?, పెండాలం కదా సారూ." అని మనల్ని మర్యాద చేసి, వాళ్ళే అన్ని కాగితాలూ..అంటే ఫారాలు పూర్తి చేసి ఏదో ఫార్మాలిటీ కోసం సంతకాలకి మన ఇంటికి వాళ్ళే సైకిలేసుకుని వస్తారు. అదయినా నిజయితీగా ఉండాలని మన సంతకం ఫోర్జరీ చెయ్యకుండా.

అమెరికాలో అందరికీ ఉన్న సమస్య ఏమిటంటే, అంకుల్ శ్యాం గారికి నయాపైసా కూడా ఆదాయం పన్ను కట్టకుండా అమెరికా ప్రభుత్వాన్ని ఎలా దివాళా తీయించాలా అని. ఈ జార్జ్ గారు పోయి మరొక హిలరీ గారో, ఒబామా గారో, జాన్ గారో పదవిలోకి వచ్చినా, అంకుల్ గారు ఎక్కడికీ పోరు కాబట్టి ఈ సమస్య ఎల్లప్పుడూ అందరికీ ఉంటుంది. నా మటుకు నాకు కాస్తో, కూస్తో ఇన్కంటాక్స్ కడదామని కోరిక ఉన్నా, కాణీ కూడా ఆదాయం లేని బీద వాళ్ళ దగ్గర అమెరికా ప్రభుత్వం వారు పన్ను వసూలు చెయ్యరు. ఆ మాటకొస్తే, తిండీ తిప్పలూ లేకుండా మాడి చచ్చుదురేమో, ఆ  పాపము మనకేల అని తిండి ఖర్చులకి సరిపడా డాలర్లు ఇచ్చి స్వర్గానికి నిచ్చెనలు వేసుకుంటారు. అదే మన పవిత్ర భారత దేశంలో పరిస్థితి చూడాలంటే ఏదైనా దేవాలయం మెట్ల దగ్గర చూడండి. డైరెక్టుగా దేవుడే డబ్బులు ఇప్పిస్తాడు భక్తుల దగ్గరనుంచి, ఈ గవర్నమెంటు బెడద లేకుండా.

అమెరికాలో మరొక  సదుపాయం  ఉంది. ఆదాయం ఉన్న వాళ్ళకి పన్ను ఎగ్గొట్టడానికి అమెరికా గవర్నమెంటే అనేక సదుపాయాలు కలిగిస్తుంది. వాటిని అంతకంటే ఖచ్చితంగా అమలుపరచడానికి ఎకౌంటెట్స్ అనే జాతిని కూడా ఏర్పాటు చేశారు. వీళ్ళని సీపీయేలు, బుక్ కీపరూ, టాక్స్ ప్రిపేరరూ, మొదలైన తమాషా పేర్లతో ఆప్యాయంగా పిలుస్తారు.  గంటకి ఐదు వందల డాలర్లు పుచ్చుకునే వారు సీపీయేలు అనమాట. అదే టూకీగా కంప్యూటర్ లో అరగంటలో మీ టాక్స్ రిటర్న్ తయారు చేసేసి వంద డాలర్లు జేబులో వేసుకుని ఆనందపడేవారు ప్రిపేరర్లు అనమాట. మరొక రకం వారు మార్చి, ఏప్రిల్ నెలలలో దుకాణాలు తెరిచి, మీకు వెనక్కి తిరిగివచ్చే రిఫండ్‌లో సగం డబ్బులు మీకు ముందే ఇచ్చేసి, మిగతా డబ్బు వాళ్ళ సొంత ఎకౌంట్లో వేసుకుంటారు. వీళ్ళ ప్రత్యేకతకి గుర్తింపుగా అటువంటి వారిని "ఫ్లై బై నైట్" టాక్స్ కంపెనీ వారు అంటారు.

ఈ ఎకౌంటెట్స్ జాతి వారందరూ, వారి దగ్గరికి వచ్చేవారిని బట్టి పరి పరి విధాలుగా ఉంటారు. ఉదాహరణకి, నేను ఫలానా రోజున వంకాయలు కొనుక్కోడానికి విమానంలో  న్యూయార్కు వెళ్ళాను కదా, ఆ ఖర్చులు ఆదాయం పన్నులో మిగుల్చుకోవచ్చునా అని మీరు అడిగారు అనుకోండి. నిజానికి మీరు మీ మిత్రుడి అమ్మాయికి జరుగుతున్న టెలెగూ-పంజాబీ పెళ్ళికి వెళ్ళారు అన్న సంగతి అంకుల్ గారికి తెలియదు కదా!  సీపీయే గారు అయితే "ఈ వంకాయలు నీ వ్యాపారంలో సగ భాగం అయితే సగం ఖర్చు, అంటే నూయార్క్ వెళ్ళే ఖర్చు డిడక్ట్ చేసుకోవచ్చు కానీ, వెనక్కి తిరిగి రాలేవు. పైగా  నువ్వు కొన్న వంకాయలలో పుచ్చువి ఎంత శాతం ఉంటాయీ అనే విషయాన్ని కూడా కూలంకషంగా పరిశీలించాలి. ఆ పరిశోధనకి మహా అయితే గంట పడుతుంది. అంతే కాదు, మంచి వంకాయలు  కూడా త్వరలో కుళ్ళిపోయే అవకాశం ఉంది కాబట్టి, వాటికి డిప్రీసియేషన్ కూడా తీసుకోవచ్చు. అది డిసైడ్ చెయ్యడానికి మరొక గంట చాలు" అని సమాధానం చెప్తారు.

అదే రెండు నెలల పాటు దుకాణం తెరిచిన "ఫ్లై బై నైట్" టాక్స్ కంపెనీ వారు అయితే ముందు డిడక్ట్ చేసి పారేద్దాం. ఎందుకంటే, కుక్క పిల్ల, దాని సబ్బు బిళ్ళా, కాదేదీ డిడక్షన్ కి అనర్హం అని మహా కవి ఏనాడో చెప్పాడు కాబట్టి మనం ఏడాది పొడుగునా కట్టిన టాక్స్ డబ్బంతా వెనక్కి వచ్చేస్తుంది. జార్జ్ బుష్ గారు ఇరాక్ యుద్ధలో చావు దెబ్బలు తింటూ బిజీగా ఉన్నారు కదా ! మన వంకాయల వ్యాపారమూ, అందు వచ్చు నష్టాలూ ఆయన ఇప్పుడప్పుడే పట్టించుకోడు" అని సలహా ఇస్తాడు. వెనక్కి తిరిగి వచ్చిన టాక్స్ రిఫండ్ సగం వారి బేంక్ లో పడగానే సదరు "ఫ్లై బై నైట్" గారు ఈ సువిశాల ప్రపంచంలోకి మాయమయిపోతారు. ఐదేళ్ళ తరవాత ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ వారు ..అనగా టాక్స్ డిపార్ట్‌మెంట్ వారు ఆ వంకాయలు, కుక్క పిల్లా ఎక్కడ  ఉన్నాయో చూపించమని  మనల్ని తగులుకుంటారు.  అఫ్ కోర్స్, నేను బ్రిలియంట్ ఫెలో ని కదా! అందుచేత మా క్వీన్ విక్టోరియాకి తెలియకుండా ఆ గుత్తి వంకాయ కూర కొంతా, సబ్బు బిళ్ళ కొంతా ఫ్రీజర్ లో దాచాను. మా కుక్క పిల్ల మటుకు గుటుక్కు మంది. మరి ఏం చెయ్యనూ?

పోనీ సొంతంగా ఈ టాక్స్ రిటర్న్ తయారు చేసుకుందాములే అనుకున్నామనుకోండి. అదొక న్యూసెన్సు. ఎందుకంటే, నేను వాడే కంప్యూటర్ ప్రోగ్రాములో చచ్చు ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి తీరాలి. లేక పోతే ముందుకి వెళ్ళలేం. ఉదాహరణకి, " నువ్వు నీ మొదటి భార్య, లేదా భర్తకి మనోవర్తి ఎంత ఇస్తావూ? అనే ప్రశ్న వచ్చిందనుకోండి. మనకి భలే కోపం వస్తుంది కదా!. బహుశా పొరపాటునే అనుకోండి, నాబోటి గాడికి ఒకే ఒక సారి పెళ్ళి అవడమే గగనం కాబట్టి వాళ్ళు నన్ను ఇలా రెచ్చగొట్టడం ఏమన్నా బావుందా? పైగా ఈ తరహా ప్రశ్నలకి నేను ఏం సమాధానం రాస్తానో చూద్దామని మా క్వీన్ గారు నా పక్కనే కుర్చీ వేసుకుని కూచుంటే, నా బుర్ర మామూలు కంటే ఎక్కువగా బంకమట్టితో నిండిపోతుంది.

మన వాళ్ళందరికీ మరొక ప్రధానమైన సమస్య మరొకటి ఉంది. ఒకసారి ఒక మిత్రుడు నన్ను "గురూ, ఈ ఏడు మా అత్తగారూ, మామగారూ ఇండియానుంచి వచ్చారు. మా పిల్లలకి బేబీ సిట్టింగ్ చేసినందుకు మా అత్తగారికి నెలకి వెయ్యి డాలర్లూ, మా మామగారిని కూడా బేబీ సిట్టింగ్ చేసినందుకు ఆవిడకి నెలకి యాభై డాలర్లూ, వాళ్ళ ప్రయాణం ఖర్చులూ అన్నీ కలిపి పాతిక వేలు దాటాయి. ఆ ఖర్చు డిడక్ట్ చేసుకోవచ్చునా?" అని సలహా అడిగాడు. "తప్పు కాదూ? మీ పిల్లల బేబీ సిట్టింగ్ అయితే వెయ్యి డాలర్లు ఇచ్చి, మామగారిని ప్రేమగా చూసుకున్నందుకు ముష్టి యాభై డాలర్లు ఇస్తావా? ఆయన ఏమన్నా అనుకోరూ?" అని కోప్పడ్డాను. చెప్పొద్దూ, వాడు నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూశాడు. అతన్ని కిందటి ఏడాది ఏప్రిల్లో చూశాను.

అందుకే ప్రతీ ఉగాది సమయంలోనూ, అంటే మార్చ్-ఏప్రిల్ ప్రాంతాలలో అనమాట, అందరూ కవి సమ్మేళనాలు జరుపుకుంటూ ఉంటే నా కవితలో మటుకు ప్రతీ ఏడూ మూడే పాదాలు.

నాకు ఏప్రిల్ అనగానే భయం
అడుగడుగో బాబోయ్ అంకుల్ శ్యాం
అవుతుందేమో నా టాక్స్ రిటర్న్ భశుం

❀❀❀

## ఓ నా మంచి దేముడా! మళ్ళీ మరొక సాహితీ సదస్సా?

**అవును నిజమే. ఈ సాహిత్యం అనే రోగం,** సాహితీ సదస్సులు నిర్వహించే "సరదా దురద" అంటుకుని రెండు దశకాలు అయింది. అంటే ఇప్పుడు ఏ మందులూ, మాకులూ, ఆపరేషన్లూ, కీరోథెరపీ, హరిద్వారం నుంచి కేరళా కోవాలం బీచ్ దాకా దొరికే ప్రకృతి చికిత్స, చైనా వారి ఒళ్ళంతా సూదులు గుచ్చుటా మొదలైన ఏ చికిత్సకీ లొంగని ఈ రోగం కుదరదు. పుట్టుకతో నాకు ఈ వ్యాధి రాకపోయినా, పుడకలతో ..అంటే నేను బాల్చీ తన్నేసే దాకా పోయే అవకాశం ఏ కోశాన్నా లేదు అని మా క్వీన్ విక్టోరియా నిర్ణయించేసుకుని తను రోజూ చేసే దైవ ప్రార్ధనలో నన్ను లైన్ లో పెట్టడానికి కోరుకునే కోరికల లిస్టులోంచి నేను అందరికీ పంపించే జంక్ మెయిల్స్ లాగా నన్ను ఠకీమని డిలీట్ చేసేపారేసినదేమో అని అనుమానం వస్తోంది ఈ మధ్య, ..... " ఇటువంటి టెర్మినల్ వ్యాధిని మాకున్న మెడికల్ ఇన్ స్యూరెన్స్ కవర్ చేస్తుందా?" అని ఆవిడ అందరినీ అడగడం నేను స్పష్టంగా విన్నాను.

నేను మళ్ళీ మరొక సాహితీ సదస్సు పెట్టే సమయం ఆసన్నమయిందని గమనించిన నా గాఢమిత్రులూ-గూఢ మిత్రులూ యధాప్రకారం నేను ఎక్కడ కనపడినా నన్ను తప్పించుకోడానికి అవసరం లేకపోయినా రెస్ట్ రూములకేసి పారిపోతున్నారు. అసలు కారణం రేపు జూలైలో కాలిఫోర్నియాలో ఆరవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు జరగబోతోంది అని వాళ్ళకి తెలిసిపోయింది. ఆ వివరాలు ఈ కౌముది సంచికలో చూడండి. లేక పోతే నా మీద ఒట్టే!

ఈ సదస్సులలో ఏం సాధిస్తున్నావ్ అని నన్ను చాలా మంది అడుగుతూ ఉంటారు. అప్పుడు నాకు ఒక జోక్ జ్ఞాపకం వస్తుంది. జోకేమిటి లెండి. నాకు నిజంగా జరిగినదే. నేను ఇంజనీరింగ్ చదివేటప్పుడు ఒకానొక సాంస్కృతిక కార్యక్రమంలో నన్ను ఒక పాట పాడమన్నారు. సరే, పాడకపోతే తంతారేమో అని భయం వేసి ఒక పాట పాడాను. వెంటనే ఆడియన్స్‌లోంచి ఒకాయన "వన్స్‌మోర్" అని అరిచాడు. అబ్బో, ఇదేదో బావుందే అనుకుని అదే పాట మళ్ళీ పాడాను. ఆ మానవుడు మళ్ళీ వన్స్‌మోర్ అని అరిచాడు. మళ్ళీ పాడాను. నేను పాడుట, ఆ మానవుడు అరుచుట, నేను మళ్ళీ ద్విగుణీకృతమైన ఉత్సాహంతో పాడుతూండగా ఒకానొక పాడు ఆర్గనైజర్ గాడు నన్ను బలవంతంగా స్టేజి మీదనించి దింపేసి, నాకు వచ్చిన చెప్పుల కలెక్షన్ తను ఉంచేసుకుని - ఆడియన్స్ అందరి చేతా చప్పట్లు కొట్టించుకున్నాడు. దాంతో నాకు ఆ చప్పట్లు నాకా, లేక నన్ను దింపేసిన సదరు ఆర్గనైజర్ వెధవకా అని అనుమానం వచ్చేసింది. ఈ లోగా నన్ను రెచ్చగొట్టిన ఆసామీ విచారంగా మొహం పెట్టడం గమనించి ఆయన దగ్గరకి వెళ్ళి "థేంక్యూ సార్ , నా పాట మీకు అంతగా నచ్చినందుకు నా హృదయం అమందానంద కంద భరితంగా అయింది" అని దేవ భాష, అనగా సంస్కృత పదభూయిష్టమైన ప్యూర్ టెలుగులో నా ఆనందాన్ని వ్యక్తం చేశాను. ఆ మానవుడు విచారగ్రస్తమైన తన వదనాన్ని పైకెత్తి "ఆనందమా, నా మొహమా, ఎప్పటికైనా ఆ పాట సరిగ్గా పాడతావేమో అని నీకు లక్షఛాన్సులు ఇచ్చాను. ప్రతీ సారీ సరి అయిన శృతీ, తాళం లేకుండా ప్రాణం తీశావు" అని విసుక్కున్నాడు.

ఎందుకో తెలియదు కానీ ఈ సాహితీ సదస్సుల గురించి కూడా నిజమైన పండితులు అలాగే అనుకుంటున్నారేమో అని నా అనుమానం. ఇక మామూలు వాళ్ళంటారా, చెప్పొద్దూ, వాళ్ళు చూసేవి ముచ్చటగా మూడు విషయాలు. ఒకటేమో "విఫ్".... దీన్నే ఇంగ్లీషులో "WIIIFM" అంటారు. అనగా "What Is In It For Me? ".మన రాజకీయ నాయకులు రోజూ వేసుకునే ప్రశ్నే ఇది. తెలుగులో చెప్పాలంటే "ఇందులే నాకు ఒరిగేదేమిటీ?"

ఏ సాహితీ సదస్సు అయినా అందరికీ ఒరిగేది ఒకటే. అదే మంచి తెలుగు భాష వినడం, మంచి సాహిత్యం విని గర్వపడడం. ఇదే ప్రశ్న నేను మరొక రకంగా అడుగుతాను. "బాగా డబ్బు సంపాదిస్తే నాకు ఒరిగేదేమిటీ?" ఈ ప్రశ్న మొదటి సారి అడగగానే మా క్వీన్ విక్టోరియాగారు నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూశారు.

"అదేం వెధవ ప్రశ్న? హాయిగా పెద్ద ఇల్లు కొనుక్కోవచ్చు"

"ఒకవేళ కొనుక్కున్నామనుకో, అందులో మనకి ఒరిగేదేమిటీ, చచ్చేంత అప్పు తప్ప?"

"నీ మొహం, డబ్బుంటే హాయిగా ప్రపంచం అంతా చూడవచ్చు"

"చూశామనుకో , ఏమవుతుందీ? మనం చూడకపోతే తాజ్ మహల్ మునిగిపోతుందా, ఐఫిల్ టవర్ పడిపోతుందా?"

"మనమ్మాయికి పేద్ద రిసార్ట్‌లోనో, తానా, ఆటా టైపులో పేద్ద కన్వెన్షన్ సెంటర్ లోనే పెళ్ళి చెయ్యొచ్చు".

"నా మొహం, మన పెళ్ళి వైజాగ్ లో ఆపోజిట్ కే.జీ గేట్ దగ్గర జరిగింది. ఇప్పుడేమయిందీ?".

"అప్పుడే నా కొంప మునిగింది" మూలిగింది నా వితండ వాదన వినలేని మహారాణీ, అయ్యో అనుకుంటూ.

ఎవరైనా ఈ సాహితీ సదస్సులు ఎందుకూ, మనకి ఒరిగేదిమిటీ అని అడిగితే, నా ఫీలింగు "అసలు, సిసలు వన్స్‌మోర్" లాగానే ఉంటుంది. ఎందుకంటే ఇలాటి వాటికి ఎవరి సమాధానాలు వాళ్ళకే ఉంటాయి. ఉదాహరణకి, ఒకానొక రచయితకి తను కష్టపడి రాసిన

కవిత్వం వినిపించడానికి ఏదో ఒక వంకతో నాలుగైదు వారాలు ఇంట్లో ఏర్పాటు చేశాడు. రెండు పార్టీలు అవగానే ఊళ్ళో అందరికీ ఈ రహస్యం తెలిసిపోయి "సారీ, అనుకోకుండా మా పిల్లి పిల్లల్ని పెట్టింది, పురిటి పనుల్లో బిజీగా ఉన్నాం. వుయ్ కాన్ట్ కం టు యువర్ పార్టీ" అనో, "మీ ఆవిడ వంకాయ కూర చేసుకొస్తారా అని అడిగారు. వెధవ మార్కెట్లో ఎంత చూసినా అవి దొరకలేదు. ఆవిడకి సారీ చెప్పండి, మళ్ళీ సారి ఖచ్చితంగా వంకాయ కూరయే కాక, వంకాయ పచ్చడి, పెరుగు పచ్చడి మరియు బైంగన్ బర్తా తో సహా వస్తాం, అప్పటికి మీ అద్భుత రచన ఎలాగా మీ బ్లాగ్ లో చదువుతాం కదా!" అనో తన స్వీయ రచనా పఠనానికి ఆయన తల పెట్టిన విందు భోజనానికి జనం రావడం మానేశారనుకోండి. ఇలాటి సాహిత్య సభలో మీకు మీకు అలాటి పెర్సనల్ ప్రోబ్లెం లేదు కదా! మరి మీకు ఒరగనిది ఏమిటీ?

ఒక వేళ మీరు ఎప్పుడూ కథో, కవిత్వమో వ్రాయలేదనుకోండి. ఏదో సరదాగా తెలుగు సాహిత్యానికి "చంద్రుడికో నూలుపోగు" అందిద్దాం అనుకున్నారనుకోండి. మరి ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది కదా! అందుకైనా రావచ్చు కదా!

ఒక వేళ మీకు ఆ కోరిక లేదనుకోండి. మాంచి తెలుగు భాష వినడానికీ, అందులో ప్రముఖులని కలిసి ఫొటోలు తీయించుకుని , వారు చెప్పే మాంచి తెలుగు మాటలనీ, కథా, కమామీషులనీ విని ఆనందించడానికి రాకూడదూ?

అందుకే, మీ పరిస్థితి ఎలాటిదయినా, తెలుగు భాష మీద అభిమానం ఉన్న వారందరినీ ఈ ఆరవ అమెరికా తెలుగు సాహితీ సదస్సుకు రండి బాబోయ్ " అని బతిమాలుతున్నాను. చెప్పొద్దూ, ఇలాటి వాటికి వచ్చేవారికి కంగ్రాట్యులేషన్సు, రాని వారికి కండొలెన్సెసూ అనుకోవాలి.

అన్నట్టు, ఈ సదస్సు జరుగుతున్న కాలిఫోర్నియా బే ఏరియాలో నలభైవేల మంది తెలుగు వారు ఉన్నారని విన్నాను. అందులో ఒక శాతం ఈ సదస్సుకి వస్తారా? ఏమో, తెలుగు సాహితీ సదస్సుకు ఇలా బతిమాలే పరిస్థితి వచ్చినందుకు నాకు అదోలా ఉంది. మరి మీకో?

"మై డియర్ హస్బెండూ, అక్కడ గంటకో టెలేగూ ప్రోగ్రాం ఉండును. అన్నింటికీ డబ్బు ఇవ్వలేక జనం చస్తున్నారని నిన్న CNN లో చెప్పారు. గుడ్ లక్." అని ఒకానొక టెంకిజల్ల తాలూకు వ్యక్తి తన కర్తవ్యం నిర్వహించి వర్క్ కి వెళ్ళిపోయింది. రాత్రి పన్నెండయ్యింది. ఆ మహామనీషి నేను వ్రాస్తున్న ఈ అమెరికామెడీ నా కంప్యూటర్ వెనకాలనుండి చదివిన సంగతి నాకు స్పష్టంగా తెలిసిపోయింది. ఎంతయినా బ్రిలియంట్ ఫెలోని కదా!.

✡✡✡

## గిన్నెస్ బుక్కూ - నాకొచ్చిన చిక్కూ

**మా చిన్నప్పుడు మొదటి సారి విన్నప్పుడు** ఈ గిన్నెస్ బుక్కు అంటే ఏదో రెన్ అండ్ మార్టిన్ వారికి కాంపిటీషన్‌గా ఇంగ్లీషు గ్రామరు పుస్తకం కాబోలు, ఆ సబ్జెక్టు మనకి అసలే విపరీతమైన చిక్కు కదా ఎందుకులే అని పట్టించుకో లేదు. కానీ ఆ నాటి విద్యాలయ అధికారుల అభిప్రాయాల ప్రకారం నేను ఏ క్లాసులో ఉన్నా కూడా ఈ బుక్కు నాన్ డిటైల్డ్ గా కూడా చదివి బట్టీ పట్టే అవకాశం రాలేదు ఒక సారి మట్టుకు ప్రపంచంలో అత్యధిక వర్షపాతము కురియు చోటు అస్సాం లోని చిరపుంజి గ్రామము అని గిన్నెస్ బుక్కులో నమోదు చెయ్యబడినది అని చదివి అక్కడికి వెళ్ళి వానలో సినిమా హీరోలాగ తడిసి, తరించి వద్దామా అని

అనుకున్నాను. నాలుగైదు దశకాల తరవాత ఇటీవల ఒకానొక తెలుగు సినిమాలో త్రిష అనే నాన్-తెలుగు అమ్మాయి రెల్వేప్లాట్‌ఫారం మీద "ఇన్నాళ్ళు ఎక్కడున్నావే వానా, నా ఒళ్ళంతా తడిపిపోవా? అది చూసి అందరూ మురిసిపోరా? జలుబొచ్చినా ఫరవా లేదు వానా?" లాటి అద్భుతమైన తెలుగు సాహిత్యంతో తడుస్తూ, పాడుతూ అందరినీ రెచ్చగొట్టగానే, మళ్ళీ చిరపుంజిలో తడవాలనే నా చిరకాల వాంఛ పుంజుకుని, గిన్నెస్ బుక్ తీయగానే అందులో చిరపుంజి మాట ఎత్తేసినట్టున్నారు. ఎందుకనగా ఈ రోజుల్లో నా బోటి వాడు కూడా ఎద్దు బండి, రిక్షాలు లాటి వాహనాలు మానేసి పెట్రోలుతో నడిచే నాలుగు కార్లు వాడుట మొదలైన కారణాల వలన ప్రపంచం అంతా వేడెక్కి పోతున్న గ్లోబల్ వార్మింగ్ పుణ్యమా అని ఈ అత్యధిక వర్షపాతం ఒక రోజు శ్రీకాకుళంలోనూ, మరొక రోజు సిలికానాంధ్రాలోనూ ఇష్టం వచ్చిన చోట పడుతూ నా అభిమాన చిరంజీవిని--సారీ చిరపుంజిని గిన్నెస్ బుక్ లోంచి చెరిపేసింది.

ఇప్పుడు సిలికానాంధ్రా అంటే గిన్నెస్ బుక్ జ్ఞాపకం వచ్చిందా, లేక గిన్నెస్ బుక్ అంటే సిలికానాంధ్రా జ్ఞాపకం వచ్చిందా అని అడిగితే, రెండూ కరెక్టే సుమా అని చెప్పుకోవాలి. ఎందుకంటే జూన్, 2008 మూడో వారంలో సిలికానాంధ్రా వారు కాలిఫోర్నియాలో ఒక మహత్తరమైన అంతర్జాతీయ కూచిపూడి సమ్మేళనం నిర్వహించారు. అందులో ప్రధానాంశం 318 మంది డాన్సర్లు ప్రపంచంలో అనేక ప్రాంతాలనుండి తరలి వచ్చి స్వరజతి అనే ఒక నాట్యాన్ని ఒకే వేదిక మీద నర్తించి, కూచిపూడినీ, తద్వారా సిలికానాంధ్రాని గిన్నెస్ బుక్ లో ఎక్కించడం నేను స్వయంగా చూశాను. నా ఖర్చు కేవలం రెండువేల డాలర్ల చిల్లర మాత్రమే..

ఆర్గనైజర్లు అబద్ధం ఆడుతున్నారేమో అని అందరి పేర్లూ తెలుసుకుని, అటెండెన్స్ వేసుకోడానికి లండన్ నుంచి ఒక దొర గారు కూడా వచ్చారు. వెయ్యి మందికి పైగా పంచెలు, పట్టు చీరలు, డాన్స్ డ్రెస్సులలో ఉన్న టెలుగూస్‌ని ఒక చోట చూసిన ఆ దొర ఏదో ఒక పుస్తకంలో మనల్ని ఎక్కిస్తాడని భయం, భయంగా ఉన్న ఆయన వాలకాన్ని చూసి నాకు తెలిసిపోయింది. ఇందులో నేను కొంచెం కాలర్ ఎగరేసుకునే విషయం ఏమిటంటే, నాకు అత్యంత అభిమాన నర్తకి, వ్యక్తి అయిన రత్నపాప నేర్పగా మా అమ్మాయి అమూల్య చేసిన స్వరజతిని టేప్ చేసి ప్రాక్టీస్ చెయ్యమని నిర్వాహకులు అందరికీ పంపించారు. రత్నపాపకి నేర్పిన మహానుభావులు, కారణజన్ములు శ్రీ వెంపటి చిన సత్యం గారు కూడా ఈ విన్యాసం తిలకించడం అమెరికా వారి అదృష్టం. అందుకు కారకులైన సిలికానాంధ్రా వారికి ఎన్ని రకాలుగా మనం కృతజ్ఞతలు చెప్పుకున్నా చాలదు.

అంతమంది నర్తకీనర్తకుల పేర్లు వెయ్యడానికి మరొక బుక్కు సెపరేట్‌గా వెయ్యాలి కాబట్టి, మా అమ్మాయి పేరు గిన్నెస్ బుక్కులో ఉండదని తెలుసును కానీ, సమ్మేళనం నిర్వాహకుల పేర్లు వేస్తారేమో నాకు తెలియదు. నాకు తెల్సినదీ, నచ్చినదీ ఏమిటంటే ఆ గిన్నెస్ బుక్ లో నా పేరు ఖచ్చితంగా వెయ్యరు సుమా అని. అసలు విషయేమిటంటే ఈ సమ్మేళనానికి మీరు తప్పకుండా వచ్చి, పాల్గొని, విజయవంతం చేసి, మన కూచిపూడిని గిన్నెస్ బుక్ లోకి ఎక్కించే ప్రయత్నం సఫలీకృతం చెయ్యమని ఒక ముఖ్య నిర్వాహకుడు గారు నన్ను ఎంతో ఆత్మీయతతో పదే, పదే అడిగారు, ఆఖరికి మా హ్యూస్టన్ విచ్చేసి మరీనూ. అంతటి పెద్దమనిషి అంతాగా మొహమాటపెట్టేస్తుంటే బావుండదు కదా!

అందు చేత నేను కష్టపడి, మా అమ్మాయి దగ్గర ఇలాటి శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకోవడానికి కావలసిన మొట్ట మొదటి "అరమండి" తో నేను కూచిపూడి చేసి గిన్నెస్ బుక్‌లో ఎక్కే ప్రయత్నం మొదలుపెట్టాను. అరమండి అంటే బహుశా అరవ మాట అయియుంటుంది. దానికి ఏం చెయ్యాలంటే, ముందు భూమాతని, అనగా స్టేజిమాతని కళ్ళకద్దుకుని నమస్కారం పెట్టి, మోకాళ్ళు మాత్రం ఏ మాత్రం ముందుకు పొడిచి రాకుండా, పక్కకి వచ్చేలా ముడుచుకుకుని, అసలే పొట్టి వాణ్ణి అయిన నేను, మా క్వీన్ విక్టోరియా కంటే కూడా పొట్టిగా మారిపోయి, చేతులతో బాపూబొమ్మలా విలాసంగా అందరికీ నమస్కారం పెడుతూ అరగంట సేపు అరవ్వాళ్ళ అరమండిలో ఉండిపోవాలన మాట. నన్ను ఈ సీనులో ఊహించుకుని అనేక మంది పాఠకులు చచ్చేలా నవ్వుకుంటారని నాకు తెలుసు. ఎందుకంటే కొన్నాళ్ళు పక్కనే ఉన్న గోడ, కుర్చీ లాటివి పట్టుకుంటే కాని నుంచోలేని పరిస్థితిలో అవస్థపడుతున్నప్పుడు నా సుందర

వదనారవిందం చూస్తూ, మంచి నీళ్ళు కూడా ఇవ్వకుండా మా క్వీన్ విక్టోరియా గారు మహదానందంతో డిస్కో డాన్సు చేస్తున్నా, నేను చిన్నప్పుడు సైకిలూ, అమెరికా వచ్చాక రోలర్ స్కేటింగూ నేర్చుకున్నప్పటి బ్రూసు దొర-సాలీడు కథలోలాగా అకుంఠిత దీక్షతో అరమండిని అవలీలగా సాధించి మా రత్నపాపనీ, మా అమ్మాయి అమూల్యనీ సంతోషపెట్టాను. అంటే నా వాలకం చూసి వాళ్ళుకూడా నవ్వుకున్నారనమాట.

ఆ అరమండి విద్య సాధించగానే బ్రహ్మశ్రీ ఆర్గనైజరు గారికీ, ఎందుకైనా మంచిదని లండన్‌లో ఉన్న మహారాజశ్రీ గిన్నెస్ గారికీ ఈ శుభ వార్త బట్వాడా చేసి, కూచిపూడి జతులు, ముద్రలు, ఇలాటివన్నీ అర్జంటుగా నేర్చేసుకుని స్వరజతిలో మంచి ప్రావీణ్యం సంపాదించాను. తీరా ఈ అంతర్జాతీయ కూచిపూడి సమ్మేళనానికి వెళ్ళగానే నన్ను "ఈయనే అమూల్య నాన్న" అంటూ గుర్తించారు కానీ, నా కూచిపూడి ప్రావీణ్యత ఎవరికీ తెలిసినట్టు లేదు. నాకు నచ్చని మరొక విషయం ఏమిటంటే ఒరిజినల్ కూచిపూడి పద్ధతిలో బందా కనకలింగేశ్వర రావు గారిలా నేను డాన్సర్లుగా చెలామణి అవడానికి మగ డాన్సర్లు బృహన్నల టైపులో విలాసంగా నడుస్తున్నా నన్ను ఎవరూ గుర్తించక పోవడం.

అంతకీ ఒకసారి "అంతమందిలో ఎవరు చూడొచ్చారులే" అని నేను డాన్సర్ నెంబర్ 214 వేషంలో లైన్‌లో నుంచోగానే, ఆ-విడెవరో నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూసి, రెక్క పట్టుకుంది. నాకు పౌరుషం వచ్చి అరమండిలోకి వెళ్ళిపోగానే, ఆవిడ తాలూకు కింగ్ జార్జ్ గారు అనవసరంగా కలగజేసుకుని కించిత్తు బాడీ డేమేజీ చేశాడు. మొత్తానికి జరిగినదేమిటంటే, నా ప్రమేయం ఏమీ లేకుండానే కూచిపూడి గిన్నెస్ బుక్ లోకి వెళ్ళిపోయింది.

"ప్రపంచంలో అందరికంటే తక్కువ వ్యవధిలో, కేవలం వారం రోజులలో అరమండిలో అఖండ ప్రజ్ఞ సాధించిన పెద్ద మనిషి" అనే మకుటంతో అయినా నన్ను వ్యక్తిగతంగా నా గురించి గిన్నెస్ బుక్ లో రాస్తారేమో కనుక్కోడానికి వచ్చే వారం లండన్ వెళ్దామని అనుకుంటున్నాను. ఇక్కడ పెద్దమనిషి అనే మాటకి వృద్ధుడు అనే అర్థం ఏ మాత్రం అన్వయించదని మనవి చేసుకుంటున్నాను. అంతే కాక, పెద్దమనుషులందరూ వృద్ధులు కాదనియూ, వృద్ధులందరూ పెద్దమనుషులు కాదనియూ ఘంటాపథంగా ప్రవచిస్తున్నాను.

వచ్చే వారం లండన్ వెళ్ళే దారిలోనే న్యూ జెర్సీలో ఆగి, ఆటా వారి సాహిత్య కార్యక్రమాలలో హడావుడి చేసి, అవధానంలో అప్రస్తుతం చేసి, అక్కడినించి రాగానే జూలై 19-20 తారీకులలో జరగబోయే 6వ అమెరికా తెలుగు సాహితీ సదస్సుకు కూడా ఆ హై టెక్కు ప్రాంతానికే...అంటే సిలికాన్ వేలీ వెళ్ళాలి. ఈ సాహితీ సదస్సుకు రండి బాబోయ్ అని నేను, ఇతర ఆర్గనైజర్లూ కలిసి ఐదారు వేల మందికి ఆహ్వానాలు పంపించాం. కనీసం అరవై మందయినా వస్తారో రారో తెలియదు.. ఎందుకంటే మా ఆరవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు ప్రకటన చూడగానే, "ఈ అరవ తెలుగు సాహితీ సదస్సు" అంటే అరమండి లాటిదేనా అని అనేక మంది అడిగారు.

"ఈ మాత్రం దానికి లండన్‌దాకా వెళ్ళడం ఎందుకూ? గినెస్ బుక్ లోకి ఎంట్రీ కోసం ఈ సాహితీ సదస్సులో నీ కూచిపూడి డాన్స్ ఉంది అని స్పెషల్ ఈ-మెయిల్ పంపించు. ఆరు వందల మంది గారంటీగా వస్తారు ఎంటర్ టైన్‌మెంట్ కోసం. ఒకే దెబ్బకి రెండు పక్షులు" అంటూ నిష్క్రమించింది మా క్వీన్ విక్టోరియా, నాకు ఇవ్వాల్సిన బహుమానం....అనగా టెంకి జల్ల తకీమని ఇచ్చేసి, యథాప్రకారం అర్థరాత్రి తన ఉద్యోగానికి.

✡✡✡✡

# బేనర్ పవర్

**ఈ మధ్య అమెరికాలో దేశవ్యాప్తంగా జరిగిన** నాలుగు తెలుగు సభలకి వెళ్ళాను. పిల్లల పురుళ్ళు పోయడానికి ఇండియా నుంచి వచ్చిన తల్లీ తండ్రులూ, లేదా అత్త, మామలు అనబడే "బేబీ సిట్టర్స్" భాషలో ఈ అమెరికాలో "ఐదు రోజులు జైలు, రెండు రోజులు బెయిలూ" కావున ఈ సభలన్నీ వారాంతంలోనే జరిగాయి. అన్నింటిలోనూ నాకు నచ్చని అంశం ఈ "రిజిస్ట్రేషన్" అనే తతంగం. అంతే కాక నేను కూలంకషంగా పరిశీలించి, గమనించిన అంశం బేనర్ పవర్.

నా బ్రిలియంట్ పరిశోధనలో తేలిన అంశం ఏమిటంటే ఏ బేనర్ పేరున ఎటువంటి సమావేశం జరిగినా మొట్టమొదటి తతంగం "రిజిస్ట్రేషన్". సాధారణంగా ప్రత్యేక ఆహ్వానితులు తప్ప నా బోటి గొట్టాం గాళ్ళు అందరూ "రిజిస్ట్రేషన్" టైములో నానా అవస్థా పడతారు. నేను వెళ్ళిన ఒకానొక తంటా సభకి "మేము అన్ని ఖర్చులూ పెడతాం, మీరు వచ్చి మా మహా సభలకి గౌరవం తెచ్చిపెట్టండి" అని నాకు బాగా తెలిసిన ఒక సాహితీవేత్తని వారు ఆహ్వానించారు. ఆయన ఫొటో కూడా వెబ్ సైట్లోనూ, కరపత్రాలలోనూ వేసి సభల గొప్పతనం చాటుకున్నారు. నేను మళ్ళీ బ్రిలియంట్‌గా అలోచించి, సదరు సాహితీవేత్త గారికి బాడీ గార్డుగా ఉంటే ఇహం, పరం దక్కుతాయని అనుకున్నాను.. అనగా అటువంటి గొప్ప వాళ్ళ చొక్కా పట్టుకుంటే నా లాటి గొట్టాం కేరెక్టర్‌కి కూడా ఉప్మా, ఇడ్లీలు సకాలానికి అందుతాయి కదా అని నా ప్లాను. తీరా చూస్తే అటువంటి ప్రత్యేక ఆహ్వానితులు కూడా ...అవును, నా బోటి గొట్టాం గాడి వలె "రిజిస్ట్రేషన్" చేసుకోవాలిట. అప్పుడే ఆయనకి తరవాత రెండు రోజులూ పొద్దున్న టిఫిన్ టైముకి ఇచ్చే గట్టి ఇడ్లీ, చల్లటి సాంబారు, మరియు లంచ్, డిన్నర్ లాంటి "తిండి పత్రాలు" ఇస్తారుట. "నో పత్రం, నో ఫూడ్" పోలిసీ అన్నమాట. ఈ రిజిస్ట్రేషన్ తతంగం అంతా ఏమిటో ఆయనకి తెలియక దెబ్బకి పరిస్థితి అంతా మారిపోయి, నా చిరిగిపోయిన చొక్కా పాపం ఆ మహానుభావుడు పట్టుకోవలిసి వచ్చింది.

చెప్పొద్దూ, ఈ చొక్కాల మార్పిడి మాట ఎలా ఉన్నా నాకు ఈ నిబంధన భలే నచ్చింది. ఎందుకంటే ఈ మహా సభలకి జెనీలియా, ఆర్తీ అగర్వాల్, ఛార్మి మొదలైన బ్యూటీ క్వీన్స్ వస్తారని తంటా వెబ్ సైట్లో చూసి, ఇప్పుడు చచ్చినట్టూ వాళ్ళందరూ కూడా, ఈ కొత్త రూలు ప్రకారం నా ముందో, వెనకాలో రిజిస్ట్రేషన్ లైనులో నుంచోవాలి కదా, "రిజిస్ట్రేషన్" ఎంత ఆలస్యమైనా సౌందర్య వీక్షణ చేస్తూ కాలం గడిపెయ్యొచ్చునోచ్ అనుకుంటూ ఆ రిజిస్ట్రేషన్ చోటుకు వెళ్ళాను. ఆ గది నేను అమెరికా వచ్చినప్పుడు అద్దెకి తీసుకున్న చిన్న వన్ బెడ్ రూం సైజులో ఉంది. అంత చిన్న చోటులో, అన్ని వేల మంది ఏ విధముగా రిజిస్ట్రేషన్ చేసుకుందురూ, ఆ తతంగం పూర్తి అయే సరికి మూడు రోజులు పట్టును కదా, అప్పటికి మహా సభలు కూడా అయిపోవును కదా అని నేను విచారించినా గది ఎంత చిన్నదయితే అంత క్లోజప్‌లో ఈ సినిమా తారలని చూడవచ్చును కదా అని ఉవ్విళ్ళూరుతూ, పేద్ద బాడ్జీ పెట్టుకుని రిజిస్ట్రేషన్ బల్లకి అవతలి వేపు హడావుడిగా తిరుగుతూ, సూటూ, బూటూ వేసుకుని చెమటలు గక్కుతున్న ఒకానొక ఆర్గనైజరు గారిని "సార్, జెనీలియా రిజిస్ట్రేషన్ అయిపోయిందా, నేను మిస్సవ లేదు కదా?" అని అడిగాను. ఆయన నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూడగానే, నేను "ప్రత్యేక ఆహ్వానితులు కూడా ఇక్కడకి ముందు వచ్చి పేరు నమోదు చేసుకోవాలి అని రూలు పెట్టారుట కదా, అందుకనీ, అఫ్ కోర్స్ జెనీలియా కాకపోతే ఆర్తీ అగర్వాల్ అయినా ఐ కెన్ మేనేజ్ సార్" అని నసిగాను.. అప్పుడు ఆయన "ఏందన్నా, పాగల్ అయినవా? సినీ స్టార్స్ పవర్ తెల్వదా? వాళ్ళని ఎయిర్ పోర్ట్ లోనే రిసీవ్ చేసుకుంటుండు. ఆ మాత్రం తెల్వదా, ఎందుకూ అమెరికాలో ఇన్నేళ్ళనించీ ఉంటివి, కదా, కామన్ సెన్స్ లేదా" అంటూ వికటాట్టహాసం చేశారు. నాకు కోపం వచ్చి మరి "ఆయన మాటో?" అని రిజిస్ట్రేషన్ ప్రాంగణంలో

రెండు గార్బేజీ సంచుల మధ్య ఉన్న ఒకే ఒక్క కుర్చీలో నేను కూచోబెట్టిన ఆ మహా సాహితీవేత్త మరియు ప్రత్యేక ఆహ్వానితుల వారిని చూపెట్టాను. ''ఆయన కథలూ, కమామీషులూ రాస్తాడుగా, క్వాలిఫై అవరు'' అని దూరంగా పారిపోయాడు ఆ పెద్ద బేడ్జీ గారు..

మొత్తానికి పదిహేను రోజులకి ముందే ''రిజిస్ట్రేషన్'' చేసుకుని డబ్బు కట్టిన నేనూ, గొప్ప కళాకారులూ, సాహితీవేత్తలూ అయిన ''గ్లామర్ లేస్'' ప్రత్యేక ఆహ్వానితులు చాలామందీ నాలుగు గంటలు నానా అవస్థాపడి రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, అప్పడాల క్యూపన్స్ సంపాదించుకున్నాం. ''ఇలాంటి సభలకి నేను చస్తే రాను'' అని ఒక హైదరాబాదు కళాకారుడు విసుక్కోవడం అప్పుడే విన్నాను. అది – ఆయన నోట కిందటేడూ, అంతకు ముందు సంవత్సరం నేను వింటూనే ఉన్నాను. ఆయన అలా అంటూనే ఉంటాడు. ప్రతీ సభకీ అందరి కాళ్ళూ పట్టుకుని వస్తూనే ఉంటాడు. తంటా వారిని పాపం అందరూ తిడుతూనే ఉంటారు. కానీ బతిమాలుకుని అన్ని సభలకీ వస్తూనే ఉంటారు.. ఆ బాపతు కళాకారులు నాకు చాలా మందే తెలుసు.. అదే తంటా వారి బేనర్ పవర్‌కి ఒక సూచన.

నా మరొక ముఖ్య గమనిక ఏమిటంటే, సమావేశానికి వచ్చే ప్రతీ అడ్డమైన, నిలువైన, లావైన, సన్నటి, తెల్లటి, నల్లటి, గోధుమ రంగు తెలుగు మగ మరియు ఆడవారూ సదరు ''రిజిస్ట్రేషన్''కి అతీతులుగా భావిస్తారు. ఈ రిజిస్ట్రేషన్ మనకి కాదుగా అనుకుని అవేవీ పట్టించుకోకుండా లోపలికి దూసుకుపోయే హక్కు మహాత్మా గాంధీ గారు తెచ్చిపెట్టిన స్వాతంత్ర్యం కారణంగా తన జన్మహక్కు అనీ భావించడమే దానికి కారణం. ప్రస్తుత విషయానికి వస్తే నేను వెళ్ళిన తంటా సంఘం వారి మహా సభలలో ఈ తెలుగు పప్పులు ఉడకకుండా, అడుగుకో మనిషి చొప్పున వంద మంది తెల్ల, నల్ల సెక్యూరిటీ గార్డులని పెట్టారు. పాపం ఒకసారి ఆ సంస్థ ఉన్నతాధికారిని కూడా ఘటోత్కచి, పక్కనే ఉన్న లంబూ, జంబూలు అడ్డగిస్తే ఆయన తన ప్రవర చెప్పుకుని, గూర్ఖా వాళ్ళ పెద్ద గూర్ఖా బాస్‌ని ఫోన్ లో పిలిచి, లోపలికి వెళ్ళి, మళ్ళీ చస్తే బయటకి రాకుండా జాగ్రత్త పడ్డారు.

మొత్తానికి మా బేడ్జీలు చొక్కా జేబు మీద పిన్నీసు గుచ్చుకోకుండా జాగ్రత్తగా పెట్టుకుని, పది ఎకరాల సభా ప్రాంగణంలో అడుగుపెట్టగానే, నాకు ఇది వరకే తెలిసిన మరొక విషయం రూఢి అయింది. అదేమిటంటే, ఈ తంటా సంఘాలు. సంఘాల నాయకులూ, వచ్చే జనాభా ఇంచుమించు అందరూ ఏదో ఒకరకమైన ఉపాసకులే సుమా అన్న విషయం అన్నమాట. అన్నీ కలిపి ఏడు రకాల ఉపన్యాసకులు అని నా లెఖ్ఖలో తేలింది. మొదటి వారు '''సినీతారోపాసకులు''. రెండో వారు ''రాజకీయ మంత్రోపాసకులు''. మూడో రకం ''వ్యాపారోపాసకులు'', అధిక సంఖ్యాకులు ''మనోళ్ళు'' అందరూ వస్తారు అని ఆనందంగా వచ్చే ''అమెరికాకులోపాసకులు''. మరొక ఆసక్తికరమైన ఉపాసకులు ''స్వర్గానికి నిచ్చెనోపాసకులు''...అనగా సభలకు వచ్చే స్వామీజీల కాళ్ళకి మొక్కి, తమ పాపాల ఫైలు ''ఇరేజ్'' చేసేసుకుని, కొత్త ఫైలు ప్రారంభించే వారు అన్నమాట.. మరొక రకం వారు ''ధనికులోపాసకులు'' లేదా ''ఛాయాదేవోపాసకులు'' ..అనగా, ఇరవై శాతం తగ్గింపు ధరలలో అందించే నగలు మరియు పట్టుచీరల ''బూత్'' లలో అన్నీ కొనుక్కుంటూ కాలం గడిపి, మాయాబజార్ సినిమాలో ఛాయాదేవి లాగ ఐశ్వర్యాభిలాషులు.. వీరంతా కాక ఏడవదీ, ఆఖరిదీ ''అమాయకోపాసకులు''. అనగా ఈ హోలు మొత్తం తెలుగు సంస్కృతికి మూల కారణమైన తెలుగు భాష, సాహిత్యాలకోసం తంటాలు పడే కొద్ది మంది అమాయకులన మాట. ఈ కేటగిరీలోకి మాత్రమే నా బోటివాడికి ప్రవేశం అని వేరే చెప్పక్కరలేదు. ఈ ఏడు రకాల ఉపాసకులూ ..క్షమించాలి, ఏడు రోదన శబ్దం కదా...అందుచేత ఆరున్నొక్క అని ఏడుస్తాను....ఈ ఆరున్నొక్క ఉపాసకులూ, వాటి అనుబంధోపాసకులు వెరసి పదివేల మంది ఈ తంటా సంఘాల మహా సభలకి వచ్చారు. ఇవన్నీ నాకు ఇంత స్పష్టంగా ఎందుకు తెలిశాయి అంటే, అన్ని ఎకరాల కన్వెన్షన్ సెంటర్ లో ఎక్కడ చూసినా, నేను పైన ఉదహరించిన ప్రతీ ఉపాసకుల టైపు ఆ-రాధ్యదేవతలు, దేముళ్ళూ, అనగా సినీ తారలు, మంత్రులూ, రాజకీయ నాయకులూ, వ్యాపార సంస్థల యజమానులూ మొదలైన వారి చిత్రపటాలు అలంకరించి ఉన్నాయి, ఒక్క ''అమాయకోపాసకులు'' టైపు తప్ప.. అనగా సాహితీ వేత్తల ఫొటో, కనీసం ఒక్కటైనా ఎక్కడా లేదు. ఎంతయినా అమెరికాలో కొందరి దృష్టిలో నేనూ అదే రకం మనిషిని కదా, పోనీ నా ఫొటో ఎక్కడైనా ఉంటుందేమో అని ఆశగా

మరొక పెద్ద బేడ్జీ గారిని అడిగితే, అదుగో అక్కడుంది అనుకుంటాను అని తెలివిగా తప్పించుకున్నాడు. "ఆహా, నా జన్మ తరించెన్ కదా, మా క్వీన్ విక్టోరియా గారికి నా ఫొటో ముందు ఫొటో తీయించుకుని ఇంప్రెస్ చేసిపారెయ్యొచ్చు కదా" అనుకుని, నేను అర్జంటుగా కాలరెత్తుకుని ఆయన చెప్పిన వేపు సగర్వంగా చూస్తే, మగాడి బొమ్మతో ఉన్న పురుషుల రెస్ట్ రూం కనపడింది. "హారి రాస్కెల్" అనుకుని ఈ మానవుడు ఒకనాటి నా గాఢ మిత్రుడూ, ఈ నాటి గూఢ శత్రువూ కదా అని జ్ఞాపకం వచ్చింది. ఇలాటివన్నీ పాప్యులారిటీ పెరగడంతో వచ్చే అనర్థాలని అందరికీ తెలుసును.

నా బోటి గొట్టాం గాళ్ళు ... అవును ఇంకా గొట్టాం గాణ్ణే... కించిత్తు అసహనంతో, అసూయతో ఎంత గింజుకున్నా, ఎన్ని రకాల కంప్లెయింట్స్ ఏ స్థాయిలో చేసినా, అందరూ ఒప్పుకోవలసిన విషయం, అభినందించవలసిన విషయం ఏమిటంటే ప్రపంచవ్యాప్తంగా అనేక వేల మంది తెలుగు వారిని ఆకర్షించడం, ఒక చోటకి రప్పించి, మెప్పించడం. అదే తంటా సంఘం వారి అద్వితీయమైన బేనర్ పవర్. అది ఎంతో గర్వించదగ్గ విషయం.

ఈ రిజిస్ట్రేషన్ తతంగం తదుపరి, మేము లోపలికి అడుగుపెట్టాక, నన్నూ, ఆ మహానుభావుడినీ తంటా సంఘం వారు ప్రైం టైం లో మెయిన్ స్టేజి మీదకి పిలిచి గౌరవం చేశారు.. మేము నిర్వహించిన సాహితీ సదస్సు బాగా జరిగింది.

సాహితీ సదస్సు అంటే జ్ఞాపకం వచ్చింది. ఎవరు, ఏ ఊళ్ళో పెట్టినా సాహితీ సదస్సుల బేనర్ పవర్ 150. ఇక్కడా రిజిస్ట్రేషన్ తతంగాలు, అందులో అవక తవకలూ తప్పవు.. అన్నట్టు జూలై 19-20, 2008 తారీకులలో కాలిఫోర్నియాలోని ఫ్రీమాంట్ నగరంలో జరిగిన 6వ అమెరికా తెలుగు సాహితీ సదస్సుని విజయవంతంగా నిర్వహించిన ఆత్మీయులు కిరణ్ ప్రభ, వేమూరి వెంకటేశ్వర రావు, మల్లాది రఘు, తాటిపాముల మృత్యుంజయుడు, తల్లాప్రగడ రామచంద్ర రావు, మా అన్నయ్య గారి అబ్బాయి నరసింహ చిట్టెన్ రాజు, కలగర కుమార్, సిలికానాంధ్ర సహాయకులైన చామర్తి రాజు మొదలైన వారికీ, కేవలం తెలుగు సాహిత్యాభిమానంతో అమెరికాలోని అనేక ప్రాంతాలనుండి వచ్చిన అహూతులందరికీ ఈ పత్రికా ముఖంగా నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

## "మంచి అయితే మైకులో చెప్పు, చెడు అయితే చెవిలో చెప్పు"

**ఈ మధ్య మా ఇంట్లో టీవీ రక రకాల ధ్వనులు చేస్తోంది.** తెలుగు చానల్స్ ఏం పెట్టినా, జై చిరంజీవా అని హోరున గొడవ. మరుక్షణం లోనే వైస్సార్ వారు బహిరంగ సభలో ఏదో పెద్ద రహస్యం చెప్తున్నట్టు మాట్లాడుతూ "మీ కోసం కాదు", "ఆయన కోసమే" నాయుడు గారు అన్ని ఊళ్ళూ పెద్ద లారీలో పాదయాత్ర చేస్తున్నారూ, అది గమనించండోచ్" అని వాపోతున్నారు.. "మీరు ఇది వినే ఉంటారు. మన ముఖ్య మంత్రి గారు తమ ప్రభుత్వం పనులు చెయ్యవలసిన మాంఛి పనులన్నీ ఎడా, పెడా చేసి పారేస్తోంది కదా. ఇంకేముంది ఎవరైనా, ఏదైనా చెయ్యడానికి అంటున్నారు కాబట్టి, కాంగ్రెస్ వారు ఇంకేమీ చెయ్యడానికి లేదు కాబట్టి ఇక ఆయన పదవీ విరమణ చెయ్యవచ్చునోచ్" అని నాయుడు గారు ఘంటాపథంగా చెప్తున్నారు. సరే కమ్యూనిస్టులు తమ ఇష్టసఖులెవరో తెలియక అవస్థపడుతుంటే, అనేక పాత, కొత్త తెలంగాణా పార్టీ వారలు ఒకటే పాటని రాగం, తానం పల్లవి మార్చుకుంటూ పాడుతున్నారు. అన్ని పార్టీ వాళ్ళూ పబ్లిగ్గా చెప్పేదేమిటంటే "మనది ప్రజాస్వామ్యం కాబట్టి, ఎవరైనా, ఎప్పుడైనా, ఏ పార్టీ అయినా పెట్టుకోవచ్చు. మాకేమీ

నష్టం లేదు. ఎలాగూ నెగ్గేది మేమేగా" అని మైకులో చెప్తూ, "ఇదెక్కడి గొడవరా బాబూ?, మెగా స్టారు మెగా విలన్‌గా మారిపోయాడు.. కిం కర్తవ్యం, మూఢం" అని ప్రయివేటుగా భోరుమంటూ భారీ మీటింగులు పెట్టుకుంటున్నారు .

మళ్ళీ ఎలెక్షన్లు అయేదాకా, ఈ బాకాలు అలా ఊదుతూనే ఉంటారు కదా అని అమెరికన్ చానల్స్ పెడితే అక్కడా అదే గోల.....ఎటొచ్చీ ఇంగ్లీషులో. బరాక్ ఒబామా ఉత్తి కుర్ర సన్నాసి, అమెరికా అధ్యక్షుడు ఎర్రగా, బుర్రగా ఉండాలి అని జాన్ మెకైన్ గారు చాలెంజ్‌లు విసురుతుంటే, "మెకైన్ వారి మొహం చూడండి, అచ్చు బుష్ గారి వాలకం తప్ప సొంత తెలివితేటలు లేనే లేవు" అని ఒబామా గారు అందరినీ భయపెడుతున్నారు.

ఈ హడావుడిలో ఆగస్టు 15 తారీకున మన ఇండియా 62వ స్వాతంత్ర్య దినోత్సవాల ప్రత్యేక కార్యక్రమాలు కూడా టీవీలో చూశాను. అందులో శ్రీశ్రీ గారు వ్రాసిన అద్భుతమైన దేశభక్తి గీతం "పాడవోయి భారతీయుడా" అనే పాటని ఘంటసాల, సుశీల మరింత గొప్పగా పాడిన పాట వింటూ, ఆ నాటి తెల్లటి కాంగ్రెస్ టోపీ పెట్టుకున్న నాగేశ్వరరావు అభినయనం చూస్తూ ఉంటే ఒళ్ళు జలదరించి, నాలో దేశభక్తి పొంగి పొరలుపోయి, వెంటనే రిఫ్రిజిరేటర్ లో క్వీన్ విక్టోరియాకి తెలియకుండా వెనకాల దాచుకున్న లండన్‌లో తయారయిన ఫక్తు ఇండియా బీరు కింగ్ ఫిషర్ సీసా తెచ్చుకున్నాను. ఇటువంటివి రాణీగారికి తెలిసిన యడల నా చెంపలు మొదలైన శరీర భాగాలు నిజంగానే రెండు, మూడంగుళాలు పొంగును కదా! ఆ విధంగా నేను దేశభక్తిని తనివి తీరా ఆస్వాదిస్తూండగా, సదరు టీవీ వారు "ఇదిగో అంతకంటే గొప్ప పాట ఈ నాటి గీతం" అని మరొకటి ప్రసారం చేశారు. అందులో చిరిగిపోయిన జీన్సు వేసుకున్న ఒకానొక హీరో, తను వేసుకున్న గొట్టాం పంట్లాంలో అంతకంటే పెద్ద చిరుగులే కాక, పై భాగంలో వాటికి మేచింగ్ కన్నాలతో ఒకానొక హీరోయినూ ఇద్దరూ కలిసి "దునియా మొత్తం దున్నే జాతి" మరియు" "దిమాగ్ లోనే దమ్ములున్న దేశం మనదీ" అని ఈ తరం దేశాభిమానాన్ని అర్థరహితంగా, అర్థనగ్నంగా నర్తించారు. అది చూస్తుండగా నా కిగ్ ఫిషర్ కుంకుడుకాయ పులుసులా వికారపెట్టింది.

ఈ పరిస్థితిలో మెగా స్టార్ గారు "ప్రజారాజ్యం" స్థాపించడం బాగానే ఉంది కానీ, ఆయన రాజకీయాలకి కొత్త కాబట్టి నాకు తోచిన కొన్ని సలహాలు చెప్తే, అది కూడా బాగానే ఉంటుంది అని కూడా అనిపించింది. ఎటొచ్చీ నా బోటి సబ్ జీరో మినీ స్టార్‌కి – ఆయన తెలుసు కానీ, ఆ మెగా స్టార్ కి నేను తెలియదు కావునా, ఆయన తిరుపతి సభలకి వచ్చిన పది లక్షల మందీ మెగా మాటలే వింటారు కాబట్టీ ఆయనకి నా సలహాలు ఎలా అందుతాయో తెలిసి చావడం లేదు. అందుకే ఈ ఇంటర్నెట్లోరాసి పారేస్తే, ఎప్పటికయినా ఆయన సలహాదారులు చదవకపోతారా, ఆయనికి చెప్పకపోతారా అని నా ఆశ.

నా మొదటి సలహా ఏమిటంటే "మంచి అయితే మైకులో చెప్పు. చెడు అయితె చెవిలో చెప్పు". నాకు ఈ సూత్రం చాలా ఇష్టం. అప్పుడప్పుడు నేను కూడా పాటిస్తూనే ఉంటాను కానీ, వెధవది, మైకు ముందుకు రాగానే ఒళ్ళు తెలియదు. ఈ రోగం మన రాజకీయ నాయకులకు మరీ ముదిరిపోయి, మైకు లాటి పదార్థం కనపడగానే రెచ్చిపోతారు.

ఉదాహరణకి "మన రాష్ట్రంలో చాలా మంది రోజూ పట్టెడు అన్నం కూడా తినలేని దారుణ పరిస్థితిలో ఉన్నారు" అనే చెడ్డ మాట మైకులో చెప్పడం ఎందుకు చెప్పండి. ఆ సంగతి వాళ్ళకీ, మనకీ, అందరికీ తెలిసిన విషయమే కదా!. ఇదేమయినా "యురేకా" లాగా కనుక్కున్న సరికొత్త విషయమా? దాని బదులు "నేను ఎలక్షనులో నెగ్గిన మరుక్షణం నుంచీ , రోజుకు పట్టెడు అన్నం తినలేని వారందరూ మా ఇంటికి భోజనానికి వచ్చెయ్యండి, లేక పోతే ఒక వారం మా ఇంటికీ, తర్వాతి వారం మా ఉపనాయకుడి ఇంటికీ, మూడో వారం ఆహార శాఖామంత్రి గారింటికీ వెళ్ళి కడుపునిండా భోజనం చేసే ఏర్పాట్లు చేస్తాను" అని ఆ సమస్యకి పరిష్కార మార్గం చెప్పవచ్చు కదా! అలాంటి మంచి మాట మెగా స్టారుగారు మైకులో చెప్పారనుకోండి, వైస్సారు గారూ, నాయుడుగారూ ఊరుకుంటారా? "అబ్బే, మా ఇంటికి రండి, మేము వంకాయ కూర కూడా పెట్టుదుము" అనో,

"చికెన్ టిక్కా స్పెషల్‌గా ప్రతీ ఆదివారం చేయిస్తాం" అనో న్యూ ఇంప్రూవ్డ్, డీలక్స్ వాగ్దానాలు చేస్తారు కదా. ఇటువంటి వాగ్దానాలు ప్రతీ ఊళ్ళోనూ ఉన్న ఎమ్మెల్యే గారి తరఫున కూడా చేస్తే, వచ్చినట్టు వాళ్ళు కూడా పది మంది వంటవాళ్ళని పెట్టుకునే ఏర్పాట్లు ముందు చేసుకుంటారు. అప్పుడు ఏ పార్టీ వారు నెగ్గినా సమస్య పరిష్కారం అయిపోయింది కదా. నా ఈ బ్రిలియంట్ ఐడియాకి మూల కారణం ఏమిటంటే, ఈ పార్టీ వారు, వారి నాయకులూ పూర్వం పీవీ గారూ, పొట్టి శ్రీరాములు వారిలా కాకుండా అందరూ చాలా ధనవంతులే కాబట్టి, వంతుల వారీగా బీద వారికి భోజనం పెట్టగలరు, పెట్టించ గలరు కదా.

అలాగే మెగా స్టార్ గారు తిరుపతిలో మాట్లాడుతూ, "మన తెలుగింటి స్త్రీలు అందరినీ ఆడపడుచులుగా భావించాలి. వారికి మగవారితో సమాన హోదా కలిగిస్తాము" అని కూడా అన్నారు అని వార్తలలో చెప్పారు. ఇక్కడ నాకు కొంత ప్రోబ్లెం వచ్చింది. ఒకటేమిటంటే ఈ ఆడబడుచుల డైలాగు ఒరిజినల్ కాదు. ఇదివరలో ఒకానొక ముఖ్యమంత్రిగారు ప్రతీ సభలోనూ అదే ప్రవచించేశారు. అంతియునే కాక, మెగా స్టార్ గారికి ఎప్పుడో వివాహం అయిపోయింది కాబట్టి మిగిలిన ఆడంగులందరినీ ఆడపడుచులవలె భావించమని చెప్పడం తేలికే. కానీ, పాపం పెళ్ళికాని యువతరం ఓటర్ల గతేమిటీ? మరదళ్ళలా భావించుకోడానికి బీసీ, యెస్సీలకి కోటాల లాగా కనీసం కొంత శాతం లేడిస్ అయినా కేటాయించాలి కదా. పైగా మగ వారితో సమాన స్థాయి ఇవ్వాలంటే, ఇప్పుడు ఉన్న ఆడతారలలో ఎవరో ఒకరిని ఆడ మెగా స్టార్ అని తనతో దీటుగా నిలబెట్టి మాట నిలబెట్టుకోవాలి కదా. అలా బెట్టుకోరు అని మనందరికీ తెలుసుగా. అందుచేత ఆయన ఏ చెయ్యాలంటే ఎవరు అందరికీ ఆడపడుచులుగా ఉండదల్చుకుంటారో, ఎవరు ఎందరికీ మరదళ్ళుగా ఉంటే బావుంటుదనుకుంటారో ముందే ఆడంగుల ప్రత్యేక ఎన్నికల ద్వారానో, లాటరీ పద్ధతిలోనో నిర్ణయించి, అప్పుడు మైకులో ఆ మంచి మాటలు చేప్తే బావుంటుంది అని ఆయనకి నా మెగా సలహా.

ఉన్న మాట చెప్పొద్దూ, నన్ను ఏ రాజకీయ నాయకులైనా నన్ను అడగాలే కానీ, ఇలాటి మాంచి సలహాలు ఎన్నయినా చెప్పగలను. అసలు సమస్య ఏమిటంటే, నా స్వవిషయంలో చాలా మంది మైకులో నా గురించి మంచి మాటలే చెప్తారు కానీ, చెడు మటుకు వాళ్ళ చెవుల్లో వాళ్ళే చెప్పుకుంటారు. నా చెవిలో చెప్పి చావరు.

"అదే నీతో వచ్చిన గోల. వాళ్ళు చెప్తూనే ఉన్నారు కానీ, నీకు ఒక చెవి అసలు వినపడదు. రెండోది సగం, సగం వినపడుతుంది. ఎలాగా నీతో చావడం" అంటుంది మా క్వీన్ విక్టోరియా రోజుకో సారి.

✡✡✡

# అమెరికాలో అంధకారం

*(సెప్టెంబర్ 20-21, 2008 తారీకులలో డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ ..అనగా  తెలుగు సాహితీ సమాఖ్య వారి దశవార్షికోత్సవాలకి ఒక ప్రత్యేక అతిథి హోదాలో కాకుండా సాధారణ ప్రతినిధిగా వెళ్ళాను. కానీ అనుకోకుండా ప్రధాన సభానిర్వాహకులైన శ్రీ మద్దిపాటి కృష్ణారావు, విజయ దంపతుల ఇంట్లోనే నాకు ఎంతో ఆత్మీయంగా ఆతిధ్యం ఇచ్చారు. రెండు రోజుల పాటు దిగ్విజయంగా జరిగిన ఆ సభల అనంతరం, ఆదివారం రాత్రి వారింట్లో మంచి పార్టీ ఏర్పాటు చేశారు. అందులో కొంత మంది పాటలు పాడడం, కవిత్వం చదవడం చేస్తూ అందరినీ ఆనందింపజేస్తుండగా నాకు కూడా ఆవేశం వచ్చి వారి ఆనందాన్ని నివారిస్తానేమో అనే నా అనుమాన పిశాచాన్ని పక్కకి నెట్టి, ఈ క్రింది కథ* ఆశువుగా చెప్పాను. అటువంటి ఉన్నత సాహితీవేత్తల ఆనందానికి ఇటువంటి

*ఆర్డినరీ కథతో అంతరాయం కలిగించాను అని ఎవరైనా ఏమన్నా కోప్పడతారేమో, ఎందుకైనా మంచిదని అని వెంటనే మేడమీద బాపూ గారి బొమ్మలతో అలంకరించబడిన గెస్ట్ రూం అనే అంత:పురంలోకి వెళ్ళి నిద్రపోయాను. అఫ్ కోర్స్, అది "మందు" ప్రభావమని అందరూ అనుకుంటారనీ, అనుకున్నారనీ నాకు తెలుసనుకోండి. అది వేరే సంగతి. అసలు సంగతి ఏమిటంటే, హ్యూస్టన్ నుంచి డిట్రాయిట్ వెళ్ళే విమాన ప్రయాణంలో ఊహామాత్రంగా తట్టిన ఈ కథ ఎక్కడా కాగితం మీద పెట్టి, విమర్శకులకి పంపించి వారి - ఆమోదం తీసుకునే అవకాశం లేక పోయింది. ఇదే ఆ సభల స్వీయ రచనా విభాగంలో చదువుదామనుకున్నాను కానీ, భయం వేసి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు అనే వంకతో దాటేశాను. ఎప్పుడూ కాగితం మీద కానీ, కంప్యూటర్ మీద కానీ, పెట్టకుండా, కేవలం అప్పటికప్పుడు బుర్రలో నుంచి బైటకి రప్పించి ఆశువుగా నేను కథ చెప్పడం ఇదే మొదటి సారి. ఆ "గొప్ప" చెప్పుకోవడానికే ఈ ఉపోద్ఘాతం. అంత కంటే ముఖ్యంగా అన్ని కష్టాలూ, నష్టాలూ భరిస్తూ, అద్వితీయంగా పది సంవత్సరాలు ఎవరు ఎక్కడ ఎలా చేసినా నాకు ఎంతో ఇష్టమైన తెలుగు సాహితీ సమావేశాలని నిర్వహిస్తూ, దశవార్షికోత్సవాలని జరుపుకున్న డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ వారికి నా అభివందనలు ఈ పత్రికా ముఖంగా తెలియజేయడం ఈ మందు మాటకి...సారీ, సారీ, ఈ ముందు మాటకి ప్రధాన కారణం... అన్నట్టు, 1998లో డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ మొదలు పెట్టిన ఏడాదే ప్రారంభించిన ద్వైవార్షిక టెక్సస్ సాహిత్య సదస్సు సెప్టెంబరు 27, 2008న ఆస్టిన్‌లో జరిగింది. వేరే మెటీరియల్ లేక, ఇదే కథ అక్కడ కూడా చదివి పారేశాను. ఇప్పుడు "కంప్యూటర్" మీద పెట్టే అవకాశం వచ్చింది కాబట్టి కొంచెం మార్పులూ, చేర్పులూ, కూర్పులూ చేశాను. ఇక కథారంభం.... )*

మా చిన్నప్పుడు కాకినాడలో అప్పుడప్పుడు కరెంటు పోయేది. అది రోజూ అలవాటే అయినా, ఒక సారి మటుకు కరెంటు అదే పోతగా ఎక్కడికో పోయి మూడు నెలలగా తిరిగి రాలేదు. ఇక తప్పదురా అనుకుని అబ్రహాం లింకనూ, లాల్ బహదూర్ శాస్త్రి లాటి వారు వీధి లాంతర్లల్లో చదువుకుని గొప్పవాళ్ళు అయ్యారు కాబట్టి హరికేన్ లాంతర్లు పెట్టుకుని ఆ మసక వెలుగులోనే మదన మరియూ అభిసారికలూ, డిటెక్టివ్ పుస్తకాలూ నేనూ, శివరామూ, చంటిగాడూ కంబైన్డ్ స్టడీస్ చేస్తుంటే "పాపం, వీళ్ళు గొప్పవాళ్ళు అవుదామనుకుంటున్నారు" అనుకుని మా నాన్న గారు అటకమీద నుంచి ఎప్పటివో పెట్రోమాక్సు లైట్లన్నీ దింపి, వెలుగు పెంచి మా కొంప ముంచారు. మూడు నెలల తరవాత కరెంటు వచ్చిన మర్నాడు మా ఇంట్లో దొంగలు పడి హరికేన్ లాంతర్లూ, పెట్రోమాక్సు లైట్లూ దొంగతనం చేశారు.

ఇదంతా ఇప్పుడు ఎందుకు జ్ఞాపకం వచ్చిందంటే, కిందటి వారం మా హ్యూస్టన్‌లో అర్ధరాత్రి పూట "ఐక్" అనే హరికేన్ వచ్చి చచ్చింది. ఇదే "హరితాంధ్ర" లో అయితే "హరికేన్ హిడింబి" అని ఆప్యాయంగా పిలిచుకునే వారు. హఠాత్తుగా కరెంటు పోగానే, - ఆలోచిస్తే, మా అటక మీద హరికేన్ లాంతర్లూ , పెట్రోమాక్సు లైట్లూ లేవు కదా, ఇప్పుడెలాగరా భగవంతుడా అని నేను ఎప్పుడూ అలవాటులేని పద్ధతిలో స్వగతంగా, ప్రకాశంగా..అంటే అంటే పౌరాణిక నాటకంలో దుర్యోధనుడి తిట్లు స్టేజి మీద పక్కనే ఉన్న కృష్ణుడికి వినపడవు కానీ ఆడియన్సులో ఆఖరి బెంచీ మీద కూచుని చుట్టతాగుతున్న సింహచలానికి స్పష్టంగా వినపడే టైపులో ఘాటిగా దేవుడి పేరు తల్చుకున్నాను.

నా నోట "భగవంతుడా" అనే మాట వినపడగానే లేచి పరిగెట్టబోయి, సోఫాని గుద్దుకుని నాయనోయ్ అని మా మామ గారినీ, బల్లని గుద్దుకుని అమ్మోయ్ అని మా అత్త గారినీ, అందం కోసం మా లివింగ్ రూములో ఒక మూల పెట్టిన "ఓక్" జాతి అనబడే ఒకానొక ఒక వృక్షరాజాన్ని గుద్దుకుని నేను ఎప్పుడూ కలుసుకొనని, నాకు బొత్తిగా తెలియని కుయ్యోవ్ గారిని, మొర్రోవ్ గారినీ తలుచుకుంటూ, అటువంటి అడ్డమైన చెత్త వస్తువుల్ని అడ్డంగా పెట్టినందుకు నన్ను అష్టోత్తర దూషణాలతో అర్చన చేస్తూ అర్జంటుగా మా ఇంట్లో ఉన్న దేవుడి గదిలోకి పరిగెట్టింది మా క్వీన్ విక్టోరియా. కారణం ఏమనగా తను రోజూ దేవుడుకి దీపం పెట్టుకునే అలవాటు

వలన ఆ గదిలో దూది వత్తులూ, అగరొత్తులూ, కొవ్వొత్తులూ మరియు అగ్గిపెట్టా కూడా అక్కడ గారంటీగా ఉండును కదా. ఈ వత్తులన్నీ బాత్ రూంలో కూడా వెలిగించుకో వచ్చు కదా...అందుకూ ఆ పరిగెట్టడం అని బ్రిలియంట్‌గా ఊహించేశాను. ఆవిడకి – ఆశాభంగం నిరాశ కలిగించిన యడల నాకు మిగిలేది అంధకార బంధురం కాబట్టి ఆ వత్తుల్నీ అన్ని చోట్లా వెలిగించి, ఆ దేవుడి గదిని చీకట్లో ముంచేశాను. ఆఫ్టరాల్, మన బోటి మానవమాత్రుల జీవితాలలో వెలుగు నింపడానికే కదా భగవంతుడు ఎప్పుడూ తంటాలు పడుతూ ఉంటాడు. అందుచేత ఇటువంటి అత్యవసర పరిస్థితులలో ఆయన తాలూకు లక్షవత్తుల్నీ వాడేసి ఆయన లివింగ్ రూంని అంధకార బంధురం చేసినంత మాత్రాన దయామయుడైన ఆ దేవుడు  అలుగుతాడని నేను అనుకోను.

అసలు అందరి ఇంట్లోనూ దేవుడు గది ఉపయోగం ఏమిటో ఇప్పుడు "హరికేన్ హిడింబి" ధర్మమా అని నాకు ఖచ్చితంగా తెలిసింది.

అసలు సమస్య ఇప్పుడే వచ్చింది. ఈ అమెరికా అంధకారం మమ్మల్ని వహించక ముందు  నేనూ, మా ఆవిడా బాజా టీవీ ముందు కూచుని ఆవిడ మహేశ్ బాబునీ, నేను జినేలియానీ చూసుకుంటూ, ఒకరి మొహం ఒకరు చూడకుండా హాయిగా సంసారం చేసుకునేవాళ్ళం. ఇప్పుడు ఆ బాజా టీవీకి బిజిలీ లేదు కాబట్టి, బూజు పట్టిన గాజులా అయిపోయింది కాబట్టి ఆ కొవ్వొత్తుల వాసనలో, ఆ మసక మసక చీకట్లో మా క్వీన్ విక్టోరియా మొహం నేనూ, నా మొహం ఆవిడా చూసుకుంటూ కూర్చొన వలసిన అవసరం అనుకోకుండా వచ్చింది కదా! అఫ్‌కోర్స్, మా ఆవిడ తాలూకు సుందర వదనారవిందం కలకాలం జాగ్రత్తగా చూసుకుంటాను అని మా ఆస్థాన పురోహితుడు అమ్మిరాజు గారికి మా పెళ్ళినాడే ప్రమాణాలు చేశాను కాబట్టి నాకు పెద్ద ఇబ్బంది లేదు కానీ, పాపం నా యొక్క వదనాన్ని అదే పనిగా చూడడం సదరు క్వీన్ గారికి కించిత్తు విచారం కలిగించినదేమో అని నాకు అనుమానం వచ్చింది. ఎందుకంటే, హరికేన్ హిడింబి ధర్మమా అని నా వదన వీక్షణ సదవకాశం కలిగిన మరుక్షణమే ఆవిడ సీలింగు కేసీ, తుప్పు పట్టిన సీలింగు ఫాను రెక్కల కేసీ చూచుట మొదలు పెట్టింది. అంతే కాదు హుష్, హుష్ అనే శబ్దాలూ, ఖర్మ సిద్ధాంతమూ, మరియూ పండగ నాడు కూడా పాత మొగుడు లాంటి సామెతలు జ్ఞాపకం తెచ్చుకోవడం నా అనుమానాన్ని ధృవీకరించింది.

ఆ డైలాగులు వినలేక, అప్పుడు నాకు ఎప్పటిలాగానే ఒక బ్రిలియంట్ ఆలోచన వచ్చి చచ్చి, వెంఠనే బేటరీలతో పనిచేసే రేడియో పెట్టాను ఘాటిగా.  రేడియోలో అప్పుడే జార్జి బుష్ గారు సూటూ, బూటూ వేసుకుని తన వైట్ హౌస్‌లో హాయిగా కూచుని హిడింబి బాధితులకి తమ ప్రగాఢ సంతాపాన్నీ, సానుభూతినీ తెలుపుతున్నారు. ఆయన ప్రసంగంలో నాకు నిఘంగా అనందం కలిగించిన విషయం ఏమిటంటే నాకూ, మా ఆవిడకీ మా సంసారాన్ని బాగు చేసుకునే ఉచిత సలహాలు, చిట్కాలు పబ్లిగ్గా అమెరికాలో అందరూ వింటూ ఉండగా ఇచ్చారు. కనీసం వారం దాకా మీకు కరెంటు రాదు, టీవీ పనిచెయ్యదు కాబట్టి, హాయిగా ఒకళ్ళ కళ్ళలోకి మరొకరు చూసుకుంటూ, ఊసులాడుకుంటూ ఆడుతు పాడుతు పనిచేసుకోండి, ఇదివరలో సంసార సౌఖ్యాన్ని పోగొట్టుకున్న యడల మళ్ళీ పుంజుకోడానికి ఇదే కదా ప్రకృతి ప్రసాదించిన మరొక సువర్ణావకాశం అనే టైపులో ఆయన ఇచ్చిన సలహా మరి మా ఇద్దరికే వర్తిస్తుంది కదా!  అందువలనే బుష్ గారు కేవలం నాకూ, మా క్వీన్ గారికీ వ్యక్తిగతంగా ఈ సలహా ఇచ్చారు సుమా అనుకోవడంలో నాకు ఏ విధమైన సందేహమూ లేదు.

తను ఇంకా పవర్‌లో ఉండగానే పవర్ లేని ..అంటే కరెంటు లేని నన్నూ, మా ఆవిడనీ ఆయన పబ్లిగ్గా రేడియోలో అంత – ఆప్యాయంగా గుర్తించడం నేను ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాను. అదే విషయాన్ని నేను మా క్వీన్ గారికి తెలియపరచగానే "నీ మొహం బుష్" అనే వాదనతో మొదలు పెట్టి కట్టి పారేయ్ వెధవ రేడియో అని వారు ఆజ్ఞాపించారు. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే రాణీ వారు చెప్పిన నీ మొహం బుష్ అనగా నా యొక్క పెర్సనల్ ముఖం బుష్ వలె ...అనగా ఒకనొక ముళ్ళ పొద వలె ఉన్నది అనియూ, ఆ వెధవ రేడియో అనే మాటలో వెధవ అన్న విశ్లేషణం రేడియోకి కాక బహుశా ఆయన ఇచ్చిన సలహా తనకి బొత్తిగా

నచ్చక అమెరికా అధ్యక్షులవారికి అన్వయించాలేమో అని నాకు అనుమానం వచ్చింది. కారణమేమనగా బుష్ గారి పరిపాలనలో కిందటి సంవత్సరంలో ఆవిడ తాలూకు స్టాక్ మార్కెట్ పెట్టుబడులు సగం శాతం క్షవరం అవుటయే కాక, కేవలం ఆయన వల్లమాలిన ప్రభుత్వ విధానాల వలననే ఈ నాడు హరికేన్ హిడింబి దండయాత్ర చేసి అమ్మాయి కాపురం సీరియల్ ఎపిసోడ్ నెంబర్ 245 చూడకుండా కొంపముంచాడు బుష్ అని ఆవిడ నిశ్చితాభిప్రాయం.

ఆవిడ ఆజ్ఞానుసారం మసక మసక చీకట్లో, కొవ్వొత్తుల వాసనలో యల్లారీశ్వరిని ఎందుకో జ్ఞాపకం చేసుకుంటూ నేను రేడియో వాల్యూం తగ్గించబోతూండగా ఒక రేడియో ప్రకటన వచ్చింది. అది వినగానే మామూలు ప్రజల తక్షణావసరాలు తీర్చడంలో అమెరికా ఎంత ముదంజ వేసిందో, మన చిరంజీవి గారు ఇక్కడికి వచ్చి ఎంత నేర్చుకోవాలో నాకు మరొక సారి తెలిసింది. అమెరికా నిజంగానే చాలా గొప్ప దేశం అని నేనూ రోజూ అనుకునే అభిప్రాయం ద్విగుణీకృతం అయింది. ఎందుకంటే బుష్ గారు నోరు మూయగానే వచ్చిన ఆ కమర్షియల్ సారాంశం ఏమిటంటే "హరికేన్ హిడింబి వలన మీకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఈ క్రింది నలభై ప్రాంతాలలో మా హెయిర్ షాఫ్ట్ అనే మంగలి షాపులూ, వెంఠనే మీ బట్టలు మీరే ఉతుక్కోడానికి వాటి అనుబంధ సంస్థలైన చెడ్డీ వాషింగ్ మేడ్ ఈజీ అనే చాకలి దుకాణములూ రోజుకు ఇరవై గంటలూ తెరిచే ఉంటాయి. బేటరీలతో పనిచేసే సమస్త కత్తులూ, కఠారులతో కూడా మీకు అద్భుతంగా క్షవరం చేయ గలం. ఈ ఆపత్కర పరిస్థితులలో  కూడా మీకు ఇతోధికంగా క్షవరం చెయ్యడమే మా ప్రధాన లక్ష్యం. వివరాలు అమెరికాక్షవరం.కాం లో చూడండి. తనివి తీరా క్షవరం చేయించుకోండి. అంతేగాక సమస్త చెడ్డీల మరకలనూ ఈ చీకటిలో కూడా ఉతకగలం, ఉదయం ఎనిమిదిలోపుగా ఒక మగ చెడ్డీకి రెండు ఆడ చెడ్డీలూ ఉచితం". తరువాత ఎక్కడ మంచి సారా, మజ్జిగా, దొరుకుతాయో కూడా అనేక వాణిజ్య ప్రకటనల ద్వారా నాకు తెలిసింది. ఇదే ఇండియాలో అయితే ప్రతీ అడ్డమైన మంత్రీ ఈ అవకాశం తీసుకుని  హెలికాప్టర్లలో తిరుగుతూ మైనారిటీ వర్గాలకీ, వెనక బడిన కళలకి తాము ఎంత సేవ చేస్తామో వివరిస్తారు కానీ దైనందిన కాలకృత్యాల గురించి నోరు మెదపరు. దటీజ్ ఆంధ్రా, దిసీజ్ అమెరికా!

అవన్నీ వింటూ ఇప్పుడు అర్జంటుగా క్షవరం చేయించుకోవాలా, చెడ్డీ వాషింగ్ మొదలుపెట్టాలా, మంచి సారా దొరుకు ప్రదేశానికి వెళ్ళాలా అని ఆలోచిస్తూండగా "ఇదిగో, ఇప్పుడు నన్ను ఇలా చీకట్లో వదిలేసి ఆ డిట్రాయిట్ వెళ్ళావంటే చంపేస్తాను. నువ్వు వెళ్ళకపోతే వాళ్ళ పదేళ్ళ పండగ ఏమీ ఆగిపోదు. నువ్వు వెళ్ళినంత మాత్రాన నీకు పట్టు శాలువాలు ఎలాగా కప్పరు, ఆఫ్టరాల్, యువార్ ఓన్లీ యాన్ ఆర్డినరీ ఫెలో ....." అని మా ఆవిడ హుంకరించింది.

"ఇక్కడ ఉంటే చంపగలవు కానీ, నేను అక్కడికి వెళ్ళిన ఎటుల చంపగలవు?" అని అనుకోకుండా ప్రశ్నించాను.

"సర్లే వెధవ తెలివి తేటలూ, బుష్ మొహమూ నువ్వూనూ...నువ్వు డిట్రాయిట్ నుంచి వెనక్కి వచ్చాకే చంపుతానులే, డోన్ట్ వర్రీ" అని నాకు భరోసా ఇచ్చింది మహారాణీ.

అందుకే ఆవిణ్ణి మొట్టమొదటి సారిగా అమెరికా అంధకారంలో వదిలేసి నా తాలూకు ఆస్తినంతా... అవును, అరడజను చెడ్డీలతో సహా... సద్దుకుని, పెట్టే బేడాతో డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ అధ్యక్షులు మద్దిపాటి వారింటికి వచ్చేశాను. ఈ అవతారం చాలించేద్దాంలే, సాధించినది చాలు, అని రేపు నిర్ణయించుకుంటే వెంఠనే హ్యూస్టన్ వెళ్ళిపోతాను. అక్కడ దుష్ట శిక్షణ జరుగును కదా. లేదూ, ఇంకా కొన్నాళ్ళు బతికి, అందరినీ చావగొడదాం అని నిశ్చయం చేసుకుంటే, మద్దిపాటి కృష్ణారావు మరియు విజయ గారి మేడమీదే ఉండిపోతాను. అఫ్ కోర్స్, అలాటి పెర్మనెంట్ అరేంజ్‌మేంట్ విషయం వారికి ఇంకా చెప్పలేదనుకోండి. అది వేరే విషయం కదా! ****

# జబ్బాలో తంబూరు – తంబూరాలో మంటలు

**గత అనేక సంవత్సరాలుగా ఇండియా నుంచి ఒక అమ్మాయి** అమెరికా వచ్చి అన్ని చోట్లా పాటలు పాడి అందరినీ అలరింపచేస్తోంది. తను పాటలు పాడేటప్పుడు మన భారత రాష్ట్రపతి....సారీ రాష్ట్రపత్ని ప్రతిభా పాటిల్ లాగా జుట్టు కూడా కనపడకుండా నిండా ముసుగు వేసుకుని, సరదా పాటలు కూడా మొహం సీరియస్‌గా నా మొహంలా పెట్టేసి పాడకుండా, కొన్ని పాటలకి స్టేజి మీద అటూ, ఇటూ తిరుగుతూ, సొగసుగా, మరీ మితిమీరకుండా కాస్త వగలు వలకపోస్తూ డాన్స్ చెయ్యకుండానే చేస్తున్నట్టు మభ్యపెడుతూ అందరినీ ఎంటర్టైయిన్ చేస్తుంది ఆ అమ్మాయి.. అవి వింటూ కుర్రకారు స్టేజి మీదకి పరిగెట్టి సినిమా నృత్యాలు చేస్తూ ఉంటారు. మధ్యాహ్నంలో ఉన్న వాళ్ళు, పక్కనే ఉన్న కడుంగడు ధర్మపత్ని కోప్పడునేమో అని భయం, భయంగా, సీటులోనే కూర్చుని, కాళ్ళూ చేతులూ తెగ ఆడిస్తూ, తొందరపడి పెళ్ళి చేసుకుని ఎంత బుద్ధి తక్కువ పని చేశామో అని విచార పడుతూ ఉంటారు. ఇక వృధ్యాప్యంలో ఉన్న వాళ్ళు మనసు ఎంత హుషారుగా ఉన్నా మొహంలో వేదాంతం ఫీలింగులు పెడుతూ అందరూ ఏమనుకుంటారో అనుకుంటూ కదలకుండా తన్మయత్వంలో ఉంటారు. ఇవన్నీ చూసి తాము ఎంత గొప్ప తెలుగు సాంస్కృతిక కార్యక్రమం చేస్తున్నామో అని ఆర్గనైజర్లు అటూ, ఇటూ హడావుడిగా స్టేజి మీద, కిందనా తిరుగుతూ ఉంటారు, చొక్కాలకి బేడ్జిలూ, చేతిలో కాగితాలూ పెట్టుకుని.

ఇలాటి వాటిల్లో నేను గమనించిన ముఖ్య విషయం ఏమిటంటే, కర్నాటక సంగీతమునకు కేవలం తలకాయ మాత్రమే ఆడించవలయును, కానీ సినిమా పాటలకి సర్వావయములూ ఎటు పడితే అటు తిప్పుకోవచ్చును. నో ప్రోబ్లెం. అన్నట్టు ఆ అమ్మాయి ఆ మధ్య ఎక్కడో కనబడినప్పుడు "మీరు రాసినవన్నీ చదువుతూ ఉంటాను, నేను మీ పంకాని సార్" అని చెప్పింది. ఎందుకో నా పంకాలు, అనగా నా ఫాన్స్...అనగా అభిమానులంటే నాకు భలే ఇష్టం. ఆ అమ్మాయి అంటే నాకు కూడా అభిమానం అని అని వేరే చెప్పక్కరలేదు కదా! ఆ అమ్మాయి పేరు విజయలక్ష్మి.

ఇది ఎందుకు జ్ఞాపకం వచ్చింది అంటే ఆ మధ్య నేను ఒకానొక గొప్ప అమెరికా నగరంలో జరిగిన ఒక కార్యక్రమానికి వికలాంగుల సంక్షేమానికి విరాళం సంపాదిద్దామని నా తల తాకట్టు పెట్టుకుని వెళ్ళాను. అక్కడ హాలు బయట ప్రాంగణంలో అరవై పదులు దాటిన ఒకానొక మానవుడు నన్ను ఆప్యాయంగా పలకరించాడు. ఎందుకో తెలియదు కానీ ఈ నాటి తెలుగు సినిమాలూ, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అమెరికా అంతటా జరిగే రికార్డింగ్ డాన్సు కార్యక్రమాల వలన తెలుగు భాష, సంస్కృతి ఎంత ఎలా క్షవరం అయిపోతున్నాయో నాతో చెప్పి చాలా మంది విచారపడుతూ ఉంటారు. ఏదో గెంటుకొస్తున్నాను కానీ, అసలు తెలుగు సంస్కృతి అంటే ఓ అంటే ఢం తెలియని నేనే దొరికానా వాళ్ళకి?

ఆయన నాతో మాట్లాడుతున్నప్పుడు స్టేజి మీద ఎవరో త్యాగరాజ కృతి పాడుతున్నారు. అది మొదలుపెట్టగానే ఈ ఒకానొక మానవుడు గారు లేచి బయటకి వచ్చేసి, నన్ను తగులుకున్నాడు. మన సంస్కృతి గురించి నాకు బొత్తిగా ఏమీ తెలియదని నేను నొక్కి వక్కాణిస్తే ఈ ఒకానొక మానవుడు బాధ పడతాడేమో అని నేను ఘంటసాల, బాలమురళి, అక్కినేని, అప్పుడప్పుడు పొట్టి శ్రీరాములు, శ్రీశ్రీ , కృష్ణశాస్త్రి మరియు కృష్ణదేవరాయలు, తెనాలి రామకృష్ణ లాటి పేర్లు నా చిన్నప్పటి గోళీక్కాయలాడుకున్న మిత్రుల ముద్దు పేర్ల లాగా వాడుతూ కర్ర విరగకుండా, పాము చావకుండా, నా బండారం బయట పడిపోకుండా నా కల్చర్ స్పీచ్ ఆయనతో మేనేజ్ చేస్తూ

ఉండగా మరొక నలుగురు పోగయ్యారు. అందరి వయసూ అరవై దాటే ఉంటుంది. వెంఠనే ఇంకా పుంజుకుని శ్రీనాధుడు మొదలైన వారిని కూడా నా గోళీక్కాయ వాళ్ళతో కలిపి అనర్గళంగా ఆరు బయట నా ఉపన్యాసం సాగుతూ ఉండగా, లోపల స్టేజి మీద ఒకానొక ఆర్గనైజరు గారు తెలుగు సూటూ, బూటూ వేసుకుని ఇప్పుడు "మీరు ఇంత సేపూ అసహనంగా, అనగా మహా ఓపిగ్గా బిగపెట్టుకుని ఎదురు చూస్తున్న సింగర్ విజయ లక్ష్మి గారు .... " అని ఆవేశపడుతూ ఇంకా ఏమిటో అంటూ ఉండగా విజయలక్ష్మి పేరు వినపడగానే త్యాగరాజు గారి ధర్మమా అని నిద్ర పోతున్న తెలుగు సాంస్కృతీపరులంతా ఠకీ మని లేచి, హహా కారాలూ చేస్తూ, ఈలలు వేస్తూ కలకలం లేవదీస్తున్నారు. ఈ ఒకానొక మానవుడూ, మరియూ పోగయిన నలుగురూ హఠాత్తుగా నన్నూ, నా ఉపన్యాసాన్ని నడి సముద్రంలో నావ లాగా గాలి వాటుకి వదిలేసి కిటకిటలాడుతున్న హాలులో ఉన్న మానవ సముద్రంలోకి పరిగెట్టారు ఒకరిని ఒకరు తోసుకుంటూ.

నా అహం దెబ్బతిన్నా కూడా అందరిలోకీ ఈ ఒకానొక మానవుడి పెర్ఫార్మెన్స్ చూసి నాకు ముచ్చట వేసింది. ఎందుకంటే ఈ ఒకానొక మానవుడు హఠాత్తుగా నా చెయ్యి విదిలించుకుని, హాలులో తన సీటుకి వెళ్ళిపోయి, పక్క కుర్చీలో కూర్చున్న లావు పాటి పిన్ని గారి కాళ్ళ దగ్గరా, అవతలి సీటులో ఎందుకొచ్చిందిరా భగవంతుడా అనుకుంటూ తన సెల్ ఫోన్ మీద కంప్యూటర్ గేం – ఆడుకుంటూ, అమ్మా, నాన్నల కల్చర్ బలవంతం మీద ఈ దీపావళి కార్యక్రమానికి వచ్చి చస్తున్న పదహారేళ్ళ హైస్కూలు కుర్రాడి కాళ్ళ దగ్గరా, తన సీటు కిందా అర్జంటుగా వెతికి పారేసి మొత్తానికి తన వీడియో కెమెరా పట్టుకుని స్టేజి దగ్గర ముందు సీటులోకి పరిగెట్టాడు సింగర్ విజయలక్ష్మికి తనివి తీరా వీడియో తియ్యడానికి.

అది చూడగానే నాకు బుద్ధుడు గారు జ్ఞాపకం వచ్చారు. ఈ అరవై ఏళ్ళు బడిన ఒకానొక మానవుడికి రెండు ముఖ్య లక్షణాలు ఉన్నాయని నాకు జ్ఞానోదయం అయింది. స్పీడుగా పరిగెట్టుటకు ఆయనకి తన స్వీయ బొజ్జ అడ్డు వచ్చుచున్నదనీ, అయినా అది అధిగమించి గిన్నెస్ బుక్కులోకి ఎక్కగలిగే అంత వేగం ఆయన అందుకున్నారంటే అదే కదా విజయ లక్ష్మి మరియు సినిమా పాటల పవరు అనేది మొదటి విషయం. రెండోది నేను సకల వేళలలోనూ సులభంగా గుర్తుపట్టే "హిపాక్రసీ" అనే తెలుగు రోగం. ఈ రోగానికి తెలుగులో ఏమంటారో తెలియని రోగం నాది. ఈ రోగం ఆయనకి నఖశిఖ పర్యంతమూ ఉందేమో అని నా అనుమానం. లేకపోతే, అక్కడ రెండు గొబ్బిళ్ళ పాటలకి చిన్న పిల్లల డాన్సులూ, కూచిపూడి నృత్యాలూ, ఒకటో రెండో త్యాగరాజ కీర్తనలూ, మొదలైనవి జరుగున్న రెండు గంటలూ వాటిల్లో ఒక్కటి కూడా చూడకుండా బయట జోలె పట్టుకుని అమాయకంగా నుంచున్న నన్ను పట్టుకుని నా చేతిని ప్రేమగా నిమురుతూ, తన గోకుడు, నిమురుడు మొదలైన ఆప్యాయమైన, వెకిలి చేష్టలతో నాకున్న చిన్న సాంస్కృతిక "దురద" ని అదేపనిగా గోకుతూ మన సంస్కృతి మీద నాకు క్లాసు పీకుతున్న ఈ ఒకానొక మానవుడు విజయలక్ష్మి వగలు వీడియో తియ్యడానికి అంత అవస్థ పడుతున్నాడంటే, దాని అర్థం ఒకటే. ఈయనకి నిజంగా కావలిసినది సినిమా పాటల ఎంటర్‌టైన్‌మెంట్. అబద్ధంగా కావలిసినది నాబోటి గాళ్ళతో చెప్పుకోడానికి, గొప్పగా ఫీలయిపోడానికి కావలిసినది మన తెలుగూ కల్చర్ లెక్చర్. దొరికామో, మన పని ఉట్టిదే! ఇదే హిపాక్రసీ అంటే. అమెరికాలో ఈ హిపాక్రసీ అడుగడునా కనపడుతుంది. అరవై ఏళ్ళు దాటిన వారికి మరీనూ.

అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. ఈ ఒకానొక మానవుడు అమెరికాలో వెల్లి విరిసిన రెండు జాతీయ స్థాయి సంఘాల నాయకుడు. అందులో ఒకటి TANTA...అనగా తంటా సంఘం. రెండోది జట్కా సంఘం. అంటే JATCA అనగా ....Joint Association of Telugu Cultural Associations అనే ఇంగ్లీషు పేరులో ఉన్న మొదటి మాటల మొదటి అక్షరాలూ కలిపి నేను పెట్టుకున్న ముద్దు పేరు. అమెరికాలో అన్ని సంఘాలకీ ఈ రెండు పేర్లూ అతుకుతాయి. కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్.

ఇంత వరకూ బాగానే ఉంది కానీ, గత నాలుగు వారాలగా నా బుర్ర పనిచెయ్యడం మానేసింది. ఎందుకంటే, నేడో, రేపో అమెరికాలో రాబోయే మరొక జాతీయ స్థాయి సంఘానికి నేను ఏ పేరు పెట్టుకోవాలో నా మట్టి బుర్రకి తట్టి చావడం లేదు.

ఉదాహరణకి ప్రస్తుత పరిస్థితులబట్టి ''పెంట'' అనే పేరు పెడతాను అనుకోండి. మిలియన్లకొద్దీ డాలర్లు పోగేసినా, ఎడా పెడా ఖర్చుపెట్టేసి రచనల పోటీలో నెగ్గిన వారికి ఇవ్వాల్సిన 250 డాలర్ల పారితోషికం కూడా ఇవ్వడానికి నానా అవస్థాపడుతున్న ఒకానొక సంఘానికి తమని విమర్శించడానికే నేను అలాటి పేరు పెట్టాను కోపం వస్తుంది కదా. మరి నా అసలు ఉద్దేశం **P**ure **E**ntertainment by **N**ew **T**elugu **A**ssociation అనే కొత్త సంఘానికి నేను ప్రతిపాదించదల్చుకున్న పేరులో ఉన్న మొదటి అక్షరాలే కదా! ఇలాటి పేరు పెడితే ''పేరులోనే ఉన్నది కదా పెన్నిధి'' అనుకుని కొత్త సంఘం ఎంతో చిత్తశుద్ధితో ఒక యువకుడి కార్యక్రమానికి లక్ష డాలర్ల పైగా ఖర్చు పెట్టి మూడు గంటలు సినిమా పాటలు పాడించుకుని ఇటీవలి అమెరికా లో తెలుగూస్ నెలకొల్పిన సరికొత్త రికార్డుని బద్దలకొడుతుంది కదా!

పోనీ కొత్త దేశవాళీ సంఘానికి ''మంట'' అంటే **M**odati **A**merica **N**ational **T**elugu **A**ssociation లాటి పేరు పెట్టుకుంటే అమెరికాలో అందరికీ ఈ MANTA తమ గురించే అనే అనుమానంతో విజయలక్ష్మి రంగ ప్రవేశం చేసే వరకూ నా ''సరదా దురద'' ని గోకి పారేసిన ఈ ఒకానొక మానవుడికీ, అలాటి నాయక బృందానికీ ఒళ్ళు మండి పోవచ్చు కదా! ఎందుకంటే, ఈ మధ్యనే వారి సంఘంలో అధ్యక్షుణ్ణి మిగిలిన వారూ, మిగిలిన వారందరినీ అధ్యక్షుల వారూ పదవులనుంచి తొలగించుకుని, అందరూ రోడ్డున ఎండలో పడి మండిపడిపోతున్నారు కదా!

ఈ కథ చదివాక, నన్ను కూడా పదవిలోంచి వెళ్ళగొడతారేమో అని నా అనుమానం. అనుమానం ఏమిటీ, గేరంటీయే. నన్ను ఊడగొట్టడానికి అధ్యక్షుల వారికి, లేదా గవర్నింగ్ బాడీ వారికి కానీ, జార్జి బుష్ కి కానీ రాజ్యాంగం ప్రకారం అధికారం ఉందో లేదో మా లాయర్‌ని అడగాలి.

అందరికీ నేనిచ్చే సలహా ఏమిటంటే తంటా మరియు జట్కా నాయకులందరూ కలిసి ఒక ''రాజీవ్ మరియు ఎన్టీర్ అగ్నిమాపక దళం'' అనే కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. కావాలంటే ఇండియా నుంచి ఏదో ఒక పశువర్ధక శాఖా మంత్రినో కూడా ఈ కమిటీలో వేసుకోవచ్చు. ఎప్పుడైనా ఇప్పటిలా నువ్వా, నేనా అనే గొడవలు వస్తే ఈ ద్విపక్ష కమిటీ వారు ఆ నిప్పుని ఆర్పడమో, లేక పూర్తిగా ఖాండవ వన దహనం చేసెయ్యడమో చేసి మన సంస్కృతి తగలడకుండా కాపాడతారు. ఇద్దరూ దొందూదొందేకాబట్టి నా బ్రిలియంట్ సలహా పాటిస్తే అందరూ సుఖులే! ఏకవ్యక్తి సంఘాలకి వచ్చే ఇబ్బందులల్లా పెళ్ళాం, పిల్లలూ లేదా మొగుడు మూలాన్నే కాబట్టి, వాళ్ళ మానాన వాళ్ళు సంఘసేవ చేసుకుంటూ పోతారు.

ఉన్నమాట చెప్పొద్దూ... దేశవ్యాప్తంగానూ, ఊరూరానూ కొత్త, కొత్త సంఘాలు వెల్లి విరిసి, రోజు వారీ కార్యక్రమాలు చాలా, చాలా ఉంటే నాకు సంతోషంగానే ఉంటుంది. ఎందుకంటే ఏ సినిమా వాసనా లేని ఆటలో అరటి పండూ, చారులో కరివేపాకు లాటి మా బోటి కళాకారులు పట్టుకోడానికి మరి కొన్ని రాజకీయ అగ్రకుల నాయకుల కాళ్ళు బరిలోకి దిగుతాయి కదా! అమెరికాలో తమ ప్రావీణ్యం ప్రదర్శించుకునే అవకాశం కోసం పట్టుకోడానికి ఎన్ని కాళ్ళు ఉంటే అంత ఆనందం. అదే నా శునకానందం.

ఎన్ని కొత్త సంఘాలు వచ్చినా, ఏ కారణం చేత వచ్చినా, నాయకుల దగ్గర నుంచీ అనామకులందరికీ ఈ రోజుల్లో కావల్సినది జినేలియా, మహేశ్ బాబులే. తమ కులాభిమానమే, తమ రాజకీయ ప్రలోభమే. అందుకే రాబోయే కొత్త, కొత్త సంఘాల నాయకుల కళ్ళు బారెడేసి ఉంటాయి అనే అపోహ ఎవరికీ ఉండకూడదు. కొత్త సంఘం అంటే కంబళీ తీసేసి గింబళీ వెయ్యడం లాంటిదే!

జరుగుతున్న కథ ఏమిటంటే, అక్కడా, ఇక్కడా కూడా నాయకులందరూ తెలుగు సంస్కృతికి తాంబూలాలు ఇచ్చేసి తన్నుకు చస్తున్నారు....అగ్నిహోత్రావధానుల సలహా పాటిస్తూ. ఎక్కడ చూసినా డాలర్ ధనబలం ఎక్కువ, సంస్కృతీ ధన బలం తక్కువే!.

''గుడ్ బోయ్, ఈ సారి నా గురించి ఒక్క మాట కూడా రాయలేదు. పైకొస్తావ్ ఇలా ఉంటే!'' అనే ప్రగాఢమైన డైలాగు తో కూడిన టెంకి జల్ల రకీ మని తగలగానే, రాత్రి ఒంటిగంట అయింది అనీ, మా క్వీన్ విక్టోరియా ఆనందంగా నిష్క్రమించిందనీ నాకు తెలిసిపోయింది. ఎంతయినా బ్రిలియంట్ ఫెలోని కదా! ***

# నా బుల్లి తెరంగేట్రం – ఫన్నీ బోన్ విరుగుడు కార్యక్రమం

**ఇంచుమించు** ఏడాది కిందట నా బుర్రలో ఒక పెద్దాయన ఒక చిన్న అగ్ని కణం వేశాడు. అది క్షణ, క్షణానికీ పెరిగి పెద్దదవుతూండగానే ఆనంద మోహన్ అనే మిత్రుడు దానికి ఆజ్యం పోసి పెద్ద మంటలా చేశాడు. ఇలాటి విషయాలలో నాకూ ఆంజనేయ స్వామికీ పోలికలు చాలా ఉన్నాయి. ఉదాహరణకి, మా ఇద్దరికీ ఎడా, పెడా పొగిడించుకోవడం అంటే అగ్నికి ఆజ్యం పొయ్యడం లాంటిదే. ఎవరైనా పొగిడారో, అది నిజమే అనుకుని రెచ్చి పోతాం. నా విషయంలో మటుకు, నన్ను ఎవరైనా ఏ కారణానికైనా పొగిడారో ఠకీ మని ఒప్పేసుకుంటాను. లేకపోతే వాళ్ళు మళ్ళీ మనసు మార్చుకుని నా గురించి నిజాలు చెప్పేస్తారని భయం. ఇంతకీ ఈ అగ్ని కణం పేరు "టీవీ సీరియల్ తీయుట". నేను సరదాగా వ్రాసిన కథల్ని ఆధారంగా చేసుకుని ఇండియాలో ప్రేక్షకులని చితగ్గొట్టడానికి ఒక టీవీ సీరియల్ ఎందుకు తీయకూడదూ అనే ఈ "దురాలోచన" క్వీన్ విక్టోరియాకి అస్సలు నచ్చలేదు అని తెలియగానే నాకు నచ్చిపోయింది. మా పెళ్ళినాటి ప్రమాణాల ప్రకారం నేను యెడ్డెం అంటే తను తెడ్డెం అనాలి. ఆవిడకి ఏదైనా నచ్చితే, నాకు నచ్చకూడదు. అదీ జనరల్ రూలు..

అసలు కొన్ని టీవీ సీరియల్స్ చూచుటకే అలా ఉంటే ఇక తీసినచో ఎటుల ఉండునూ అని స్వయంగా తెలుసుకోవాలని గత మూడు వారాలగా హైదరాబాదులో తిష్టవేశాను. బుల్లితెరకి కథ అల్లడం, కథని చెప్పే పద్ధతి, అంటే స్క్రీన్ప్లే రాయడం మనకి అలవాటు లేని పనులు కాబట్టి, నాకు ట్యూషన్ చెప్పడానికి మహానుభావులు గొల్లపూడి మారుతీ రావు గారు కూడా నాతో తిష్ట వేశారు. పనిలో పనిగా నాకు ఒక టీవీ దర్శక-నిర్మాత గారిని పరిచయం చేస్తూ, యాధాలాపంగా ఆయనతో "ఈ ఎన్నారై గారికి మీ టీవీ సీరియల్ లో ఏమన్నా చిన్న పాత్ర ఇస్తే బావుంటూందేమో" అని సూచించారు మారుతీ రావు గారు.. ఇవ్వక పోతే కొంప మునుగుతుందా, ఇచ్చినయడల ఈ ఎన్నారై తన కొంపముంచునా అని తేలక ఆ నిర్మాత గారు సాయంత్రం చెప్తాను సార్ అని హడావుడిగా నేనూ, మారుతీ రావు గారూ బసచేసిన సినిమా వారు ఉండే గెస్ట్ హౌస్ నుండి జారుకున్నారు. ఆయన నిష్క్రమణ వేగం వీక్షించగానే నేను - ఆశించిన నకులుడి టైపు, లేదా నెంబర్ 420 పోలీసు వెంకట స్వామి పాత్ర కూడా మనకి వచ్చే యోగం లేదు , అందువలన నేనే స్వయంగా ఒక ఎపిసోడ్ తీసేసి, నా పాత్రని నేనే తీర్చిదిద్దుకుందాం, ఆఫ్టరాల్ నేను హైదరాబాదు వచ్చిన పనే అది కదా అని దృఢనిశ్చయంతో గాఢంగా నిద్రపోయాను. కానీ సాయంత్రం ఆ దర్శక-నిర్మాత గారు ఫోన్ చేసి ఎల్లుండి పొద్దున్న ఏడు గంటలనుంచి నాలుగు రోజులు షూటింగు సార్ , కావాలంటే కారు పంపిస్తాను అని విన్నవించారు. "షూటింగు మాట వినుటకు వీనులవిందుగానే ఉంది కానీ ఈ పొద్దున్న ఏడు, నాలుగు రోజులూ లాటి మాటలు నాకు అర్ధమవలేదు. "అయ్యా, నేను ఏడు గంటల లోపుగా నిద్ర లేస్తే సూర్యుడు వెలవెలబోతాడు, సకల చరాచర ప్రపంచమూ గతి తప్పుతుంది, హౌ అబౌట్ నైట్ షూటింగ్, ఆ టైములో నా అందము ద్విగుణీకృతం అవుతుంది" అని ఎంత చెప్పినా ఆయన విన లేదు. పైగా "మీరు వేసే పాత్రకి అందం అక్కర లేదు సర్, సహజంగా ఉంటే చాలు" అని చాలా డేమేజింగ్ గా ఉంటే మాట అన్నాడు. అసలు అసలే సూక్ష్మగ్రాహిని కనక ఆయన మాటలలో నా ఫేస్ వేల్యూ మీద వారికున్న అభిప్రాయం నాకు తెలిసిపోయినా మారుతీ ప్రసాదమైన ఈ టీవీ నటనావకాశాన్ని వదుల్చుకోదల్చుకోలేదు.

ఈ తతంగంలో నేను మొట్టమొదట నేర్చుకున్న నీతి ఏమిటంటే, టీవీలో నటించుటకు మన మొహం ఎలా ఉన్నా పరవా లేదూ...అని. ఇక్కడ మన అనే మాటకి అర్ధం కేవలం నా మొహమే కాదు, మీ మొహం కూడా అని గమనించగలరు. ఆఫ్టరాల్ కవితకి సబ్బు బిళ్ళా, కుక్కపిల్లా అర్హులైనట్లే, టీవీలో నటించుటకు నేనూ, మీరూ కూడా అర్హులే!

నాకొచ్చిన ఈ టీవీ ఆఫరు గురించి వినగానే నేనే దగ్గరుండి నీ బుల్లి తెరంగేట్రం చేయిస్తాను అని మారుతీ రావు గారు కూడా ఆ మర్నాడు పొద్దున్నే షూటింగ్ జరిగే గెస్ట్ హౌస్ కి వచ్చారు. నా కెందుకో తెలియదు కానీ పూర్వం కన్నెచెర విడిపించుకోడానికి గ్రామ కరణాన్ని ఎన్నుకున్న ఫీలింగు వచ్చేసింది. అంటే మహదానందమో, గడ గడ వణుకుడో తెలియని ఫీలింగనమాట.

మేము వెళ్ళగానే "హలో సార్" అంటూనే నన్ను మేకప్ గదిలోకి తీసుకెళ్ళారు. అక్కడ ఆరుగురు కుర్రాళ్ళు ఇక్కడ అమెరికాలో మా క్వీన్ విక్టోరియా ఒక్కర్తీ మా ఇంట్లో అన్ని గదుల్లోనూ దాచుకున్నన్ని రంగులూ, దువ్వెన్నలూ, క్రీములూ, సబ్బులూ మొదలైనవన్నీ వెరసి అర టన్ను బరువున్న మేకప్ సామానుతో నన్ను ఆహ్వానించారు. అందులో ఒకడు ముందు నా మొహాన్నీ, ఇతర శరీరభాగాలనీ ఓఢ్రం మంగలి వాళ్ళలాగా ఎడా, పెడా వాయించేసి, రంగులు వేశాడు. అద్దంలో చూసుకోగానే, చెప్పొద్దూ, అసలే మాంచి రంగులో ఉంటానేమో, ఈ రంగులు కూడా వెయ్యడంతో, నా ఫేస్‌లో ఇంకా మనం తెర మీద చూడని నాగ చైతన్య ..అంటే నట సమ్రాట్, యువ సామ్రాట్‌లకు వారసుడైన నవ యువ సమ్రాట్ అనమాట....ఆ భావి బాక్సాఫీస్ స్టార్ వాలకం నాలో కూడా కనపడింది. నేనూ, నాగ చైతన్యా ఒకే సారి తెరంగేట్రం చేసున్నామనీ, ఆ విషయం యావత్ ఆంధ్రప్రదేశ్ అంతా త్వరలోనే గుర్తిస్తారనీ అప్పుడు నాకు తోచిన మరొక చారిత్రాత్మక సత్యం. అంతకు ముందు రోజే అక్కినేని కుటుంబమూ, రామానాయుడు గారూ కలిసి కొన్ని కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నాగ చైతన్య తెరంగేట్రం చేయించి అవస్త పడుతుంటే, నేను హాయిగా, కాణీ ఖర్చులేకుండా కన్నె చెర విడిపించుకుంటున్నాను. అదే మా ఇద్దరికీ తేడా. ఆ విధంగా నేను ఆనంద సముద్రంలో మునిగి తేలుతూండగా మరొక కుర్రాడు అర్జంటుగా నా చొక్కా, లాగూ నా పెర్మిషన్ లేకుండానే చింపి, విప్పేసి అవతల పారేశాడు. మరొకడు నా ఆరు డాలర్ల జోళ్ళు లాగేసి బూట్లు వేశాడు. ఈ విధంగా పరాయి మగాళ్ళ చేత బట్టలు వేయించుకుంటుంటేనే నాకు పెద్ద స్టార్ అయిపోయిన ఫీలింగు వచ్చేసింది. మొత్తం వేషధారణ అంతా అయ్యాక నేను వెయ్యబోయే వేషం పోలీస్ ఇనస్పెక్టరు వేషం అనియూ, నేను మొదట ఆశించిన భటుడు వెంకట స్వామి పాత్రకి ఇంకో నలుగురు నా పక్కనే వేషాలు వేయించుకుంటున్నారనీ తెలిసింది. కానీ నా హైటు విషయం, ముఖ్యంగా, ఈ భటపాత్రధారులు మరీ అంత పొడుగ్గా ఉండుట బుల్లి తెర ప్రేక్షకులు ఆమోదిస్తారో లేదో మా దర్శకుడు గారు విచారించారో లేదో నాకు తెలియదు. ఆ మాటకొస్తే మా క్వీన్ విక్టోరియా గారు కూడా నా టీవీ తెరంగేట్రం ఆమోదిస్తారో, లేదో, నిరసన ప్రదర్శనలు చేయుదురో లేదో నాకు తెలియదు. ఈ విధంగా టీవీలో నటిస్తున్న వైనం మా క్వీన్ విక్టోరియా గారికి అమెరికా తిరిగి వెళ్ళాక కానీ ఎలాగా చెప్పదల్చుకోలేదు కాబట్టిన్నీ, ఆ తరవాత నన్ను ఆవిడ తిరస్కరించినా అప్పటికే నా పేరూ, నాగ చైతన్య పేరూ అన్ని పేపర్లలోనూ పడిపోతుంది కాబట్టి మా ఇద్దరికీ కాంప్రమైజేషన్ అయిపోతుందనీ నాకు అనుభవరీత్యా తెలుసును. ముందు చచ్చు పనులు చేసేసి, తరవాత "నన్ను చమించు" అని సినిమాలలో ఆఖరి సీను డైలాగులు చెప్పుటా, తను క్షమించుటా మాకు అలవాటే.

నేను నటించవలసిన మొట్టమొదటి సీను నా పోలీస్ స్టేషన్‌లో ఇనస్పెక్టర్ హోదాలో కూచుని నా ప్రేయసి ఫొటోకి పువ్వులతో పూజచెయ్యడం. ఇక్కడ ఈ మహానటుడికి వచ్చిన మొదటి సమస్య ఏమిటంటే, నేను మేకప్ రూం నుంచి మెట్లు ఎక్కి పోలీస్ స్టేషన్ సెట్టు వరకూ నడచివెళ్ళుట. ఆ ప్రయత్నంలో నేను గమనించినది ఏమిటంటే, నా బూటు సైజు ఎనిమిది అయితే, మేకప్ కుర్రాడు నాకు తొడిగిన బూటు సైజు పద్దెనిమిది. నేను మొదట నా రెండు కాళ్ళూ ఒకే బూటులో పెట్టేసి రెండో బూటు ఏం చెయ్యాలా అని – ఆలోచిస్తున్న తరుణంలో మేకప్ కుర్రాడు "అసలీ యేసం ధర్మవరపు సుబ్రమణ్యం గారు ఎయ్యాలంటండి. ఈ షూసు ఆరి సైజువండి. రేపు మీ సైజ్ తెత్తాం సార్" అని లోపాయికారీ వార్త చెప్పాడు. పైగా ఇవి స్టీలు బూట్లు అయిన కారణాన, ఏనాడూ నేల తాకని సునిశితమైన ఈ ఎన్నారై గాడి పాదాలని నిర్దాక్షిణ్యంగా కరవడం మొదలుపెట్టాయి.. ఇంతటి విపత్కర పరిస్థితిని నేను అధిగమించి, అన్ని మెట్లూ అధిరోహించి, నా ఇనస్పెక్టర్ బల్ల వెనకాల నుంచున్నాను. నా పక్కనే ఉన్న అసిస్టెంట్ డైరెక్టరు గారు "సార్, మీరు ప్రేమపూరితమైన ఫీలింగుతో, ఈ ప్లాస్టిక్ పువ్వులు ఆ అమ్మాయి ఫొటో ముందు పెడుతూ, ఓం భామాయ నమహ:, ఓం

సత్యభామాయ నమహ:, ఓం ప్రాణేశ్వరాయ నమహ:" అంటూ పూజ చెయ్యాలి సార్" అని నా కర్తవ్యం బోధించాడు.

"ఓస్ అంతే కదా" అని నేను నా డైలాగ్ మొదలుపెడుతూండగా రెండు సంఘటనలు జరిగాయి. మొదటిది నేను ఆ అమ్మాయి ఫొటో మొదటి సారిగా చూచుట. దానితో నా ప్రేమ ఫీలింగు పారిపోయి, మొహం పాలిపోయి, చెమట్లు పట్టుట అసంకల్పిత ప్రతీకార చర్యలకి అసలైన ఉదాహరణలుగా చెప్పుకోవచ్చును. ఎందుకంటే ఆ అమ్మాయిని ఏదో తెలుగు సినిమాలో హీరోయిన్‌గా చూశాను. పేరు విద్య. ఆ అమ్మాయే నాకు కూడా హీరోయిన్ అని తెలియుటయే ఈ అసంకల్పిత ప్రతీకార చర్యలకి ముఖ్య కారణం. రెండవది దర్శక-నిర్మాత గారి గంభీరమైన స్టోను. నేను గదిలో అడుగుపెట్టి అరగంట అయినా అంతసేపూ అసిస్టెంట్ గారితో ట్యూషన్ చెప్పించుకున్నాను కానీ ఈయన్ని గమనించనే లేదు. నా డైలాగు అనర్గళంగా చెప్పగానే ఆయన కృష్ణులవారు అర్జునుణ్ణి చూసినట్టు ఒక లుక్ నాకేసి పారేసి "సార్, నేను ముందు కెమెరాకి రోల్ అంటాను. తరవాత ఏక్షన్ అంటాను. అప్పుడే మీరు డైలాగు చెప్పాలి. నేను కట్ అనగానే మీరు అలాగే సీనులోనే కాస్సేపు ఉండి, డైలాగులు మానెయ్యాలి. పైగా అమ్మాయి ఫొటో బదులు కెమేరా కేసి అదేపనిగా చూశారో, నా మీద ఒట్టే" అన్నాడు. ఈ డైలాగు పరవాలేదు కానీ ఆ తరవాత డైలాగే చాలా డేమేజింగ్ గా ఉంది. "మీకు కావాలంటే, కుర్చీలో కూచుని, మంత్రం చదువుతూ పూజ చెయ్యండి, పరవాలేదు. పూజ కాబట్టి కూచోడం నేచురల్ గానే ఉంటుంది. మీ కాళ్ళు కెమేరాలో కనపడవు.". అప్పుడే నేను కూడా నా కాళ్ళకేసి చూసి అంతటి ఫ్రీక్వెన్సీ వాటికి ఎందుకొచ్చిందా అని ఆశ్చర్యపడుతూ, ఆలోచించగా నాకు తోచిన కారణాలు రెండు. మొదటిది కెమెరామన్ నా కేసి చూస్తున్న గుర్రు చూపులు. రెండోది, ఇవాళో, రేపో ఈ అమ్మాయితో.. ఒక అసలు, సిసలు సినిమా హీరోయిన్‌తో రొమాంటిక్ సీన్స్ చేసే అవకాశాన్ని తల్చుకుని వణకిపోవడం. ఆ క్షణంలో మాక్విన్ విక్టోరియా నా పక్కనే ఉంటే, ఎదురుగా కెమెరా ఉన్నా సరే, తకీమని ఆవిణ్ణి వాటేసుకుందును, ఫర్ బోత్ మోరల్ అండ్ ఫిజికల్ సపోర్ట్.

ఒక అరగంట తరవాత లైట్ల ధర్మమా అనియూ, పైన ఉదహరించిన మరి కొన్ని కారణాల వలనా నా గొంతుక తడి ఆరిపోగా "అయ్యా, కాస్త మంచినీళ్ళు తెప్పిస్తారా" అని అడగగానే, డైరెక్టర్ గారు "ప్రొడక్షన్" అని గట్టిగా అరిచారు, ఏంబ్యులెన్స్ వాడు ఆక్సిజన్ అనే టైపులో. వెంటనే ఒక కుర్రాడు అర్జంటుగా పరిగెత్తుకుంటూ వచ్చాడు. "ఇతనే మా ప్రొడక్షన్ మేనేజర్" అని నాకు పరిచయం చేసి "ఒరేయ్" సార్ కి మంచినీళ్ళ్రా, ఫేస్ చూడగానే తెలుసుకో అక్కర్లేదా ? ఇవన్నీ నేను చెప్పాలా?" అని అని మా డైరెక్టరు గారు చెప్పగానే అతను పరిగెట్టుకు వెళ్ళి వేడి మంచి నీళ్ళు తెచ్చాడు. అప్పుడు నాకు జ్ఞాపకం వచ్చింది. ఇండియాలో అందరూ వేడి మంచినీళ్ళే తాగుతారు కాబట్టి, మనం స్పష్టంగా చల్లటి, ఐసు గడ్డలతో కూడిన మంచి నీరు కావలెను అని విన్నవించిన యడల, కనీసం ఫ్రిజిరేటర్ లో దాచుకున్న మినరల్‌వాటర్ బాటిల్ ఇస్తారు. సినిమాలలో ప్రొడక్షన్ మేనేజరు చేసే ఉద్యోగం ఏమిటో నేను మెంటల్ గా నోట్ చేసుకున్నాను.

మరొక అరగంట లైట్ల వేడి తరవాత, నాకు ఒళ్ళంతా చెమటలు పడుతూ ఉండడంతో, చుట్టూ చూడగానే, యూనిట్ లో ఉన్న ఇరవై మంది భుజాల మీదా తువ్వాళ్ళు వేళ్ళాడుతున్నాయి. అవన్నీ పసుపు రంగులో ఉంటే అది టీడీపీ యూనిట్ అనియూ, లేదా పచ్చ రంగులో ఉంటే ప్రజారాజ్యం బాపతు అనీ కనిపెట్టేద్దును. నేను అమెరికాలో టీవీ సీరియల్ తీసేటప్పుడు బరాక్ ఒబామా గారి ప్రిఫరెన్స్ కనుక్కుని, ఆ రంగు తువ్వాళ్ళనే మా యూనిట్ అందరికీ ఇవ్వాలని నిశ్చయించుకుని, తక్షణ సమస్య పరిష్కారార్థం "నాక్కూడా ఒక టవల్ కావాలి సార్" అని మళ్ళీ డైరెక్టర్ గారిని పిలిస్తే వీడెవడ్రా, పెద్ద స్టార్‌లా పోజు కొడుతున్నాడూ అనుకుంటాడేమో అనుకుని ఇందాకటి ప్రొడక్షన్ మేనేజర్ గారిని పిలిచి "అయ్యా, చెమట్లు తుడుచుకోడానికి ఏమన్నా నేప్కిన్ తెప్పిస్తారా" అని అడిగాను. అతను నవ్వి, "నాకు తెలియదు సార్, అది నా డిపార్ట్‌మెంట్ కాదు" అని "కాస్ట్యూం, ఒరేయ్ కాస్ట్యూం" " అని ఒక అరుపు అరిచాడు. వెంటనే మరొక కుర్రాడు చేతులో నేప్కిన్స్ తో వచ్చి, నా మొహం అంతా అద్ది, పట్టిన చెమటా, దానితో వేసిన రంగులూ పోగానే

"మేకప్, ఒరేయ్ పీతాంబరం" అని అరిచాడు. వెంటనే ఇందాకా నాకు చచ్చు బూట్లు వేసిన కుర్రాడే పౌడరూ, లిప్‌స్టిక్కులతో వచ్చి, చెమటతో చెదిరిపోయిన నా మొహాన్ని మళ్ళీ సుందర వదనారవిందంగా తీర్చిదిద్దాడు.



నా మొదటి డైలాగులు విజయవంతంగా చెప్పగానే, మారుతీరావు గారు నా వెన్ను తట్టి, ధైర్యం చెప్పి నా బుల్లితెరంగేట్రం దగ్గరుండి జరిపించి, ఈ సువిశాల టీవీ ప్రపంచంలో నన్ను ఒంటరిగా వదిలేసి నిష్క్రమించారు. పదో, పదిహేనో సీనులు చేశాక మొదటి రోజు షూటింగు రాత్రి ఎనిమిది గంటలకి పూర్తి అయింది. ఆ రోజు నాకు చాలా జ్ఞానోదయం అయింది. మా కెమెరామన్ కి తెలుగు నిఘంటువులో ఉన్న కొన్ని వేల పదాలలో కేవలం మూడు పదాల మీద అవ్యాజమైన అనురాగమూ, ఆ పదప్రయోగంలో తిరుగులేని అథారిటీ ఉన్నాయి సుమా అని నాకు తెలిసిన మొదటి విషయం. ఉదాహరణకి: "ఏరా యెదవా! ఏటీ ఆ లైటు ఇంకా కిందటి పట్టుకోవాలని ఎన్ని సార్లు సెప్పి ఏడ్వనా? ", "లమ్డికే, సార్ మీద షాడోలు పడతన్నాయి. ఎన్నార్లై ఏక్టర్లని అలాగేనేటి సూపించేది? ", "దొంగ నాయాలా? సీనులో నీ యెదవ మొహం ఎందుకురా, నువ్వెనక్కెళ్ళి, లైటు ముందుకెట్టు, లమ్డికే"…. ఆయన తరుచు వాడే మూడు పదాలూ, ఇతర పదజాలం ఈ మూడు వాక్యాలలోనూ ఇమిడి ఉన్నాయని మీరు కూడా గమనించగలరు. పొరపాటున సెట్ లో నటీమణులు లేకపోతే, ఆయన ప్రవచనాలు మరింత ప్రగాఢమైన సంస్కృతభూయిష్టమైన పదాలతో ఉంటాయని కూడా తమరు ఊహించగలరు.

రెండో విషయం, మనం డైలాగులు ముందే కష్టపడి బట్టీ పట్టక్కర్లేదు. అసిస్టెంట్ డైరెక్టర్ గారు పెద్ద గొంతుకతో ప్రాంప్టింగ్ చేస్తుంటే, ఆయన వెనకాలే మనం చెప్పెయ్యొచ్చు. విష్వక్సేనుడు లాటి కష్టమైన మాటలు కొంచెం ముందు ప్రాక్టీస్ చేసుకోవాలంతే. ఒకవేళ తప్పులు చెప్పినా "పరవాలేదు సార్, తరవాత డబ్బింగులో చూసుకుందాం" అని డైరో గారు చాలా సార్లు అభయం ఇచ్చారు. అది ఎంత దారుణమైన పనో తరవాత చెప్తాను. మూడవ సంగతి, వెంకట స్వామి పాత్రధారులు దర్శకులు, కెమేరామన్లు, ఇతర సిబ్బంది చేతా అడ్డమైన తిట్లూ తిందురు. ఉదాహరణకి "ఈ యదవల్ని ఎక్కడ నుంచి తోలుకొచ్చార్రా? అని డైరో గారు సహాయ డైరో గారిని పరి పరి పర్యాయములు విసుక్కోడం, ఆయన సమాధానం చెప్ప లేక నా పెర్మిషన్ లేకుండానే నా భటులని పక్కకి తీసుకుపోయి, వారికి క్లాసు పీకుట నేను గమనించాను. ఈ అనామక భటులు, మరొక ఇద్దరు టెర్రరిస్టుల పాత్రల వారు కాక, నాతో మొదటి రోజున నటించిన ఆయన సుప్రసిద్ధ సినీ నటులు మిశ్రో గారు. ఈయన కె. విశ్వనాథ్ గారి సినిమాలన్నింటిలోనూ కేరెక్టర్ ఏక్టర్‌గా అనేక మంచి పాత్రలు వేసి, ఈ రోజు నాతో వేసే స్థితికి దిగజారిపోయారు. అన్నట్టు, ఈ సీరియల్ లో ఇద్దరు హీరోయిన్లుంటారు. అందులో అసలు హీరోయిన్ చక్రవాకం సీరియల్లో సమీర పాత్ర వేసిన లిఖిత అనే అమ్మాయి. ఆ అమ్మాయితో నాకు రెండు సీన్లు ఉన్నాయి. అందులో చేతులు పట్టుకునే సీను గురించి మా క్వీన్ విక్టోరియాకి నేనే స్వయంగా చెప్పిన యడల మంచిదా లేక ఆమెయే స్వయంగా టీవీ లో చూసిన యడల జరుగు విపత్కరములు ఏ స్థాయిలో ఉండును అనే విషయం తీవ్రంగా ఆలోచించడానికి నేను అమెరికా వెనక్కి వెళ్ళే విమాన ప్రయాణంలో 18 గంటలకి పైగా టైము ఉందిగా!

ఇక రెండో రోజు షూటింగు యధాప్రకారం పొద్దున్న ఎనిమిది గంటలకి మొదలయింది. ఈ రోజు నా జీవితంలో మర్చిపోలేని రోజు. నా పరిస్థితిలో మీరు ఉంటే మీ జీవితంలో కూడా అది మర్చిపోలేని రోజు అని ఖచ్చితంగా చెప్పగలను. ఆ రోజు మొదటి సీనులో నేను ప్రేమించిన సత్యభామ మా పోలీస్ స్టేషన్‌కి వస్తుంది. ఆ అమ్మాయిని చూడగానే, నేను ఆవేశపడి, నా పవిత్ర ప్రేమని వ్యక్తం చేస్తూ, డ్యూటీ కేన్సిల్ చూసుకుంటాను. పోయి ఒక డ్యూయెట్ పాడుకుందాం అని ప్రపోజలు పెడతాను. నేను అసలు హీరోని కాదు కాబట్టి,

ఆ అమ్మాయి నన్ను వాటేసుకుని, అవును, పద అమెరికా పోదాం ప్రియా అనకుండా పోరా ముసలి వెధవా లాటి ఓల్డ్ ఫేషన్డ్ డైలాగులేవో చెప్పి బయటకి పారిపోదామని ప్రయత్నం చేస్తుంది. నా సైడ్ కిక్కులైన కానిస్టేబుళ్ళూ, జైల్లో ఉండి వినోదం చూస్తున్న టెర్రరిస్టుల ముందు జరిగిన ఈ అవమానాన్ని భరించలేక నేను ఆ  అమ్మాయికి అడ్డు పడి, ఆత్మహత్య చేసుకుంటాను, చూసుకో ఆవటా అని బెదిరిస్తాను. అదీ సీను. సీను సింపులే కానీ, అక్కడే వచ్చింది పెద్ద చిక్కు. నేను ఆ అమ్మాయిని ఆపడానికి రెండు అడుగులు స్పీడుగా వెయ్యగానే నా బూట్లు  మార్బుల్ నేల మీద జర్రునజారిపోయి, నన్ను కూడా లాక్కునిపోయి ధభీమని గంటకి 65 మైళ్ళ వేగంతో కిందపారేయుట శరవేగంతో జరిగింది. చెప్పొద్దూ, మా కాస్ట్యూం గాడి మీద భలే కోపం వచ్చింది. ఎందుకంటే, అంతకు ముందు రోజు ధర్మవరపు టైపు సైజు నుంచి నాకు చెప్పకుండా చిన్న సైజు బూట్లు వేసేశారు. హీరోయిన్‌తో రొమాంటిక్ సీను ధోరణిలో పడి నేను, ముందు రోజు పద్ధతిలోలాగా  కరుస్తున్న బూట్లతో తూచి, తూచి అడుగులు వెయ్యడం మానేసి దూసుకుపోయి కిందపడ్డాను. అయినా నేను చెక్కు చెదరకుండా లేచి , నా పాత్రని అద్వితీయంగా పోషించి, సత్యభామచేత భంగపడి, నా ఆఖరి డైలాగులు కూడా చెప్పేసి ఇంటికెళ్ళిపోయాను. అంటే అంతటితో ఈ టివీ సీరియల్ లో నా పాత్ర నిష్క్రమించిందనమాట. నాకు చెప్ప లేదు కానీ, యూనిట్లో ముప్పై మంది, హీరోయిన్లిద్దరూ, అసలు హీరో అయిన శ్రీరాం అనే యువకుడు కూడా నా సహజ నటనాచాతుర్యాన్ని ఓవర్ యాక్షన్ అనుకుని నవ్వుకున్నారో లేక పాపం అమెరికా ఆముదం వృక్షంగారు ఆంధ్రాలో నటించలేక కిందపడ్డాడని జాలి పడ్డారో నాకు తెలియదు. నాకు తెలిసినదల్లా నేను నా ఒరిజినల్ క్రియేటివిటీ  ఉపయోగించి ఆఖరి డైలాగుల్లో "చూశావా, నీ గురించి నేను చెయ్యి కూడా విరగ్గొట్టుకున్నాను" అని స్క్రిప్టులో  లేని డైలాగు చెప్పగానే డైరెక్టరు కట్, కాట్ అని బావురుమనడం, అసిస్టెంట్ డైరో గారు కుయ్యో, మొర్రో అనడం, ఆ పిల్ల కిసుక్కున నవ్వడం, కెమేరామన్ గారు తన ఫేవరెట్ పదజాలాన్ని నా మీద ప్రయోగించబోయి చటుక్కున నాలిక కరుచుకోవడం నేను గమనించాను. ఈ కారణాలు అన్నిటి వలనా  రెండో రోజు సువర్ణాక్షరాలతో చరిత్రలో లిఖించదగిన రోజు అని నా నమ్మకం. ఇటువంటి ప్రయత్నమే తను కూడా చేస్తే బావుంటుంది అని నాగ చైతన్యకి కబురు పంపించాను.

మొత్తానికి  రాత్రి మా వాళ్ళ ఇంటికి వెళ్ళగానే, "అదేరా, నీ ఎడం చెయ్యి అలా వంకరగా ఉంది. ఏమన్నా కొత్త రకం ఫేషనా, అయినా ఈ వెధవ వేషాలు మనకి అచ్చిరావని చెప్పానా? అని ఎవరో అనగానే జరిగిన విషయం చెప్పాను. ఎందుకైనా మంచిదని - మర్నాడు మా పెద్ద మేనగోడలు నన్ను ఒక ఎముకల డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళింది.నేను ఎన్నారై అని తెలియగానే ఆయన నా చేతికి ఎక్స్-రే తీయకముందే ప్లాస్టర్ వేసేద్దామని నిర్ణయించుకున్నారని నా అనుమానం. ఎక్స్-రే తీసిన కుర్రాడు మహేశ్ బాబులాగా ఎగిరెగిరి పాడుకుంటూ, సుకుమారమైన నా ఎడం చేతిని ఎక్స్-రే నెపంతో అటూ, ఇటూ స్పీడుగా తిప్పి, తిప్పి నా ప్రాణం తీశాడు. ఏదో కొంచెం బెణికిన నా చెయ్యి ఈ కుర్రాడి ఓవర్‌ఏక్షన్ వలన మాత్రమే నిజంగా విరిగిందని  నా అసలు అనుమానం. మరొక విశేషం ఏమిటంటే, మన చేతికి రేడియస్ అనీ హ్యూమరస్ అనీ రెండు పెద్ద ఎముకలు ఉంటాయిట. అందులో నాకు  హ్యూమరస్ ఎముకలో వెంట్రుక వాసి విరిగిందిట. అంతవరకూ నా బుర్రలో కాస్తో కూస్తో హ్యూమర్ ఉంది అని తెలుసు కానీ హ్యూమరస్ అనే శరీరం భాగం ఉందనీ తెలియదు. కింద పడగానే విరిగి చస్తుందనీ తెలియదు నాకు.

డాక్టరు గారు ఎంతో ప్రేమతో కట్టిన రెండువేల రూపాయల భారీ కట్టుతోనే  తరవాత రెండు రోజులూ షూటింగు చేసి అవతల పారేశాను. ఈ చేతి విరుగుడు పూర్తిగా కనపడకుండా నాకు ఈ సారి పొడుగు చేతుల ఖాకీ చొక్కా వేశారు. అయినా, టీవీ లో సరిగ్గా చూస్తే నా అరచేతి మీద ఎర్రటి గుడ్డ కట్టు కనపడుతుంది. పైగా షూటింగ్ అంతా ఒక క్రమంలో లేదు కాబట్టి నేను ఈవీలో వచ్చే మొదటి సీనులో చేతికట్టు, తరవాత  కట్టు లేకపోవుట, మళ్ళీ చేతికట్టుతో నేను ప్రత్యక్షమవుట జరగవచ్చును.

నాలుగు రోజుల షూటింగ్ తరవాత, డబ్బింగు మొదలెట్టారు. నమ్మండి, నమ్మక పొండి డబ్బింగు స్పెషలిస్ట్ పేరు షారుక్ ఖాన్. సౌండ్ ఇంజనీర్ పేరు కమల్ హసన్. అటువంటి గొప్పవారితో నా తెరంగేట్రం లోనే కలిసి పనిచెయ్యడం నా అదృష్టం. నా దురదృష్టం

ఏమిటంటే, ప్రపంచంలో అన్నింటికన్నా కష్టమయిన పని మన వాయిస్‌కి మనమే డబ్బింగు చెప్పుకోవడం అని తెలియకపోవడం. ఎందుకంటే, మనం షూటింగ్ లో ఏ మాట, ఎంత స్పీడుగా చెప్పామో, ఎక్కడెక్కడ పాజ్ ఇచ్చామో, సరిగ్గా, తూచా తప్పకుండా అలాగే డబ్బింగులో చెప్పితీరాలి. లేక పోతే పెదాల కదలిక, మాటలూ పొత్తు కుదరవు. ఈ నాటి సినిమాలలో మాట వినబడిన అరగంటకి పెదాలు ఎందుకు కదులుతాయో నాకు ఇప్పుడు అర్థం అయింది. నేను డబ్బింగ్ చేసిన మొదటి రోజు కూడా చారిత్రాత్మకమే. ఎందుకంటే, నాజన్మలో అంతటి కఠిన శిక్ష ఎప్పుడూ అనుభవించ లేదు.

చెప్పొద్దూ, నా మొహం నేనే టివీలో చూసుకుంటూ, నా గొంతుక నేనే వింటూ అబ్బురపడుతుంటే ఉంటే మొదటి గంటా, రెండు గంటలు బాగానే ఉంది. డబ్బింగ్ స్టూడియోలో ఒక గదిలో నేను టీవీ మానిటర్ ముందు కూచుంటాను. అవతలి గదిలోంచి షారుక్ ఖాన్ నేను నటించిన ఒక సీను చూపిస్తూ "సార్, ఈ పైలట్ చూసుకుని, డైలాగ్ స్పీడూ, పాజ్‌లూ గుర్తుపెట్టుకోండి. నేను టేక్ అనగానే మీరు  డైలాగులు అదే విధంగా చెప్పండి" అంటాడు. ఓస్ ఇంతే కదా అని నేను చెప్పగానే, కొంప మునిగిందని మనకి అర్థం అయిపోయింది. నా ఫేసు, యాక్షనూ ఎన్ని సార్లు చూసుకున్నా ఈ వెధవ లిప్ మేచింగు మటుకు ఒక పట్టాన కుదరదు. సెట్లో అమ్మాయి ముందు,  లైట్లలో చెప్పిన డైలాగుకీ, ఈ స్టూడియోలో ఒంటరిగా, ఫేనూ, ఎయిర్ కండిషనింగూ లేని సౌండ్ ప్రూఫ్ గదిలో షారుక్ మరియు కమల హాసన్‌ల ఎదురుగా కూచుని చెప్పిన డైలాగుకీ పొంతన కుదరడం కష్టమే కదా! ఒక్కొక్క వాక్యానికి, కనీసం అరడజను టేకులతో ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటలనుంచి తెల్లవారు ఘామున మూడింటి వరకూ నా గొంతుక నేనే చెప్పలేక, వినలేక చచ్చాను. పైగా అన్ని గంటల సేపూ, ఎంత సూపర్ స్టార్‌ని అయినా, నా యొక్క మొహమే టీవీ మానిటర్ లో చూస్తూ చావు మంత్రాలలాగా చెప్పిందే చచ్చినన్ని సార్లు చెప్పాల్సి వచ్చేసరికి ఎవరికైనాసరే, అంత కంటే కఠినాతి కఠినమైన శిక్ష మరొకటి ఉంటుందా చెప్పండి. ఈ దెబ్బకి నాకు సినీనటులంటే అఖండమైన గౌరవం వచ్చేసింది.

అసలు జోకు ఏమిటంటే దర్శక-నిర్మాత గారు కానీ, అసిస్టెంటు గారు నాకు అసలు కథ ఏమిటీ, అందులో నా పాత్ర ఏమిటీ నేను ఎలా నటించాలీ అనే విషయాలు ఎప్పుడూ చెప్పలేదు. నాకు డైలాగు చెప్పడం, దాన్ని బట్టి, నేను నాకు తోచిన విధంగా అది చెప్పుకుంటూ పోవడం జరిగింది. మొత్తం షూటింగ్ అంతా అయిపోయాకే నా కేరెక్టర్ నాకు అర్థం అయింది. అందువలన నా నటన నా మొహంలా ఉంటుందనియూ, నంది లేదా ఆస్కార్ అవార్డులకి ఆస్కారం ఏ మాత్రం లేదనియూ ఖచ్చితంగా చెప్పగలను.

ఇంతకీ ఈ టివీ సీరియల్ కథ ఏమిటంటే సత్య అనే ఒక హీరో ఉంటాడు.. అతని ప్రేయసో, భార్యో నాకు తెలియదు కానీ ఆ అమ్మాయి పేరు భామ. ఈ పాత్ర వేసినదే లిఖిత, చక్రవాకం ఫేం. మిశ్రో గారు ఈ అమ్మాయికి బాబాయ్. ఆయన నిజానికి ఒక బిచ్చగాడు.  ఈ హీరో కి ఒక విచిత్రమైన రోగం ఉంటుంది అదేమిటంటే, అతను సాయంత్రం ఆరు గంటలు అవగానే ఠకీమని అమ్మాయిలా మారిపోతాడు. అంటే సైన్స్ ఫిక్షన్ టైపు కథ అన్నమాట. ఈ రెండో హీరోయిన్ పేరు సత్యభామ. వేషం వేసిన అమ్మాయి నిజం పేరు విద్య. పూర్తి పేరు విద్యాధరి అనుకుంటాను. సత్య అనే వాడు రాత్రి పూట సత్యభామగా ఉన్నప్పుడు ఒక రోజు ఇద్దరు టెర్రరిస్టులని పట్టుకుని, పోలీస్ స్టేషన్ లో అప్పగిస్తాడు....లేదా ఇస్తుంది. అందులో నేను ఇన్‌స్పెక్టర్ ని అనమాట. ఈ సత్యభామని చూడగానే, ఘోటక బ్రహ్మచారినైన నేను చలించి, ఆ అమ్మాయిని ప్రేమిస్తాను. ఈ కథ ఇంత వరకూ చెప్పగానే, మా పిల్లలు ముగ్గురూ కెవ్వున అరిచారు.

"యూ ఫెల్ ఇన్ లవ్ విత్ ఏ ట్రాన్స్‌వెస్టయిట్?...".మా పెద్దమ్మాయి మొహంలో కత్తివాటుకు రక్తపు చుక్క లేదు.

"హౌ కుడ్ యు డూ సచ్ ఏ స్టుపిడ్ థింగ్?"  రెండో అమ్మాయి ఠకీమని లేచి నుంచుంది.

"మామీ ఈజ్ గోయింగ్ టు కిల్ యు ఎగైన్..." అని మా అబ్బాయి ఏం చెయ్యాలో తెలియని అమాయక స్థితిలో పడిపోయాడు.

"ఏడిశారు. నోరుముయ్యండి, వెధవ అమెరికా వాగుడూ మీరూనూ. దిస్ ఈజ్ ఏన్ ఆంధ్రా స్టోరీ. ఎనీ థింగ్ గోస్" అని కసురుకుని,

"ఈ సీరియల్ పేరు భామా-సత్యభామా. ప్రతీ ఆదివారం రాత్రి ఏడున్నర నుండి ఎనిమిదన్నర వరకూ, ప్రైం టైం లో Zee Telugu TV Channel లోనూ, ఇంటర్నెట్ లో http://www.idesitv,com/zeetelugu.php లోనూ వస్తుంది. నేను నటించిన మూడో నాలుగో ఎపిసోడ్స్ డిశంబర్ 14 లేదా 21 నుంచి నాలుగు వారాలు వస్తుంది. చూడకపోతే చంపేస్తాను" అని మా పిల్లలని బెదిరించాను. పాఠకులని కూడా చూసి తరించమని కోరుతున్నాను. చూసి, నచ్చితే ధరించండి. నచ్చకపోతే భరించండి.

"దానికేం, చూద్దాం కానీ, ఇంతకీ నువ్వు సత్యని పగలు చూసి ప్రేమించావా? లేక సాయంత్రం ఆరు దాటాక సత్యభామని చూసి ప్రేమించావా?... అయాం జస్ట్ క్యూరియస్"...మా క్వీన్ విక్టోరియా మాటలు విని ఇదేం టీవీ సీరియల్ భాగోతం రా బాబోయ్ అనుకున్న మాట మటుకు వాస్తవం. చెయ్యి విరగ్గొట్టుకుని ఈ కథావ్యాసమంతా ఒంటి చేత్తో, ఒకే వేలితో టైపు కొట్టుట కూడా అసలు, సిసలు నిజం. అన్నట్టు, ఈ అమెరికామెడీ కబుర్లు శీర్షిక దీనితో ఆపేసి, వచ్చే నెల నుంచి మరొక పేరుతో ఓల్డ్ వైన్ ఇన్ న్యూ బాటిల్ టైపులో తిరిగివస్తాను. అంతవరకూ శలవ్.

****